ప్రకటనల కోసం సంప్రదించండి
98483 28698

తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
Estd : 2002
# జనంసాక్షి
www.janamsakshi.org
బుధవారం 21.05.2025 | సంపుటి :11 సంచిక : 302 | పేజీలు :12 వెల : రూ. 4/-
RNI NO.TELTEL / 2013 /50370

సామాన్యుని స్వరం
JANAMSAKSHI TV





## 'బీటింగ్ రీట్రీట్' పునః ప్రారంభం

ఛండిగఢ్(జనంసాక్షి): పహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో సరిహద్దులో పాకిస్థాన్ సైనికులతో 'బీటింగ్ రీట్రీట్' నిలిపివేసిన విషయం తెలిసిందే. తాజాగా పంజాబ్‌లోని భారత్-పాక్ అంతర్జాతీయ సరిహద్దులోని మూడు చెక్‌పోస్టులు - అటారీ-వాఘా (అమృత్‌సర్), హుస్సేన్‌వాలా, సద్కి (ఫజిల్కా) వద్ద 'బీటింగ్ రీట్రీట్' వేడుకలు నేటినుంచి తిరిగి ప్రారంభమవుతాయని బీఎస్ఎఫ్ అధికారులు తెలిపారు.

మిగతా 2లో..



పెంచిన మెట్రో రైలు ఛార్జీల్లో

## సవరణ

10 శాతం తగ్గిస్తూ యాజమాన్యం నిర్ణయం

హైదరాబాద్(జనంసాక్షి): హైదరాబాద్ మెట్రో రైలు యాజమాన్యం కీలక నిర్ణయం తీసుకుంది. ఇటీవల పెంచిన మెట్రో ఛార్జీలను సవరించింది. పెంచిన ఛార్జీలను 10 శాతం తగ్గిస్తూ మెట్రో యాజమాన్యం నిర్ణయం తీసుకుంది.తగ్గిన ఛార్జీలు మే 24 నుంచి వర్తించనున్నాయి. ఇటీవల కనీస ఛార్జీ రూ.10 నుంచి

మిగతా 2లో..





# విచారణకు రండి..!

## కేసీఆర్,హరీశ్,ఈటలకు జస్టిస్ ఘోష్ కమిషన్ నోటీసులు

- జూన్ 5న కేసీఆర్, 6నహరీశ్,9న ఈటల హాజరుకావాలని తాఖీదులు
- కాళేశ్వరం కేసులో విచారణ మరింత వేగవంతం



హైదరాబాద్,మే20(జనంసాక్షి): కాళేశ్వరం కమిషన్ దూకుడు పెంచింది. ఇంతకాలం అధికారులను విచారించిన కమిషన్ ...ఇప్పుడు ఇందులో కీలకంగా ఉన్ననేతలను విచారణకు పిలుస్తోంది. ఈ క్రమంలోభారాస అధినేత, మాజీ సీఎం కేసీఆర్‌కు జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ నోటీసులు ఇచ్చింది. ఆయనతోపాటు- మాజీ మంత్రి హరీశ్‌రావు, భాజపా ఎంపీ ఈటల రాజేందర్‌కూ జారీ చేసింది. 15 రోజుల్లో కమిషన్ ఎదుట హాజరుకావాలని పేర్కొంది. కాళేశ్వరం ఎత్తిపోతలలో భాగంగా నిర్మించిన బ్యారేజీలపై జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ విచారణ జరుపుతున్న విషయం తెలిసిందే. కేసీఆర్ సీఎంగా ఉన్న సమయంలో హరీశ్‌రావు నీటిపారుదల శాఖ మంత్రి, ఈటల రాజేందర్ ఆర్థిక మంత్రిగా పనిచేశారు. ఈ నేపథ్యంలో

మిగతా 2లో..

### చట్టం ముందు అందరూ సమానమే

కాళేశ్వరం విచారణకు కేసీఆర్ హాజరు కావాలి: మంత్రి శ్రీధర్ బాబు

పెద్దపల్లి,మే20(జనంసాక్షి):కాళేశ్వరం ప్రాజెక్ట్ విచారణ జరుపుతున్న జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ ఎదుట కేసీఆర్ హాజరు కావాలని, వివరాలు వెల్లడించాలని మంత్రి శ్రీధర్ బాబు స్పష్టం చేశారు. నోటీసులు ఇప్పుడే కదా ఇచ్చింది.. ఆయన వెళ్తారనే తాను

మిగతా 2లో..

### కేసీఆర్‌తో ఫాంహౌస్‌లో హరీశ్‌రావు భేటీ

కాళేశ్వరం కమిషన్ నోటీసుల నేపథ్యంలో ఇరువురి సమావేశానికి ప్రాధాన్యత

గజ్వేల్(జనంసాక్షి):సిద్దిపేట జిల్లా ఎర్రవల్లిలోని ఫామ్‌హౌస్‌లో మాజీ సీఎం కేసీఆర్‌ను మాజీ మంత్రి హరీశ్‌రావు కలిశారు. కాళేశ్వరం కమిషన్ నోటీసుల నేపథ్యంలో ఈ భేటీకి ప్రాధాన్యత ఏర్పడింది.జూన్ 5న విచారణకు రావాలని కేసీఆర్‌కు జస్టిస్ పీసీ ఘోష్

మిగతా 2లో..

## జ్యోతి మల్హోత్రాపై బిగుస్తున్న ఉచ్చు

- ఎన్ఐఏ,ఐబీ ప్రశ్నల వర్షం
- పాకిస్తాన్, చైనా, దుబాయ్ పర్యటనలపై ఆరా
- లోతుగా దర్యాప్తు చేస్తున్న అధికారులు
- పాక్ ఇంటలిజెన్స్‌తో ఉన్న సంబంధాలపైనా విచారణ



న్యూఢిల్లీ,మే20(జనంసాక్షి):హర్యానాకు చెందిన యూట్యూబర్ జ్యోతి మల్హోత్రాపై దేశద్రోహం ఆరోపణలతో విచారణను భారత ఇంటెలిజెన్స్ ముమ్మరం చేసింది. ఈ కేసులో పాకిస్తాన్ ఇంటెలిజెన్స్ ఆపరేటివ్స్, ఢిల్లీలోని పాక్ హైకమిషన్ అధికారుల పాత్రను లోతుగా పరిశీలిస్తుంది. ఈ కేసును ఫెడరల్ యాంటీ టెర్రర్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీకి అప్పగించాలని ఆలోచనలో కేంద్ర హోం శాఖ ఉంది. ఈ ఏజెన్సీ దేశ భద్రతకు సంబంధించిన సున్నితమైన కేసులను మరింత లోతుగా దర్యాప్తు చేస్తుంది. కాగా, పాకిస్తాన్ ఇంటెలిజెన్స్ ఆపరేటివ్స్‌తో జ్యోతి మల్హోత్రాకు ఉన్న సంబంధాలు, ఆమె అంతర్జాతీయ పర్యటనలు, సమాచార బదిలీపై మరిన్ని వివరాలను సేకరించడానికి ఈ ఏజెన్సీ ఎంక్వైరీ చేయనుంది. అయితే, జ్యోతి మల్హోత్రా వెనుక భారీ కుట్ర దాగి ఉందని భారత ఇంటెలిజెన్స్ వర్గాలు అనుమానిస్తున్నాయి. యూట్యూబర్ జ్యోతితో సహా మొత్తం 14 మంది పాక్ గూఢచారులను ఉత్తరప్ర దేశ్, పంజాబ్, హర్యానా రాష్ట్రాల్లో అరెస్టు చేశారు. ఈ వ్యక్తులు పాకిస్తాన్ ఐఎస్ఐకి ఏజెంట్లు-గా, ఇన్ఫా ర్మర్లుగా పని చేసినట్లు విచారణలో తేలింది. గత రెండు వారాలుగా నార్త్ ఇండియాలోని వివిధ ప్రాం తాల్లో ఈ అరెస్టులు కొనసాగాయి. దర్యాప్తు సంస్థలు జ్యోతి మల్హోత్రాతో సంబంధం ఉన్న దేశంలోని ఇతర వ్యక్తులను కూడా విచారణ చేస్తున్నారు. ఈ కుట్రలో పాకిస్తాన్ హైకమిషన్ అధికారుల పాత్రపై కూడా

మిగతా 2లో..

గుల్జార్‌హౌస్ అగ్నిప్రమాదం..

## ముగిసిన క్లూస్ టీమ్ విచారణ



విచారణకు ఆరుగురు ఉన్నతాధికారులతో కమిటీ

హైదరాబాద్(జనంసాక్షి):చార్మినార్ గుల్జార్‌హౌస్ సమీపంలోని ఓ భవనంలో జరిగిన అగ్ని ప్రమాద ఘటనపై క్లూస్ టీమ్ అధికారుల విచారణ పూర్తయింది. ఇంటి లోపలికి వెళ్లి క్లూస్ టీమ్ ఘటనా స్థలాన్ని పరిశీలించింది. గోడలు బీటలు వారినట్లు అధికారులు గుర్తించారు. భవనం కూలిపోయే అవకాశం ఉన్నట్లు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. భవనంలో 14 ఏసీలు

మిగతా 2లో..



కర్నల్ సోఫియాపై వివాదాస్పద వ్యాఖ్యలు

## మధ్యప్రదేశ్ మంత్రికి పదవీ గండం!

సిట్ నివేదిక అనంతరం వేటు వేయనున్న ఆ రాష్ట్ర ప్రభుత్వం!

బోపాల్(జనంసాక్షి):సైనికాధికారిణి కర్నల్ సోఫియా ఖురేషీ ని ఉద్దేశిస్తూ మధ్యప్రదేశ్ మంత్రి విజయ్ షా చేసిన వివాదాస్పద వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపిన సంగతి తెలిసిందే.వాటిపై సుప్రీంకోర్టు కూడా అసహనం వ్యక్తంచేసింది. ఈ పరిణామాల వేళ ఆయన పదవీగండం ఎదుర్కొంటున్నట్లు తెలుస్తోంది. విజయ్ షా వ్యాఖ్యలపై విపక్షాలు తీవ్ర విమర్శలు చేస్తున్నాయి. ఆయన్ను ఇంకా ఎందుకు పదవి నుంచి తొలగించడం లేదని మధ్యప్రదేశ్ ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నాయి. ఈ వ్యవహారంలో మే 28న నిర్ణయం తీసుకోవచ్చని తెలుస్తోంది. మంత్రిపై నమోదైన ఎఫ్ఐఆర్‌పై దర్యాప్తునకు ముగ్గురు

మిగతా 2లో..

## పహల్గామ్ పర్యాటకుల ప్రాణాలు కాపాడలేకపోయారు

ఆపరేషన్ సిందూర్ చిన్నపాటి యుద్ధం మాత్రమే

కేంద్రంపై మల్లికార్జున ఖర్గే ధ్వజం .. మండిపడ్డ బిజెపి



న్యూఢిల్లీ,మే20(జనంసాక్షి):జమ్మూ కాశ్మీర్ పహల్గామ్ ఉగ్రదాడిలో 26 మంది పర్యాటకుల ప్రాణాలు రక్షించడంతో కేంద్రం పూర్తిగా విఫలమైందని కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున ఖర్గే విమర్శించారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ.. ఆపరేషన్ సిందూర్ చిన్న యుద్ధం అని అభివర్ణించారు. పహల్గామ్ ఉగ్రదాడికి ముందే ప్రధాని నరేంద్రమోడీకి సమాచారం ఉందని ఆరోపించారు. ఆ తర్వాతే ఆయన తన పర్యటనను రద్దు చేసుకున్నారని ఖర్గే మరోసారి అన్నారు. దాడి జరిగే అవకాశం ఉందని ప్రజలకు ముందే ఎందుకు తెలియజేయలేదు అని ప్రశ్నించారు. కర్ణాటకలో జరిగిన

మిగతా 2లో..

## ప్రతిపాదిత మూడు అంశాలపైనే విచారణ జరపండి

వక్ఫ్ చట్టంపై సుప్రీంను కోరిన కేంద్ర ప్రభుత్వం



న్యూఢిల్లీ(జనంసాక్షి):వక్ఫ్ చట్టాన్ని సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లపై ఏదైనా మధ్యంతర ఉత్తర్వులు జారీ చేస్తే.. దాన్ని మూడు అంశాలకే పరిమితం చేయాలని కేంద్ర ప్రభుత్వం సుప్రీంకోర్టును కోరింది. వక్ఫ్ చట్టంపై దాఖలైన పిటిషన్లపై

మిగతా 2లో..

ప్రతి రైతుకూ భూభద్రత కల్పించేందుకే

## భూభారతి



దేశానికి ఆదర్శంగా పోర్టల్

- జూన్ 2నుంచి తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా భూముల సర్వే
- కొత్తగా 6 వేల మంది సర్వేయర్ల నియామకం
- చట్టంతో భూయజమానులకు హక్కు
- పెద్దపల్లి మండలంలో 'భూభారతి' రెవెన్యూ సదస్సులో మంత్రి పొంగులేటి

పెద్దపల్లి/ఎలిగేడు(జనంసాక్షి): దేశానికి ఆదర్శంగా ప్రభుత్వ రూపొందించిన భూ భారతి చట్టం నిలుస్తుందని రాష్ట్ర రెవెన్యూ, హౌజింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. మంగళవారం మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి , ఎలిగేడు మండలం ముప్పిరితోట గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన భూ భారతి చట్టం - 2025 పై నిర్వహించిన రెవెన్యూ సదస్సులో మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, మంత్రి శ్రీధర్ బాబు, ప్రభుత్వ సలహాదారు హర్కర వేణుగోపాల్, జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష, ఎమ్మెల్యేలు చింతకుంట విజయ రమణారావు, మక్కన్ సింగ్ రాజ్ ఠాకూర్, ఎమ్మెల్సీ టి.భాను ప్రసాద్ రావు లతో కలిసి పాల్గొన్నారు.ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ గత ప్రభుత్వ పెద్దలు స్వార్థ పూరితంగా నాలుగు గోడల మధ్య ఎవరి అభిప్రాయాలు తెలుసుకోకుండా ధరణి చట్టం తయారు చేసిందని అన్నారు. ప్రజా ప్రభుత్వం దేశంలోనే 18 రాష్ట్రాల్లోనే 20 చట్టాలను క్షుణ్ణంగా పరిశీలించి వేల మంది ప్రజల అభిప్రాయాలు తెలుసుకొని వారి కోరిక మేరకు భూ భారతి చట్టం తయారు చేశామని

మిగతా 2లో..

## ఆగని మృత్యుఘోష

### టెల్‌అవీవ్ వైమానిక దాడుల్లో 60 మంది గాజా పౌరుల మృతి



గాజాస్ట్రిప్(జనంసాక్షి):ఇజ్రాయెల్ భారీగా దాడులకు పాల్పడుతుండడంతో గాజాలో మరణమృదంగం మోగుతోంది. ఈ దాడుల్లో భారీ సంఖ్యలో పాలస్తీని యన్లు మృతి చెందుతున్నారు. తాజాగా గాజా స్ట్రిప్ అంతటా సోమవారం రాత్రి నుంచి మంగళవారం ఉదయం వరకు టెల్‌అవీవ్ చేసిన వైమానిక దాడుల్లో 60 మంది మరణించినట్లు గాజా ఆరోగ్యశాఖ పేర్కొం ది. ఉత్తరగాజాలో పనిచేస్తున్న మూడు ఆసుపత్రులూ తమ సేవలను నిలిపివేస్తున్నట్లు ప్రకటించడంతో క్షతగాత్రులకు చికిత్స అందించడం సమస్యగా మారిందని అధికారులు వాపోయారు. ఇందులో గాజా ప్రజ లకు వైద్యం అందిస్తున్న ఇండోనేసియా ఆసుపత్రి కూ డా ఉందని తెలిపారు.గత కొన్ని రోజులుగా ఇజ్రా యెల్.. గాజాపై దాడులను తీవ్రతరం చేసింది. వారం లోనే టెల్‌అవీవ్ దాడుల్లో వేలమంది

మిగతా 2లో..

### గాజా చిన్నారుల ఆకలి తీర్చండి

లేకుంటే మరో రెండురోజుల్లో 14 వేల మంది చిన్నారులు చనిపోయే ప్రమాదం.. ఐరాస హెచ్చరిక

2లో



## ప్రభుత్వాసుపత్రిలో జూనియర్ సివిల్ జడ్జి ప్రసవం

మంత్రి దామోదర అభినందన

రాజన్నసిరిసిల్ల(జనంసాక్షి): రాజన్న సిరిసిల్ల జిల్లాలో జూనియర్ సివిల్ జడ్జిగా పనిచేస్తున్న జ్యోతిర్మయి వేములవాడ ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రసవించారు.రాజన్న సిరిసిల్ల జిల్లాలో జూనియర్ సివిల్ జడ్జిగా పనిచేస్తున్న జ్యోతిర్మయి వేములవాడ ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రసవించారు. పండంటి మగ బిడ్డకు మంగళవారం ఆమె జన్మనిచ్చారు. ప్రసూతి వైద్య

మిగతా 2లో..

తెలంగాణ రాజ్‌భవన్‌లో


### హార్డ్‌డిస్క్ చోరీ

నిందితుడి అరెస్టు

పంజాగుట్ట(జనంసాక్షి): తెలంగాణ రాజ్‌భవన్‌లో చోరీ ఘటన చోటుచేసుకుంది. అందులోని సుధర్మ భవన్‌లో హార్డ్ డిస్క్ చోరీ అయినట్లు రాజ్‌భవన్ అధికారులు గుర్తించారు. ఈ నెల 14న చోరీ ఘటన చోటుచేసుకోగా.. పంజాగుట్ట పోలీసులకు రాజ్‌భవన్

మిగతా 2లో..

## యుద్ధం ముగించడం రష్యాకు ఇష్టంలేదు



ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ వెల్లడి

కీవ్(జనంసాక్షి):యుద్ధం ముగింపునకు తాము సిద్ధంగా ఉన్నామని, అయితే రష్యా అందుకు సిద్ధంగా ఉన్నట్లు కనిపించడం లేదని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ పేర్కొన్నారు.రష్యా- ఉక్రెయిన్‌ల మధ్య ప్రత్యక్ష చర్చలకు మద్దతిస్తున్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇరుదేశాల అధ్యక్షులతో ఫోన్‌లో మాట్లాడిన సంగతి తెలిసిందే. ఈ ఫోన్ కాల్ అనంతరం జెలెన్‌స్కీ ఈ వ్యాఖ్యలు చేశారు.'రష్యాకు ఉన్న నియమాలు ఏంటనేవి నాకు తెలియదు. ఈ యుద్ధంలో మేము చాలా కోల్పోయాం. దీన్ని ముగించడం మాకు చాలా ముఖ్యం. అందుకు మేము సిద్ధం. కానీ, రష్యా అందుకు సుముఖంగా ఉన్నట్లు నాకు అనిపించడం లేదు. మేము వారిని నమ్మం. ముందుగా కాల్పుల విరమణకు వారు అంగీకరించాలి. ఆ తర్వాత

మిగతా 9లో..

నాలుగైదు రోజుల్లో

## కేరళకు నైరుతి

భారత వాతావరణ విభాగం వెల్లడి

న్యూఢిల్లీ(జనంసాక్షి):నైరుతి రుతుపవనాలు మరో నాలుగైదు రోజుల్లో కేరళను తాకనున్నాయని భారత వాతావరణ విభాగం (ఐఎండీ) వెల్లడించింది. వాస్తవానికి ఇవి ఈనెల 22న అండమాన్‌ను, 26న శ్రీలంకను తాకొచ్చని భావించగా..అందుకు పది రోజుల ముందుగానే శ్రీలంకలోకి ప్రవేశించాయి. ప్రస్తుతం శ్రీలంక, అండమాన్‌లో విస్తరించాయి. మే 27 నాటికి కేరళ మీదుగా రుతుపవనాలు ప్రారంభమవుతాయని అంచనా వేసినప్పటికీ..

మిగతా 2లో..



జనంసాక్షి
www.janamsakshi.org
బుధవారం
21.05.2025

## ముగిసిన క్లూస్‌టీం విచారణ

ఉన్నట్లు అధికారుల విచారణలో వెల్లడైంది. ఆదివారం జరిగిన ఈ ఘటనలో 17 మంది ప్రాణాలు కోల్పోయిన సంగతి తెలిసిందే. దీనిపై ప్రస్తుతం దర్యాప్తు కొనసాగుతోంది.

**విచారణకు ఆరుగురు ఉన్నతాధికారులతో కమిటీ**

హైదరాబాద్: పాతబస్తీలోని గుల్జార్‌హౌజ్ చౌరస్తా సమీపంలో జరిగిన భారీ అగ్నిప్రమాద ఘటనపై సమగ్ర విచారణ విచారణకు తెలంగాణ ప్రభుత్వం ఆరుగురు ఉన్నతాధికారులతో కమిటీని ఏర్పాటు చేసింది. ఈ మేరకు హైదరాబాద్ ఇన్‌ఛార్జ్ మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడించారు. ఈ కమిటీలో జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్, హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, హైదరాబాద్ సీపీ సీవీ ఆనంద్, అగ్నిమాపక శాఖ డీజీ నాగిరెడ్డి, హైడ్రా కమిషనర్ రంగనాథ్, టీజీఎస్పీడీసీఎల్ సీఎండీ ముషారఫ్‌లతో కమిటీని ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఈనెల 18న జరిగిన అగ్నిప్రమాద ఘటనపై క్షేత్రస్థాయిలో సమగ్ర విచారణ జరిపాలని కమిటీని ప్రభుత్వం ఆదేశించింది. ఘటనకు గల కారణాలు.. అనంతరం వివిధ శాఖలు తీసుకున్న చర్యలపై సీఎంకు సమగ్ర నివేదిక అందజేయాలని పేర్కొంది.

# విచారణకు రండి

జారీ చేసింది. కేసీఆర్ జూన్ 5న, హరీశ్‌రావు జూన్ 6న, ఈటల రాజేందర్ జూన్ 9న విచారణకు హాజరుకావాలని పేర్కొంది. మేడిగడ్డ బ్యారేజీ కుంగిన నేపథ్యంలో దీంతోపాటు– అన్నారం, సుందిళ్ల బ్యారేజీలపై విచారణ జరిపేందుకు న్యాయ విచారణ కమిషన్‌ను రాష్ట్ర ప్రభుత్వం నియమించిన సంగతి తెలిసిందే. సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ పీసీ ఘోష్ నేతృత్వం లో 2024 మార్చిలో ఏర్పా–టైన ఈ కమిషన్.. నిర్మాణం, నిర్వహణ, డిజైన్, క్వాలిటీ–కంట్రోల్, పే అండ్ ఎకౌంట్స్, నీటిపారుదల, ఆర్థిక శాఖల ఉన్నతాధికారులు, నిర్మాణసంస్థల ప్రతినిధులు.. ఇలా అందరినీ విచారించింది. ఎప్పటికప్పుడు అవసరానికి తగ్గట్లుగా ప్రభుత్వం 7 సార్లు కమిషన్ గడువును పొడిగించింది. గత నెలాఖరులో ఒక నెల మాత్రమే గడువు పొడిగించింది. దీనిప్రకారం ఈ నెలాఖరుకు కమిషన్ గడువు పూర్తికావాలి. ఈ నెల 21న లేదా 22న జస్టిస్ పీసీ ఘోష్ తుది నివేదికను ప్రభుత్వానికి అందజేస్తారనే ప్రచారం జరిగింది. అయితే విచారణలో.. సీనియర్ ఇంజినీర్లు, అధికారుల్లో ఎక్కువమంది గత ముఖ్యమంత్రి సమక్షంలో నిర్ణయాలు జరిగాయని, ఆయన ఆదేశాల మేరకే పలు నిర్ణయాలను అమలుచేశామని చెప్పిన నేపథ్యంలో.. వీటిపై కేసీఆర్, హరీశ్‌రావు, ఈటల రాజేందర్‌ల అభిప్రాయాలను కూడా తెలుసుకోవాలనే నిర్ణయంతో కమిషన్ ఉన్నట్లు సమాచారం. ఈ ప్రాజెక్ట్‌లో కీలక పాత్ర పోషించిన కేసీఆర్‌ను క్రాస్ ఎగ్జామినేషన్ చేయకుండా నివేదిక ఇస్తే బీఆర్‌ఎస్ తప్పుడు సంకేతాలను ప్రజల్లోకి తీసుకెళ్లే అవకాశం ఉందని భావించిన కమిషన్.. కేసీఆర్‌ను స్వయంగా విచారించాలని నిర్ణయించింది. అందులో భాగంగానే కేసీఆర్ సహా హరీష్, ఈటలకు నోటీసులు పంపించింది. అయితే కమిషన్ విచారణకు కేసీఆర్ హాజరవుతారా లేక న్యాయపరంగా ఎదుర్కుంటారా అనేది చర్చనీయాంశంగా మారింది.

### చట్టం ముందు అందరూ సమానమే

అనుకుంటున్నానన్నారు. అయితే చట్టం ముందు అందరూ సమానమేనని ఆయనని చెప్పారు. కేసీఆర్‌కు కాళేశ్వరం ప్రాజెక్ట్‌పై విచారణ జరుపుతున్న జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ నోటీసులు జారీ చేసిన నేపథ్యంలో శ్రీధర్ బాబు ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. మంగళవారం పెద్దపల్లిలో మంత్రి శ్రీధర్ బాబు విలేకర్లుతో మాట్లాడుతూ.. తప్పు చేయకపోతే భయం ఎందుకు అంటూ బీఆర్‌ఎస్ చీఫ్ కేసీఆర్‌ను ఆయన సూటిగా ప్రశ్నించారు.

### కేసీఆర్‌తో ఫాంహౌస్‌లో హరీశ్ భేటి

కమిషన్ నోటీసులు జారీ చేసిన సంగతి తెలిసిందే. కేసీఆర్‌తోపాటు హరీశ్‌రావు, ఈటల రాజేందర్‌కు కూడా కమిషన్ నోటీసులిచ్చింది. కాళేశ్వరం ఎత్తిపోతలలో భాగంగా నిర్మించిన బ్యారేజీలపై జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ విచారణ చేస్తోంది. కేసీఆర్ సీఎంగా ఉన్న సమయంలో హరీశ్‌రావు నీటిపారుదల శాఖ మంత్రి, ఈటల రాజేందర్ ఆర్థిక మంత్రిగా పని చేశారు. ఈ నేపథ్యంలో వారికి కమిషన్ నోటీసులు జారీ చేసింది.

## ప్రతిపాదిత మూడు అంశాలపైనే విచారణ జరపండి

జస్టిస్ బీఆర్ గవాయ్ నేతృత్వంలోని ధర్మాసనం మంగళవారం విచారణ జరిపింది. ఈ సందర్భంగా కేంద్రం తరపున హాజరైన సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా కేంద్రం తరఫున వాదనలు వినిపిస్తూ.. గత బెంచ్ లాగానే విచారణను పరిమితం చేయాలని సీజేఐ జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ అగస్టిన్ జార్జ్ మాసిహ్ ధర్మాసనానికి తెలిపారు. కోర్టు మూడు అంశాలను గుర్తించిందని తుషార్ మెహతా తెలిపారు. ఆ మూడు అంశాలపై సమాధానం ఇచ్చామని.. తాజాగా పిటిషనర్లు లిఖితపూర్వక సమర్పణల్లో అనేక ఇతర అంశాలను లేవనెత్తుతున్నారన్నారు. తాము మూడు అంశాలపై అఫిడవిట్ దాఖలు చేశామని తెలిపారు. కేసు విచారణను ఈ మూడు అంశాలకే పరిమితం చేయాలనేది కేంద్రం తరఫున విజ్ఞప్తి చేశారు. కేంద్ర ప్రభుత్వ వాదనను పిటిషనర్లు వ్యతిరేకించారు. పిటిషనర్ల తరఫున హాజరైన న్యాయవాదులు కపిల్ సిబల్, అభిషేక్ మను సింఘ్వి సొలిసిటర్ జనరల్ వాదనను వ్యతిరేకించారు. ఇంతకు ముందు ఏప్రిల్ 17న జరిగిన విచారణలో వక్ఫ్ బై–యూజర్‌తో సహా ఏ వక్ఫ్ ఆస్తిని డీ–నోటిఫై చేయబోమని కేంద్ర ప్రభుత్వం సుప్రీంకోర్టుకు హామీ ఇచ్చింది. అలాగే, వక్ఫ్ బోర్డులలో కొత్త నియామకాలు చేపట్టబోమని సుప్రీంకోర్టుకు తెలిపింది.

తెలంగాణ ప్రభుత్వము
జిల్లా కలెక్టర్ వారి కార్యాలయము (భూసేకరణ)
నాగర్‌కర్నూల్ జిల్లా

జి2/311/2025 — తేది: 13-03-2025
గెజిట్ నెం.26/2025

భూసేకరణ, పునరావాస, పునఃస్థాపనలో పారదర్శకత మరియు సముచిత నష్టపరిహార హక్కు చట్టము 2013 (చట్టం 30/2013) సెక్షన్ 11(1) మరియు తెలంగాణ రాష్ట్ర భూసేకరణ, పునరావాస, పునఃస్థాపనలో పారదర్శకత మరియు సముచిత నష్టపరిహార నియమావళి 2014 రూల్ 19(1) ప్రకారము

**ఫారం – 6**

ప్రాథమిక ప్రకటన

నాగర్‌కర్నూల్ జిల్లా **తాడూర్** మండలములోని **యాదిరెడ్డిపల్లి** గ్రామ పరిధి నందు ఈ క్రింది షెడ్యూల్‌లో ఉదహరించిన **ఎ.5.01** గుంటలు భూమి మహాత్మాగాంధీ ఎత్తిపోతల పథకం క్రింద ప్రజా ప్రయోజనార్థం అనగా **డిస్ట్రిబ్యూటరి కెనాల్–28** (MJR-1/MIR-6) నిమిత్తం సేకరించవలసిన అవసరం ఉన్నదని జిల్లా కలెక్టరు, నాగర్ కర్నూల్ గారు భావిస్తున్నారు. కాబట్టి **ఎ॥లు 5.01 గుం॥** భూమి **డిస్ట్రిబ్యూటరి కెనాల్–28** (MJR-1/MIR-6) నిమిత్తం భూసేకరణ ద్వారా సేకరించుటకు గాను ప్రాథమిక ప్రకటన చేయడమైనది. సేకరించడానికి నిర్ధారించిన భూముల వివరాలు సంక్షిప్తంగా క్రింది ప్రకారం గలవు.

షెడ్యూల్

గ్రామము: యాదిరెడ్డిపల్లి — మండలం:తాడూర్ — జిల్లా:నాగర్‌కర్నూల్

| క్ర స. | సర్వే నెం. / ఎస్‌డి నెం. | పట్టా/ ఇనాం etc. | భూ వర్గీకరణ మెట్ట/ ఆరుతడి/ తరి | భూసేకరణకు ప్రతిపాదించిన విస్తీర్ణం ఎ.సెం/ ఎ.గుం | పట్టాదారు పేరు, అనుభవదారు పేరు మరియు ఏవైన హక్కులు గల యితర వ్యక్తులు | సరిహద్దులు ఉ | ద | తూ | ప | చెట్లు | | నిర్మాణములు | |
|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|
| 1 | 2 | 3 | 4 | 5 | 6 | 7 | 8 | 9 | 10 | 11 | 12 | 13 | 14 |
| 1 | 119 | లావుని పట్టా | మెట్ట | 0.15 | పాలాది మోహనయ్య తండ్రి అప్పయ్య (0.15) మ్యాకల లక్ష్మయ్య తండ్రి పెంటయ్య బాల్‌రాం తండ్రి బుచ్చన్న కొమ్ము స్వరూప భర్త రాంచంద్రయ్య మ్యాకల నాగమ్మ భర్త రత్నయ్య అలివేల భర్త వెంకటయ్య జాజాల నర్సింహ్మ తండ్రి బుచ్చన్న యండి పాతిమాబేగం భర్త హుస్సేన్ పటపర్ల జగన్ తండ్రి నర్సింహ్మగౌడ్ భాషమోని పాపయ్య తండ్రి మల్లయ్య భాషమోని వెంకటయ్య తండ్రి రాములు కొమ్ము ఎర్ర మాషన్న తండ్రి మల్లయ్య మ్యాకల హన్మయ్య తండ్రి చంద్రయ్య | 151 | 118 | 113 | 1 155 | లేవు | లేవు | లేవు | లేవు |
| 2 | 152 | పట్టా | మెట్ట | 0.36 | తలకొండపల్లి గోవిందు తండ్రి ముత్తయ్య (0.36) పాలాది బాలమణెమ్మ భర్త కృష్ణయ్య పాలాది మోహనయ్య తండ్రి అప్పనయ్య కోలన్ మోహన్‌రెడ్డి తండ్రి రాంరెడ్డి గంజి వెంకటేష్ తండ్రి శంకరయ్య పాలాది కృష్ణయ్య తండ్రి అప్పయ్య | [illegible] 152 | 119 | 151 | 153 | లేవు | లేవు | లేవు | లేవు |
| 3 | 153 | పట్టా | మెట్ట | 0.33 | పాలాది మోహనయ్య తండ్రి అప్పయ్య (0.33) | 156 | 119 | 152 | 154 | లేవు | లేవు | లేవు | లేవు |
| 4 | 154 | పట్టా | మెట్ట | 0.05 | పాలాది మోహనయ్య తండ్రి అప్పయ్య(0.05) | 156 | 119 | 152 | 155 | లేవు | లేవు | లేవు | లేవు |
| 5 | 155 | పట్టా | మెట్ట | 1.14 | రెజ్వానాభేగం భర్త ఖాజమైనుద్దీన్ (0.23) ఉడి సత్య తండ్రి ఆంజనేయులు (0.15) యండి అజీజ్ తండ్రి గూడూపాడు (0.16 యండి బేగం భర్త షబ్బీర్ యండి హలీమాబేగం భర్త నజీర్ యండి బాలేషరీప్ తండ్రి అజీజ్ | 156 | 1 | 119 154 | 158 | లేవు | లేవు | లేవు | లేవు |
| 6 | 158 | పట్టా | మెట్ట | 1.18 | గన్నోజు శివుడు తండ్రి విష్ణుమూర్తి గన్నోజు శ్రీలత భర్త శివుడు (0.22) గన్నోజు మధు తండ్రి విష్ణుమూర్తి యండి జరీనా బేగం భర్త సలీంపాష (0.09) యండి ఖాజా తండ్రి బాషుమియా (0.25) రోడ్డు (0.02) జంగీర్ పాష తండ్రి భాషమియా రహిమున్నీసాబేగం తండ్రి యండి ఖాజా | 157 159 | [illegible] | 151 | 161 162 | లేవు | లేవు | లేవు | లేవు |
| | మొత్తము | | | 5.01 | | | | | | | | | |

భూసేకరణ, పునరావాస, పునఃస్థాపనలో పారదర్శకత మరియు సముచిత నష్టపరిహార హక్కు చట్టము 2013 (చట్టం 30/2013) సెక్షన్ 11(1) మరియు తెలంగాణ రాష్ట్ర భూసేకరణ, పునరావాస, పునఃస్థాపనలో పారదర్శకత మరియు సముచిత నష్టపరిహార నియమావళి 2014 రూల్ 19(1)ని అనుసరించి సంబంధిత వ్యక్తులందరి దృష్టికి ఇట్టి విషయాన్ని తెస్తూ ఈ ప్రకటన జారీ చేయడమైనది.

సదరు చట్టంలోని సెక్షన్ 12లో గల అధికారాలను అనుసరించి జిల్లా కలెక్టర్ నాగర్‌కర్నూల్ గారు, ప్రత్యేక ఉప కలెక్టరు, యం.జి.ఎల్.ఐ.యస్.పి., నాగర్‌కర్నూల్ మరియు వారి సిబ్బందికి సదరు భూమిలో ప్రవేశించి సర్వే మరియు యితర పనులు చేపట్టుటకు అధికారమివ్వనైనది.

సదరు చట్టంలోని సెక్షన్ 11(4) ననుసరించి జిల్లా కలెక్టరు గారి అనుమతి లేకుండా షెడ్యూల్‌లో ప్రకటించిన భూములకు సంబంధించి క్రయ, విక్రయాలు లేదా ఏ విధమైన లావాదేవీలు జరుపరాదని తెలియచేయడమైనది.

సదరు చట్టంలోని సెక్షన్ 15 ననుసరించి ప్రతిపాదిత భూసేకరణపై ఏమైన అభ్యంతరములుగాని, ఆక్షేపణలు గాని ఉన్న యెడల సంబంధిత వ్యక్తులు ఈ ప్రకటన ప్రచురించబడిన తేదీ నుండి 60 (అరువది) దినముల లోగా **ప్రత్యేక ఉప కలెక్టరు, యం.జి.ఎల్.ఐ.యస్.పి., నాగర్‌కర్నూల్** గారి ఎదుట అభ్యర్థనలు దాఖలు చేసుకొనవచ్చును.

భూసేకరణ తలపెట్టిన భూమిలో బొగ్గు, ఇనుము, స్టీల్ మరియు ఇతర ఖనిజములు ఇట్టి భూములలో లేదా కొంత భాగములో లభ్యమైనచో, ఆ ఖనిజాలు ప్రాజెక్టు నిర్మాణమునకు ఉపయోగమున్న పక్షములో, వాటిని స్వీకరించబడును. లేనిచో స్వీకరించబడవు.

పైన చూపిన భూమిని భూసేకరణ చేయు భూముల యొక్క ప్లాన్ ఏదైనా పని దినములలో మరియు కార్యాలయ పనివేళలలో భూసేకరణ అధికారి మరియు ప్రత్యేక ఉప కలెక్టర్ కార్యాలయము, నాగర్‌కర్నూల్ నందు పరిశీలించుకొను నిమిత్తం అందుబాటులో ఉండును.

ఇట్టి ప్రతిపాదించిన భూసేకరణ తెలంగాణ ప్రభుత్వము నీటిపారుదల శాఖ జి.ఒ.ఎం.ఎస్.నెం.51, తేది: 25.07.2017 ద్వారా భూసేకరణ, నష్టపరిహారము, పునరావాస, పునరుపాధి కల్పన చట్టము, 2013లోని అధ్యాయము-II మరియు అధ్యాయము-III అనగా సామాజిక ప్రభావిత అధ్యాయము మరియు ఆహార భద్రత నుండి మినహాయింపును ఇవ్వడము జరిగినది.

సం/- స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ (భూ.సే), యూనిట్-1, యం.జి.ఎల్.ఐ.యస్.పి., నాగర్‌కర్నూల్ — సం/- అదనపు కలెక్టర్, నాగర్‌కర్నూల్ — సం/- జిల్లా కలెక్టర్, నాగర్‌కర్నూల్

DIPR RO.No.112/LA/PP/Advt/Pub/2025-26

## పహల్గామ్ పర్యాటకుల ప్రాణాలు కాపాడలేకపోయారు

సమర్పణే సంకల్ప ర్యాలీలో పాల్గొన్న ఖర్గే మాట్లాడుతూ.. ప్రధాని మోడీ ఏప్రిల్ 17న కాశ్మీర్‌లో పర్యటించి ఉండాల్సింది, కానీ నిఘా వర్గాల సమాచారం మేరకు రద్దు చేసుకున్నారని, దీని గురించి మీకు ముందే తెలుసా..? అని ప్రధానిని ప్రశ్నించారు. దీని గురించి ఎందుకు ప్రజలకు సమాచారం ఇవ్వలేదు, ముందే హెచ్చరించి ఉంటే 26 మంది ప్రాణాలను కాపాడగలిగే వాళ్లం అని అన్నారు. ఇప్పుడు అక్కడక్కడ చిన్న యుద్ధాలు జరుగుతున్నాయి. పాకిస్తాన్ చైనా మద్దతుతో భారతదేశాన్ని తక్కువ అంచనా వేస్తోందని అన్నారు. 26మంది పౌరులు మరణించగా, ప్రధాని మోదీ బీహార్‌లో ర్యాలీ నిర్వహించడంలో బిజీగా ఉన్నారు. రెండు అఖిలపక్ష సమావేశాలు జరిగాయి, ప్రధానమంత్రి కూడా హాజరు కాలేదు. మేము ఆ సమావేశాలకు దూరంగా ఉంటే, మమ్మల్ని దేశద్రోహులుగా పిలుస్తారు. కానీ మోదీ వాటిని సమావేశాలకు రాకుంటే, దానిని దేశభక్తిగా ముద్ర వేస్తారు. ఈ ద్వంద్వ ప్రమాణాలు ఎందుకని ఖర్గే ప్రశ్నించారు. ఖర్గే వ్యాఖ్యలకు బీజేపీ ఎంపీ సంబిత్ పాత్రా తీవ్రంగా స్పందించారు. దేశాన్ని, సాయుధ దళాల ధైర్యాన్ని మోసం చేయడమే అని అన్నారు. 'ఆపరేషన్ సిందూర్ ఒక చిన్న యుద్ధం అని ఖర్గే జీ చెబుతున్నారు. మన సాయుధ దళాలు పాకిస్తాన్‌లోకి ప్రవేశించి అక్కడ తొమ్మిది ఉగ్రవాద స్థావరాలపై దాడి చేశాయని, 100 మందికి పైగా ఉగ్రవాదులు మరణించారని రాహుల్ ఖర్గే జీ అర్థం చేసుకోలేకపోతున్నారా?అని అన్నారు

## .జ్యోతి మల్హోత్రాపై బిగుస్తున్న ఉచ్చు

ఆరా తీస్తున్నారు. ఈ క్రమంలో యూట్యూబర్ జ్యోతి మల్హోత్రా పై అధికారులు ప్రశ్నల వర్షం కురిపిస్తున్నారు. ఎన్ఐఏ, ఇంటెలిజెన్స్ బ్యూరో అధికారులు వివిధ కోణాల్లో ఆమె నుంచి సమాధానాలు రాబట్టే ప్రయత్నం చేస్తున్నారు. పాకిస్థాన్, చైనా, బంగ్లాదేశ్, దుబాయ్‌ల్లో ఆమె చేసిన పర్యటనలపై వారు ప్రధానంగా దృష్టిసారించారు. నిందితురాలిని విచారించేందుకు ఎన్ఐఏ బృందం ఇక్కడికి వచ్చిందని హిస్సార్ ఎస్పీ శశాంక్‌కుమార్ సావన్ మీడియాకు వెల్లడించారు. ఇప్పటివరకు సేకరించిన సమాచారం ప్రకారం 2018లో ఆమెకు పాస్‌పోర్టు వచ్చింది. 2028 వరకు దానికి గడువు ఉంది. పాస్‌పోర్టు వచ్చినప్పటినుంచి ఆమె పాకిస్థాన్, చైనా, దుబాయ్, థాయ్‌లాండ్, బంగ్లాదేశ్, భూటాన్, నేపాల్, ఇండోనేసియాల్లో ప్రయాణించింది. ఆ పర్యటనల గురించి సమాచారం సేకరిస్తున్నాం అని ఓ అధికారి వివరాలు వెల్లడించారు. ఈ కేసును ఫెడరల్ యాంటీ టెర్రర్ ఇన్వెస్టిగేటింగ్ ఏజెన్సీకి అప్పగించే అంశాన్ని హోంశాఖ పరిగణనలోకి తీసుకోవచ్చు. పాక్ హైకమిషన్ అధికారులు, పాక్ ఇంటిలిజెన్స్ విభాగానికి చెందిన వ్యక్తులు.. ప్రచారం కోసం, సమాచారాన్ని సేకరించడానికి ఇన్‌ఫ్లుయెన్సర్లు, యూట్యూబర్లను ఉపయోగించు కుంటున్న కుట్ర కోణాన్ని దర్యాప్తు చేసేందుకు ఆ మేరకు నిర్ణయం తీసుకోవచ్చని తెలుస్తోందని సమాచారం. తాజా అరెస్టులతో భారత్‌లో గూఢచర్యం నెట్‌వర్క్‌ను నిర్వహించడానికి సాంకేతికతను ఉపయోగించుకుంటున్న తీరు బయటపడిందని అధికారిక వర్గాలు వెల్లడించాయి.

## తెలంగాణ రాజ్‌భవన్‌లో హార్డ్ డిస్క్ చోరీ

అధి కారులు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. చోరీ చేసిన వ్యక్తి శ్రీనివాస్ గతంలో అక్కడి కంప్యూటర్ విభాగంలో పనిచేసినట్లు గుర్తించారు. నిందితుడిని ఈ నెల 15న అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. నిందితుడి నుంచి హార్డ్ డిస్క్ స్వాధీనం చేసుకున్నారు. %ఈ ఘటనకు సంబంధించిన వివరాలను పంజాగుట్ట ఏసీపీ మోహన్ కుమార్ వెల్లడించారు. రాజ్ భవన్‌లో పనిచేసే ఓ మహిళ ఫొటోలను పొరుగు సేవల సిబ్బంది శ్రీనివాస్ మార్ఫింగ్ చేశాడు. దీనిపై పోలీసులకు బాధితురాలు ఫిర్యాదు చేయగా.. కేసు నమోదు చేసి నిందితుడిని అరెస్టు చేశారు. బెయిల్‌పై బయటికి వచ్చిన శ్రీనివాస్.. ఫొటోల మార్ఫింగ్‌కు ఉపయోగించిన కంప్యూటర్‌లోని హార్డ్ డిస్క్‌ను ఎత్తుకుపోయాడు. ఈ ఘటనపై రాజ్ భవన్ అధికారుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసి శ్రీనివాస్‌ను అరెస్టు చేసినట్లు ఏసీపీ మోహన్ కుమార్ తెలిపారు.

## ప్రభుత్వాసుపత్రిలో జూనియర్ సివిల్ జడ్జి ప్రసవం..

– మంత్రి దామోదర అభినందన

సేవలకు ఆమె సివిల్ ఆసుపత్రిలో చేరడంపై వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అభినందనలు తెలిపారు. సర్కారు దవాఖానాల పట్ల నమ్మకం పెంచే విధంగా న్యాయమూర్తి జ్యోతిర్మయి ఆదర్శంగా నిలుస్తారని సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా ప్రశంసించారు. తెలంగాణలో ప్రతి ఆడబిడ్డ ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు

తెలంగాణ ప్రభుత్వము
జిల్లా కలెక్టర్ వారి కార్యాలయము (భూసేకరణ)
నాగర్‌కర్నూల్ జిల్లా

జి2/546/2025 — తేది: 06-05-2025
గెజిట్ నెం.36/2025

భూసేకరణ, పునరావాస, పునఃస్థాపనలో పారదర్శకత మరియు సముచిత నష్టపరిహార హక్కు చట్టము 2013 (చట్టం 30/2013) సెక్షన్ 11(1) మరియు తెలంగాణ రాష్ట్ర భూసేకరణ, పునరావాస, పునఃస్థాపనలో పారదర్శకత మరియు సముచిత నష్టపరిహార నియమావళి 2014 రూల్ 19(1) ప్రకారము

**ఫారం – 6**

ప్రాథమిక ప్రకటన

నాగర్‌కర్నూల్ జిల్లా **వెల్దండ** మండలములోని **పోతేపల్లి** గ్రామము వద్ద ప్యాకేజి నెం. 29 డిస్ట్రిబ్యూటరి–82 యొక్క మేజర్ 23 టేల్ చివర కెనాల్ గ్రామ పరిధి నందు ఈ క్రింది షెడ్యూల్‌లో ఉదహరించిన **ఎ.14.09** గుంటలు/ సెంట్లు భూమి ప్రజా ప్రయోజనార్థం అనగా **డిస్ట్రిబ్యూటరి –82 మైనర్ 2 యొక్క మేజర్ 23 టేల్ చివర కెనాల్** నిమిత్తం సేకరించవలసిన అవసరం ఉన్నదని ప్రత్యేక ఉప కలెక్టరు (భూసేకరణ), యం.జి.ఎల్.ఐ.యస్.పి. నాగర్ కర్నూల్ గారు భావిస్తున్నారు. కాబట్టి **ఎ॥లు 14.09 గుం॥** భూమి **డిస్ట్రిబ్యూటరి –82 మైనర్ 2 యొక్క మేజర్ 23 టేల్ చివర కెనాల్** నిమిత్తం భూసేకరణ ద్వారా సేకరించుటకు గాను ప్రాథమిక ప్రకటన చేయడమైనది. సేకరించడానికి నిర్ధారించిన భూముల వివరాలు సంక్షిప్తంగా క్రింది ప్రకారం గలవు.

గ్రామము: పోతేపల్లి — మండలం:వెల్దండ — జిల్లా:నాగర్‌కర్నూల్

| క్ర స. | సర్వే నెం. / ఎస్‌డి నెం. | పట్టా/ ఇనాం etc., | భూ వర్గీకరణ మెట్ట/ ఆరుతడి/ తరి | భూసేకరణకు ప్రతిపాదించిన విస్తీర్ణం ఎ.సెం/ ఎ.గుం | పట్టాదారు పేరు, అనుభవదారు పేరు మరియు ఏవైన హక్కులు గల యితర వ్యక్తులు | సరిహద్దులు ఉ | ద | తూ | ప | చెట్లు | | నిర్మాణములు | |
|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|
| 1 | 2 | 3 | 4 | 5 | 6 | 7 | 8 | 9 | 10 | 11 | 12 | 13 | 14 |
| 1 | 194 | లావుని పట్టా | మెట్ట | 0.02 | వసంత భర్త లింగమయ్య (0.02) ఎన్ముల జంగమ్మ భర్త పర్వతాలు ఎర్ముల చిన్న జంగయ్య తండ్రి బాలయ్య ఎన్ముల పెద్ద జంగయ్య తండ్రి బాలయ్య ఎన్ముల మల్లమ్మ భర్త వెంకటయ్య ఎన్ముల తిరుపతయ్య తండ్రి బాలయ్య ఎన్ముల వెంకటయ్య తండ్రి బక్కయ్య | 200 | 196 | 195 | [illegible] | లేవు | లేవు | లేవు | లేవు |
| 2 | 195 | పట్టా | మెట్ట | 2.02 | ఇదమయ్య తండ్రి బక్కయ్య (0.16) వెంకటయ్య తండ్రి బక్కయ్య (0.06) తిరుపతయ్య తండ్రి బక్కయ్య (0.04) మల్లమ్మ భర్త వెంకటయ్య (0.04) ఇదమయ్య తండ్రి పెద్ద జంగిలి (0.24) వసంత భర్త లింగమయ్య (0.08) ఎన్ముల పెద్ద జంగయ్య తండ్రి బాలయ్య ఎన్ముల మల్లమ్మ భర్త వెంకటయ్య ఎర్ముల చిన్న జంగయ్య తండ్రి బాలయ్య మెండే శిరీష భర్త ఎ.శేఖర్ అనుగు జగన్ రెడ్డి తండ్రి లక్ష్మారెడ్డి యన్ముల రామస్వామి తండ్రి పర్వతాలు ఎన్ముల శివ తండ్రి వెంకటయ్య యన్ముల పెంటయ్య తండ్రి పర్వతాలు ఎన్ముల విజమమ్మ భర్త వెంకటయ్య ఎన్ముల పార్వతమ్మ భర్త పెద్దయ్య ఎన్ముల ఈతన్న తండ్రి బక్కయ్య | 200 | 196 | 199 | 194 | లేవు | లేవు | లేవు | లేవు |
| 3 | 199 /1 | లావుని పట్టా | మెట్ట | 1.11 | వసంత భర్త లింగమయ్య (0.15) ప్రభుత్వ భూమి (0.36) ఇస్లావత్ విజయ భర్త శంకర్ | 201 | 198 | 217 | 195 | లేవు | లేవు | లేవు | లేవు |
| 4 | 199 /11 | లావుని పట్టా | మెట్ట | 0.12 | బోయిని అంజమ్మ భర్త బక్కయ్య | 201 | 198 | 217 | 195 | లేవు | లేవు | లేవు | లేవు |
| 5 | 199 /26 | లావుని పట్టా | మెట్ట | 0.09 | బోయిని అంజమ్మ భర్త బక్కయ్య (0.09) ఎన్ముల చెన్నయ్య తండ్రి జంగయ్య | 201 | 198 | 217 | 195 | లేవు | లేవు | లేవు | లేవు |
| 6 | 199 /27 | లావుని పట్టా | మెట్ట | 0.21 | చిన్నయ్య తండ్రి రాములు (0.21) వాయిల్లి లక్ష్మయ్య తండ్రి | 201 | 198 | 217 | 195 | లేవు | లేవు | లేవు | లేవు |
| 7 | 199 /30 | లావుని పట్టా | మెట్ట | 1.12 | చిన్నయ్య తండ్రి రాములు (0.21) ప్రభుత్వ భూమి (0.31) ఇస్లావత్ దూద్య తండ్రి టీక్య ఇస్లావత్ రాజు తండ్రి టీక్య ఇస్లావత్ తర్యా తండ్రి టీక్య | 201 | 198 | 217 | 195 | లేవు | లేవు | లేవు | లేవు |
| 8 | 217 /2 | లావుని పట్టా | మెట్ట | 0.25 | చిన్నయ్య తండ్రి రాములు (0.25) ఆంజనేయులు తండ్రి కృష్ణయ్య తోట అలివేల భర్త యాదయ్య | 216 | 198 | 39 | 199 | లేవు | లేవు | లేవు | లేవు |
| 9 | 217 /1 | లావుని పట్టా | మెట్ట | 0.29 | ఆంజనేయులు తండ్రి కృష్ణయ్య (0.29) వావిల్ల నర్సయ్య తండ్రి మల్లయ్య వావిల్ల మల్లయ్య తండ్రి చంద్రయ్య | 216 | 198 | 39 | 199 | లేవు | లేవు | లేవు | లేవు |
| | 39 | పట్టా | మెట్ట | 1.37 | వెంకటయ్య తండ్రి చెన్నయ్య (1.08) నర్సింహ్మ తండ్రి చెన్నయ్య (0.29) ఎనుముల యాదగిరి తండ్రి పెద్ద చెన్నయ్య శేఖర్ తండ్రి జంగయ్య | 215 | 6 | 215 | 217 | లేవు | లేవు | లేవు | లేవు |
| 10 | 215 /6 | లావుని పట్టా | మెట్ట | 0.15 | (0.15) దుద్దు శేఖర్ తండ్రి పెద్ద అంజయ్య దుద్దు రామస్వామి తండ్రి జంగయ్య దుద్దు నారమ్మ భర్త పెద్ద జంగయ్య | 52 | 40 | 42 | 39 | లేవు | లేవు | లేవు | లేవు |
| 12 | 40 | పట్టా | మెట్ట | 0.36 | పర్వతాలు తండ్రి మైబు (0.36) ఉదుత అంజనమ్మ భర్త తిరుపతయ్య ఉదుత తిరుపతయ్య తండ్రి కిష్టయ్య నూనె రామస్వామి తండ్రి సాలయ్య బిచ్చ తండ్రి కిస్త నేనె ప్రశాంత్ తండ్రి అంజయ్య నూనె జంగయ్య తండ్రి సాలయ్య నూనె జంగయ్య తండ్రి సాలయ్య నూనె లక్ష్మయ్య తండ్రి కృష్ణయ్య నూనె వెంకటయ్య తండ్రి చంద్రయ్య నూనె లింగమ్మ భర్త సాలయ్య నూనె అంజయ్య తండ్రి చంద్రయ్య నేనావత్ వెంకటయ్య తండ్రి బిచ్య నూనె బాలకిష్టమ్మ భర్త మైబు | 42 | 10 | 41 | 6 | లేవు | లేవు | లేవు | లేవు |
| 13 | 42 | పట్టా | మెట్ట | 1.04 | రఘు తండ్రి తుల్స్య దేవి భర్త రఘు రాజు తండ్రి తుల్స్య (1.04) కృష్ణారెడ్డి తండ్రి రాత్లవత్ వెంకట్య తండ్రి చంద్రు కె.సంపూర్ణ భర్త విజయ బాబు రాత్లవత్ కిషన్ తండ్రి తులచ్య యం.మోహన్‌బాబు తండ్రి చోడు రామయ్య రాత్లవత్ తిరుమలేష్ తండ్రి రాజు | 51 | 40 | 43 | 215 | లేవు | లేవు | లేవు | లేవు |
| 14 | 51 | పట్టా | మెట్ట | 2.15 | కంలి భర్త నాను (0.16) కవిత భర్త చందు (0.10) మాధవి భర్త గోపి(0.25) సీత్య తండ్రి లచ్యా(0.08) బక్య తండ్రి లచ్యా (0.08) గోపి తండ్రి లచ్యా (0.08) తావుర్య తండ్రి లాల్‌సింగ్ (0.20) రాత్లావత్ జుమ్కని భర్త రెడ్య ముదావత్ మోత్య తండ్రి బిచ్య రాత్లావత్ లక్ష్మణ్ తండ్రి హన్య లచ్యా తండ్రి కిష్యా చంద్యా తండ్రి సంగ్య బక్య తండ్రి సంగ్య | 49 | 42 | 50 | 42 | లేవు | లేవు | లేవు | లేవు |
| 15 | 50 | లావుని పట్టా | మెట్ట | 0.19 | చంద్య తండ్రి సంగ్య (0.05) లచ్యా తండ్రి సంగ్య (0.05) తావుర్య తండ్రి లాల్‌సింగ్ (0.19) యం. విజయ భర్త మొత్య ముదావత్ కవిత భర్త చందు యం.కోమలి భర్త నాను యం.చంద్రు తండ్రి లచ్య ముదావత్ గోపాల్ తండ్రి లచ్య కె.మహేష్‌కుమార్ తండ్రి బాలయ్య వంగేటి కొండల్‌రెడ్డి తండ్రి బాల్‌రెడ్డి ముదావత్ మాధవి భర్త గోపిచందర్ ముదావత్ సీతారాం తండ్రి లచ్య | 49 | 43 | 48 | 51 | లేవు | లేవు | లేవు | లేవు |
| | మొత్తము | | | 14.09 | | | | | | | | | |

భూసేకరణ, పునరావాస, పునఃస్థాపనలో పారదర్శకత మరియు సముచిత నష్టపరిహార హక్కు చట్టము 2013 (చట్టం 30/2013) సెక్షన్ 11(1) మరియు తెలంగాణ రాష్ట్ర భూసేకరణ, పునరావాస, పునఃస్థాపనలో పారదర్శకత మరియు సముచిత నష్టపరిహార నియమావళి 2014 రూల్ 19(1)ని అనుసరించి సంబంధిత వ్యక్తులందరి దృష్టికి ఇట్టి విషయాన్ని తెస్తూ ఈ ప్రకటన జారీ చేయడమైనది.

సదరు చట్టంలోని సెక్షన్ 12లో గల అధికారాలను అనుసరించి జిల్లా కలెక్టర్ నాగర్‌కర్నూల్ గారు, ప్రత్యేక ఉప కలెక్టరు, యం.జి.ఎల్.ఐ.యస్.పి., నాగర్‌కర్నూల్ మరియు వారి సిబ్బందికి సదరు భూమిలో ప్రవేశించి సర్వే మరియు యితర పనులు చేపట్టుటకు అధికారమివ్వనైనది. ఇట్టి భూసేకరణకు అవసరమైన భూముల యొక్క నక్షా సదరు కార్యాలయము నందు పనివేళలలో పరిశీలించవచ్చును.

సదరు చట్టంలోని సెక్షన్ 11(4) ననుసరించి జిల్లా కలెక్టరు గారి అనుమతి లేకుండా షెడ్యూల్‌లో ప్రకటించిన భూములకు సంబంధించి క్రయ, విక్రయాలు లేదా ఏ విధమైన లావాదేవీలు జరుపరాదని తెలియచేయడమైనది.

సదరు చట్టంలోని సెక్షన్ 15 ననుసరించి ప్రతిపాదిత భూసేకరణపై ఏమైన అభ్యంతరములుగాని, ఆక్షేపణలు గాని ఉన్న యెడల సంబంధిత వ్యక్తులు ఈ ప్రకటన ప్రచురించ బడిన తేదీ నుండి 60 (అరువది) దినముల లోగా **ప్రత్యేక ఉప కలెక్టరు, యం.జి.ఎల్.ఐ.యస్.పి., నాగర్‌కర్నూల్** గారి ఎదుట అభ్యర్థనలు దాఖలు చేసుకొనవచ్చును.

భూసేకరణ తలపెట్టిన భూమిలో బొగ్గు, ఇనుము, స్టీల్ మరియు ఇతర ఖనిజములు ఇట్టి భూములలో లేదా కొంత భాగములో లభ్యమైనచో, ఆ ఖనిజాలు ప్రాజెక్టు నిర్మాణ మునకు ఉపయోగమున్న పక్షములో, వాటిని స్వీకరించబడును. లేనిచో స్వీకరించబడవు.

పైన చూపిన భూమిని భూసేకరణ చేయు భూముల యొక్క ప్లాన్ ఏదైనా పని దిన ములలో మరియు కార్యాలయ పనివేళలలో భూసేకరణ అధికారి మరియు ప్రత్యేక ఉప కలెక్టర్ కార్యాలయము, నాగర్‌కర్నూల్ నందు పరిశీలించుకొను నిమిత్తం అందుబాటులో ఉండును.

ఇట్టి ప్రతిపాదించిన భూసేకరణ తెలంగాణ ప్రభుత్వము నీటిపారుదల శాఖ జి.ఒ.ఎం.ఎస్.నెం.51, తేది: 25.07.2017 ద్వారా భూసేకరణ, నష్టపరిహారము, పునరా వాస, పునరుపాధి కల్పన చట్టము, 2013లోని అధ్యాయము-II మరియు అధ్యాయము-III అనగా సామాజిక ప్రభావిత అధ్యాయము మరియు ఆహార భద్రత నుండి మినహాయింపును ఇవ్వడము జరిగినది.

సం/- స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ (భూ.సే), యూనిట్-1, యం.జి.ఎల్.ఐ.యస్.పి., నాగర్‌కర్నూల్ — సం/- అదనపు కలెక్టర్, నాగర్‌కర్నూల్ — సం/- జిల్లా కలెక్టర్, నాగర్‌కర్నూల్

DIPR RO.No.120/LA/PP/Advt/Pub/2025-26

# ప్రతి రైతుకూ భూభద్రత కల్పించడమే భూభారతి లక్ష్యం

అన్నారు. రాష్ట్రంలోనే ప్రతి రైతుకు భరోసా భద్రత కల్పించాలని ఎన్నో రాత్రులు శ్రమించి, మేధావులతో చర్చించి, ఒక్క రోజు ఆలస్యం జరిగిన పేదలకు మంచి జరగాలనే తపనతో భూ భారతి చట్టాన్ని తయారు చేశామని తెలిపారు. భవిష్యత్తులో ఏ రాష్ట్రంలో రెవెన్యూ చట్టం తయారు చేయాలన్న ఆదర్శంగా ఉండే విధంగా భూ భారతి చట్టం ప్రజా ప్రభుత్వం తయారు చేసిందని, దేశానికి ఆదర్శంగా భూ భారతి చట్టం నిలుస్తుందని అన్నారు. గత ప్రభుత్వం ధరణి చట్టం తెచ్చి 3 సంవత్సరాలు గడిచిన రూల్స్ తీసుకుని రాలేదని, తమ ప్రభుత్వం భూ భారతి చట్టం రూల్స్ ప్రవేశపెట్టిందని, ఈ నిబంధనల ప్రకారం సాదా బైనామా దరఖాస్తులు పరిష్కారం అవుతాయని అన్నారు. పెండింగ్ ఉన్న సాదా బైనామా చట్టం సమస్యలకు భూ భారతి ద్వారా పరిష్కారం లభిస్తుందని అన్నారు. గత ప్రభుత్వం సాదా బైనమా దరఖాస్తులు స్వీకరించినప్పటికీ ధరణి చట్టంలో సాదా బైనమా గురించి అసలు పెట్టలేదని అన్నారు. గత ప్రభుత్వం రెవెన్యూ వ్యవస్థను, వీఆర్ఏ, వీఆర్ఓ వ్యవస్థను పూర్తిగా కుప్పకూల్చారని, ప్రజా ప్రభుత్వంలో గ్రామానికి ఒక రెవెన్యూ అధికారమే జూన్ 2 నాటికి నియమిస్తామని, ప్రతి సంవత్సరం రెవెన్యూ రికార్డు మాన్యువల్ గా రాసి గ్రామంలో నోటీసు బోర్డుపై అతికిస్తామని మంత్రి తెలిపారు. భూ సరిహద్దులతో పాటు భూమి కొలతలు పూర్తిగా వందే విధంగా రిజిస్ట్రేషన్ వ్యవస్థలో మార్పులు తీసుకొని వచ్చామని అన్నారు. కర్ణాటక రాష్ట్రం విధానాలను ఆలోసరిస్తూ రాష్ట్ర వ్యాప్తంగా మండల కేంద్రాలలో 6 వేల లైసెన్స్ ప్రైవేటు సర్వేయర్లను ఏర్పాటు చేస్తున్నామని , వీరికి మరో వారం రోజులలో శిక్షణ ప్రారంభం అవుతుందని అన్నారు. భారతదేశ సరిహద్దుల అంశంలో రాజకీయాలకు అతీతంగా కేంద్ర ప్రభుత్వానికి సంపూర్ణంగా తమ మద్దతు అందిస్తామని మంత్రి శ్రీధర్ బాబు స్పష్టం చేశారు. గతంలో ఇందిరా గాంధీ అమెరికా నాయకత్వం ఎదిరించి పాకిస్థాన్ ను యుద్ధంలో చిత్తు చేసి ప్రత్యేకంగా బంగ్లాదేశ్ దేశాన్ని సృష్టించామని, నేడు అమెరికా ఒత్తిడికి తలొగ్గి రాజీపడటం దురదృష్టకరమని మంత్రి తెలిపారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడిన 48 గంటల లోగా మహిళలకు ఆర్టీసీ బస్సులలో ఉచిత ప్రయాణం సౌకర్యం కల్పించామని అన్నారు. లి ఎలిగేడు మండలంలో ఇందిరమ్మ ఇండ్ల పథకానికి ఎంపిక చేసిన 150 మంది లబ్ధిదారులకు మంత్రుల చేతుల మీదుగా మంజూరు పత్రాలు పంపిణీ చేశారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అన్నయ్య గౌడ్, పెద్దపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ స్వరూప, అదనపు కలెక్టర్ డి.వేణు, రెవెన్యూ డివిజన్ అధికారి గంగయ్య, తహసిల్దార్ బషీరుద్దీన్, మార్కెట్ చైర్మన్‌లు సంజీవ్, తిరుపతి రెడ్డి రైతులు ప్రజాప్రతినిధులు, పాల్గొన్నారు.

## పెంచిన మెట్రో రైలు ఛార్జీల్లో సవరణ

రూ.12కి, గరిష్ఠ ఛార్జీ రూ.60 నుంచి 75కి పెంచుతున్నట్లు హైదరాబాద్ మెట్రో రైల్ సంస్థ ప్రకటించిన విషయం తెలిసిందే.

### 'బీటింగ్ రీట్రీట్' పునః ప్రారంభం

అయితే దీనిపై పలు ఆంక్షలు విధించారు. జెండా అవనతం ప్రక్రియ సమయంలో బార్డర్ గేట్లను తెరవబోమని.. బీఎస్‌ఎఫ్ దళాలు పాక్ రేంజర్లతో కరచాలనం చేయవని చెప్పారు. ఈ కార్యక్రమం సమయాన్ని కూడా తగ్గించినట్లు పేర్కొన్నారు. తొలిరోజు మీడియా ప్రతినిధులకు మాత్రమే అనుమతి ఇస్తున్నామని.. రేపటి నుంచి సాధారణ పౌరులందరికీ అనుమతి ఉంటుందని తెలిపారు. మే 8 నుంచి సైనిక దళాలు ప్రతిరోజూ జెండాను అవనతం చేస్తున్నాయని .. కానీ ప్రజల భద్రత దృష్ట్యా బీటింగ్ రీట్రీట్, ప్రజలకు ప్రవేశం వంటివాటిని నిలిపివేశామని అన్నారు. 1959 నుంచి దేశ సరిహద్దుల్లో భారత్–పాక్ సైనికులకు మధ్య బీటింగ్ రీట్రీట్ జరుగుతోంది. ప్రతిరోజూ సాయంత్రం ఇరుదేశాల సైనికులు సంయుక్తంగా దీనిని నిర్వహిస్తారు. ఈ కసరత్తులో సైనికులు వివిధ విన్యాసాలు చేస్తారు. తరువాత ఇరుదేశాల జెండాలను అవనతం చేస్తారు. రెండు దళాల కమాండర్ల మధ్య కరచాలనంతో ఇది ముగుస్తుంది. ఈ కార్యక్రమాన్ని సందర్శించడానికి ప్రతిరోజు సరిహద్దు గ్రామాల ప్రజలు, పర్యాటకులు భారీగా హాజరవుతుంటారు. పహల్గాం ఉగ్రదాడి తర్వాత పాక్‌పై పలు దౌత్య చర్యలను తీసుకున్న భారత్ సరిహద్దుల్లో బీటింగ్ రీట్రీట్ వేడుకనూ నిలిపివేసింది. గతంలో 2014 వాఘా వద్ద ఆత్మాహుతి బాంబు దాడి, 2019లో పుల్వామా దాడి తర్వాత కూడా ఈ కార్యక్రమాన్ని తాత్కాలికంగా నిలిపివేశారు.

## గాజా చిన్నారుల ఆకలి తీర్చండి

న్యూఢిల్లీ(జనంసాక్షి):ఇజ్రాయెల్ భీకర దాడులతో గాజాలో పరిస్థితులు పూర్తిగా మారాయి. అక్కడి ప్రజల జీవనం ప్రశ్నార్థంగా మారింది. ఇప్పటికే గాజాను అన్ని వైపులా నిర్బంధించిన ఇజ్రాయెల్ పరిమిత స్థాయిలో మాత్రమే మానవతా సాయానికి అనుమతిస్తోంది. దీంతో ఆ ప్రాంతంలో ఆకలి కేకలు మిన్నంటుతున్నాయి. ఈ పరిస్థితిపై స్పందించిన ఐక్యరాజ్యసమితి తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. మానవతా సాయం ఇలాగే కొనసాగితే మరో 48 గంటల్లో 14 వేల మంది చిన్నారులు మరణించే అవకాశం ఉందంటూ హెచ్చరించింది. 11 వారాల క్రితం పాలస్తీనా భూభాగాన్ని ఇజ్రాయెల్ నిర్బంధించింది.

## ఆగని మృత్యుఘోష..

పాలస్తీనియన్ల ప్రాణాలు పోగొట్టుకొన్నారు. మొన్నటివరకు వైమానిక దాడులే అధికంగా చేస్తూ వచ్చిన ఇజ్రాయెల్ ఇప్పుడు భూతల దాడులను పెంచింది. జబాలియా శరణార్థి శిబిరంతో పాటు.. అల్ మువాసీలో గుడారాల్లో తల దాచుకుంటున్న వారిపైనా బాంబుల వర్షం కురిపిస్తుండడంతో ప్రతిరోజూ వందల సంఖ్యలో ప్రజలు ప్రాణాలు కోల్పోతున్నారు. కాల్పుల విరమణ ఒప్పందం కొనసాగింపునకు హమాస్ అంగీకరించనందునే ఈ దాడులను తీవ్రం చేసినట్లు ఇటీవల నెతన్యాహు వెల్లడించిన సంగతి తెలిసిందే.

## నాలుగైదు రోజుల్లో కేరళకు నైరుతి

మరో నాలుగైదు రోజుల్లో అత్యంత త్వరగా కేరళను తాకే అవకాశం కనిపిస్తోందని ఐఎండీ తెలిపింది. ఏటా జూన్ 1 ప్రాంతంలో కేరళను తాకే నైరుతి రుతుపవనాలు ఈసారి కాస్త ముందుగానే వస్తున్నాయని వెల్లడించింది. సాధారణంగా జూన్ 1 నాటికి రుతుపవనాలు కేరళలోకి ప్రవేశించడం ద్వారా దేశమంతటా వర్షాలు మొదలవుతాయి. జులై 8 నాటికి ఇవి దేశమంతా విస్తరిస్తాయి. మళ్లీ వాయువ్య భారతం నుంచి సెప్టెంబరు 17తో రుతుపవనాల ఉపసంహరణ మొదలై అక్టోబరు 15 నాటికి ముగుస్తుంది. గతేడాది మే 30న నైరుతి రుతుపవనాలు రాగా.. 2023 జూన్ 8న, 2022 మే 29న దేశంలోకి ప్రవేశించాయి. ఈ సీజన్‌లో సాధారణం కంటే ఎక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. మన దేశంలో 52% నికర సాగు భూమికి ఇప్పటికీ వర్షపాతమే ప్రధాన ఆధారం. దేశం మొత్తం వ్యవసాయ ఉత్పత్తిలో సాగు భూమి నుంచే ఏకంగా 40% దిగుబడి వస్తుంది. అందుకే భారత ఆహార భద్రత, ఆర్థిక స్థిరత్వంలో నైరుతి రుతు పవనాలు కీలక పాత్ర పోషిస్తాయి. దేశవ్యాప్తంగా తాగునీరు, విద్యుత్ ఉత్పత్తికి కీలకమైన జలాశయాలను తిరిగి నింపడానికి, దేశ జీడీపీకి 18.2 శాతం తోడ్పాటుకు ఇది ఎంతో ముఖ్యం.

## మధ్యప్రదేశ్ మంత్రికి పదవీ గండం!

సభ్యులతో ఏర్పాటైన సిట్ ఆ రోజున నివేదిక ఇవ్వనుంది. దాని ఆధారంగా చర్యలు ఉండొచ్చని భాజపా వర్గాలు వెల్లడించాయి. పాకిస్థాన్‌తో పోరుకు సంబంధించి మీడియాకు వివరాలు వెల్లడిస్తూ వచ్చిన సైనికాధికారిణి కర్నల్ సోఫియా ఖురేషీపై మధ్యప్రదేశ్ గిరిజన సంక్షేమశాఖ మంత్రి విజయ్ షా చేసిన వ్యాఖ్యలు తీవ్ర వివాదానికి దారితీసిన సంగతి తెలిసిందే.

# వరి జన్యుమార్పిడి నిర్ణయాన్ని ఉపసంహరించుకోండి

- కేంద్రానికి రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి లేఖ
- మన్మోహన్ సింగ్ హయాంలో వంకాయ జన్యు మార్పిడి నిర్ణయాన్ని ఉపసంహరించుకున్నట్లు గుర్తుచేసిన కోదండరెడ్డి..

**హైదరాబాద్, మే 20 (జనంసాక్షి) :** రైస్ జన్య మార్పిడికి కేంద్రం అనుమతించడాన్ని రాష్ట్ర అగ్రికల్చర్ కమిషన్ తీవ్రంగా వ్యతిరేకించింది. దీనిపై కేంద్ర వ్యవసాయశాఖ మంత్రికి తెలంగాణ రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి లేఖరాశారు. రైస్ జన్య మార్పిడి విషయంలో కేంద్రం తీసుకున్న నిర్ణయం అత్యంత తీవ్రమైందని అభివర్ణించారు. ఈ నిర్ణయం వల్ల దేశంలో ఉన్న ఫుడ్ సిస్టమ్ పై ప్రభావం చూపుతుందన్నారు. గతంలో మన్మోహన్ సింగ్ ప్రధానిగా వున్నప్పుడు ఆహార పంట అయినా వంకాయ జన్య మార్పిడిని కాంగ్రెస్ వ్యతిరేకించిందని గుర్తుచేశారు. అప్పటి దేశ ప్రధాని మన్మోహన్ సింగ్.. రాష్ట్ర రైతాంగం అభిప్రాయాన్ని మన్నించి ఆ



ప్రయత్నాన్ని ఉపసంహరించుకున్నట్లు తెలిపారు. ప్రస్తుతం కేంద్రం లో ఉన్న నరేంద్ర మోడీ ప్రభుత్వం ఎవరిని సంప్రదించకుండా ఏకపక్షంగా నిర్ణయం తీసుకోవడం సరికాదన్నారు. వరి ధాన్యాన్ని ఎక్కువ ఉత్పత్తి చేసే రాష్ట్రం తెలంగాణ అని.. ఇక్కడి రాష్ట్ర రైతాంగం తరుపున రైతు కమిషన్ తీవ్రంగా ఖండిస్తోందని తెలిపారు. ఈ నిర్ణయం వల్ల రైస్ వినియోగదారుడిపై కూడా తీవ్రమైన ప్రభావం పడ్తుందని, ఎక్కువ శాతం వరి పండించే తెలంగాణపై ఈ నిర్ణయంతో తీవ్రమైన ఆర్థిక ప్రభావం పడుతుందని చైర్మన్ కోదండరెడ్డి తన లేఖలో పేర్కొన్నారు. అంతేకాదు విత్తన హక్కుకు కూడా భంగం కలుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇంత కీలకమైన ఈ నిర్ణయం తీసుకోకముందు రాష్ట్ర అభిప్రాయం తీసుకోకపోవడం బాధాకరమని తెలిపారు, అంతేకాదు వినియోగదారులను పరిగణలోకి తీసుకోకపోవడం తీవ్రమైన విషయంగా కమిషన్ పరిగణిస్తుందన్నారు. దీర్ఘకాల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని భారతదేశ వ్యవసాయము రైతు సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని ఈ నిర్ణయాన్ని వెంటనే కేంద్ర ప్రభుత్వం ఉపసంహరించుకోవాలన్నారు.

## గర్భస్థ పిండ లింగ నిర్ధారణ చేయడం చట్టరీత్యా నేరం

- వరంగల్ జిల్లా కలెక్టర్ సత్య శారదా దేవి...



**వరంగల్ ప్రతినిధి, మే 20 (జనం సాక్షి):** గర్భస్థ పిండ లింగ నిర్ధారణ చేసే స్కానింగ్ సెంటర్ లపై చట్టం ప్రకారం చర్యలు చేపట్టాలని వరంగల్ జిల్లా కలెక్టర్ సత్య శారదా దేవి అన్నారు. జిల్లా కలెక్టర్ కాన్ఫరెన్స్ హాలులో మంగళ వారం జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అధ్యక్షతన గర్భస్థ పిండ లింగ నిర్ధారణ స్కానింగ్ సెంటర్ల పై సమీక్ష సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సమీక్ష సమావేశానికి జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద,ఈస్ట్ జోన్ డీసీపీ అంకిత్ కుమార్, అదనపు కలెక్టర్ జి.సంధ్య రాణి, జిల్లా వైద్యాధికారి సాంబశివరావుగార్లు పాల్గొని జిల్లాలో లింగ నిర్ధారణ పరీక్షలు నేరమని కమిటీ సభ్యులు తరచూ తనిఖీలు నిర్వహించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద మాట్లాడుతూ గర్భస్థ పిండలింగ నిర్ధారణ చేయు స్కానింగ్ సెంటర్ల పై దృష్టి సారించాలని,అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి జిల్లాలో లింగ నిర్ధారణ పరీక్షలు చేయకుండా భ్రూణ హత్యలు జరగకుండా ప్రజలలో అవగాహన కల్పించుటకు జిల్లా పౌర సంబంధాల అధికారి ఆధ్వర్యంలో ఉన్న కళా జత బృందాల చే అవగాహన కల్పించాలని ఆదేశించారు.జిల్లాలో కొన్ని మండలాలలో లింగ నిర్ధారణ చేయడం వలన బాలికల నిష్పత్తి చాలా వ్యత్యాసముగా ఉంటుందని, ఇట్టి వ్యత్యాసం వలన భవిష్యత్తు తరాలకు సమస్యలు ఎదురవుతాయని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా వరంగల్ డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ అంకిత్ కుమార్ సంక్వాలే మాట్లాడుతూ పోలీస్ శాఖ నిరంతరము పర్యవేక్షణ లో ఉంటుందని వైద్య ఆరోగ్యశాఖ సిబ్బందికి సహాయం అందించడానికి సిద్ధంగాఉన్నామని వారు తెలిపారు. మండల పరశురాములు అభ్యుదయ సేవా సమితి అధ్యక్షులు మాట్లాడుతూ గర్భస్థ పిండలింగ నిర్ధారణ చేయకుండా ఉండాలంటే ప్రజలలో అవగాహన కల్పించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో వరంగల్ ఏసిపి నందిరాం నాయక్, మామునూరు ఏసిపి తిరుపతి, నర్సంపేట ఏసిపి రవీందర్ రెడ్డి, పబ్లిక్ ప్రాసిక్యూటర్ సంతోషి, ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ ఆచార్య, డిప్యూటీ డెమో అనిల్ కుమార్, సర్కిల్ఇన్స్పెక్టర్ వెంకన్న, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## సింగిల్ యూసేజ్ ప్లాస్టిక్ నిషేధాన్ని పకడ్బందీగా అమలు చేయాలి

- జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్



**నిర్మల్ రూరల్, మే 20(జనం సాక్షి) :** జిల్లాలో సింగిల్ యూసేజ్ ప్లాస్టిక్ వినియోగంపై నిషేధాన్ని కఠినంగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులనుఆదేశించారు. మంగళవారం సాయంత్రం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ప్లాస్టిక్ నిషేధంపై నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, పర్యావరణాన్ని ప్లాస్టిక్ తీవ్రంగా ప్రభావితం చేస్తోందని,ఇది మానవాళి ఆరోగ్యానికి మాత్రమే కాకుండా ఇతర జీవరాశులకు కూడా ముప్పుగా మారిందని కలెక్టర్ ఆందోళన వ్యక్తం చేశారు. 120 మైక్రాన్ల కన్నా తక్కువ మందం ఉన్న ప్లాస్టిక్ వస్తువుల వాడకాన్ని పూర్తిగా నిషేధించాలని సూచించారు.జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీల్లో స్టీల్ బ్యాంకులను ఏర్పాటు చేసి ప్లాస్టిక్ ఉపయోగాన్ని తగ్గించాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్లాస్టిక్ వినియోగాన్ని నివారించేందుకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని,మహిళా స్వయం సహాయక సంఘాల సహకారంతో ఈ కార్యాచరణను ముందుకు తీసుకెళ్లాలని తెలిపారు. పంచాయతీ స్థాయిలో ప్లాస్టిక్ నిషేధానికి అనుగుణంగా తీర్మానాలు చేయాలని పేర్కొన్నారు. ప్లాస్టిక్ వస్తువులను వేరుగా సేకరించి సెగ్రిగేషన్ చేయాలని,కలెక్టరేట్‌లో ఇప్పటికే స్టీల్ నీళ్ల సీసాలను వినియోగంలోకి తీసుకొచ్చామని వివరించారు.నిషేధిత ప్లాస్టిక్ వస్తువుల తయారీ, విక్రయంపై కఠిన చర్యలు తీసుకోవాలని, ఉల్లంఘించిన వారికి జరిమానాలు,వ్యాపార లైసెన్సులను రద్దు చేయడం సహా చట్టపరమైన చర్యలకు వెనుకాడరాదని అధికారులను హెచ్చరించారు.ప్లాస్టిక్ నిషేధానికి కృషి చేస్తున్న సంస్థలను గుర్తించి ప్రోత్సహించాలని సూచించారు.గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో మహిళా సంఘాలు, యువజన సంఘాలు, ప్రజాప్రతినిధులతో కలిసి గ్రామ సభలు నిర్వహించి ప్రజల్లో చైతన్యం పెంచాలని అన్నారు.ప్లాస్టిక్‌కు ప్రత్యామ్నాయంగా జూట్, పేపర్ సంచుల తయారీ కేంద్రాలను మహిళా సంఘాలచే ఏర్పాటు చేయాలని సూచించారు. రాబోయే వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని పరిశుద్ధ నిర్వహణను మెరుగుపరచాలని,దోమల నియంత్రణకు ఫాగింగ్ యంత్రాలను సిద్ధంగా ఉంచాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్(స్థానిక సంస్థలు)ఫైజాన్ అహ్మద్, ఆర్డీఓలు రత్నాకళ్యాణి, కోమల్ రెడ్డి,జడ్పి సి ఈ ఓ గోవింద్, డి ఆర్ డి ఓ విజయలక్ష్మి,డి పి ఓ శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్లు,జగదీశ్వర్ గౌడ్, రాజేష్ కుమార్,ఎంపీ డివో లు, తదితరులు పాల్గొన్నారు.

## పద్మభూషణ్ జయంత్ నార్లికర్ మృతికి విజ్ఞానదర్శిని సంతాపం

**హైదరాబాద్, మే 20 (జనంసాక్షి) :** పద్మభూషన్ జయంత్ నార్లికర్ మృతికి విజ్ఞానదర్శిని సంతాపం తెలిపింది. 27 ఏండ్లకే పద్మభూషణ్ అవార్డు సాధించిన గొప్ప వైజ్ఞానికవేత్త జయంత్ నార్లికర్ అని, ఈ రికార్డును నేటికీ ఎవరూ అధిగమించకపోవడం తన అద్వితీయ మేధకు నిదర్శనమని కేంద్ర చాప్టర్ అధ్యక్షులు రమేష్ తెలిపారు. ప్రొఫెసర్ జయంత్ నార్లికర్ 2025 మే 19 రాత్రి కన్నుమూశారని, ఆయన ఖగోళ భౌతిక విజ్ఞానం మరియు విశ్వవిజ్ఞాన రంగాలలో చేసిన అద్వితీయ కృషి ఎంతో ప్రసిద్ధమైనదని, మహారాష్ట్ర అంధశ్రద్ధ నిర్మూలన సమితి (మాన్స్)తో కలిసి ఆయన జ్యోతిష్యం మరియు మూఢనమ్మకాలకు వ్యతిరేకంగా ఉద్యమంలో కూడా పాల్గొన్నారని, వాటిని ప్రయోగాత్మకంగా ఎండగట్టాడని తెలిపారు. తనొక విశిష్ట విజ్ఞాన సందేశకర్త, ఐయూసీఏఏ స్థాపకుడు, విజ్ఞాన ప్రచారం కోసం యునెస్కో కళింగ అవార్డు గ్రహీతగా ఆయన కృషిని దేశం ఎల్లప్పుడూ గుర్తుంచుకోదగిందని, తను చాలా సులభంగా అందరికీ అర్థం అయ్యేలా ఖగోళ వైజ్ఞానిక అంశాలను వివరిస్తూ ఎన్నో పుస్తకాలను రచించారని, జయంత్ నార్లికర్ మరణం దేశానికే కాకుండా ప్రపంచ ఖగోళ విజ్ఞాన రంగానికే తీరని లోటని, మహా విజ్ఞాని మరణానికి విజ్ఞానదర్శిని సంతాపాన్ని ప్రకటిస్తున్నదని తెలిపారు. ప్రధాన కార్యదర్శి గుంటుపల్లి శ్రీతేజ, సహాయ కార్యదర్శి శోభారాణి, కోశాధికారి రామ్మూర్తి, తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు బొల్లి ఆదాంరాజు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మహ్మద్ ఆలీ, రాష్ట్ర కోశాధికారి జయప్రసాద్, ఆంధ్రా చాప్టర్ కో–ఆర్డినేటర్ సూర్య తదితరులు నివాళ్లర్పించారు.

## హత్యాయత్నం కేసులో నిందితుడికి 14 రోజుల రిమాండ్

**టేకుమట్ల మే 20 (జనంసాక్షి) :** జయశంకర్ భూపాలపల్లి జిల్లా టేకుమట్ల మండలం లోని పంగిడిపల్లి గ్రామం లో జరిగిన భూమి తగదా కేసు వివరాల్లోకి వెళ్తే గత నెల ఏప్రిల్ 14 న పొలానికి వెళ్లే దారి విషయంలో సమీప బంధువైన గౌడ సమ్మయ్య అతని భార్య శైలజ డ్రైవర్ పురాణం అశోక్ అనే వ్యక్తులపై దాడి చేసి వారిని తీవ్రంగా గాయపరిచిన వ్యక్తులపై టేకుమట్ల పోలీస్ స్టేషన్లో హత్యాయత్నం కేసు నమోదు చేశారు. అప్పటినుండి నిందితుడు వీరముష్టి ప్రేమ్ దాస్ తండ్రి రాజయ్య గ్రామం పంగిడిపల్లి అనె వ్యక్తులు పరారీలో ఉన్నారు ఈ క్రమంలో ఈరోజు నిందితుడిని హానరబుల్ జ్యూడిషియల్ మెజిస్ట్రేట్ ముందు ఉత్తర్వుల మేరకు 14 రోజుల రిమాండ్ నిమిత్తం పరకాల జైలుకు తరలించినట్లు పోలీసు వర్గాలు తెలిపారు.

## కాళేశ్వరానికి ప్రముఖుల తాకిడి..



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో/ కాళేశ్వరం, (జనంసాక్షి):** కాళేశ్వర ముక్తీశ్వర స్వామిని దర్శించుకోవడానికి ప్రముఖులు వస్తున్నారు. ఎస్ఐబి డైరెక్టర్ తరుణ్ జోషి, హై కోర్టు న్యాయమూర్తి సృజన లు మంగళవారం వేర్వేరుగా వచ్చి సరస్వతిలో పుణ్య స్నానాలను ఆచరించారు. అనంతరం కాళేశ్వర ముక్తీశ్వర స్వామిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా దర్శనానికి వచ్చిన ప్రముఖులకు అధికారులు సరస్వతి అమ్మవారి చిత్రపటాన్ని అందచేశారు.

## కమిషన్ పేరుతో కేసీఆర్ పేరు ప్రఖ్యాతలు తగ్గించలేరు

- బీఆర్ఎస్ అధికార ప్రతినిధి ఉపేంద్ర



**హైదరాబాద్ (జనంసాక్షి) :** కమిషన్ పేరుతో కేసీఆర్ పేరు ప్రఖ్యాతలు తగ్గించలేరని బీఆర్ఎస్ అధికార ప్రతినిధి ఉపేంద్ర అన్నారు. దేశానికి స్వతంత్రం వచ్చిన తర్వాత ప్రజా సమస్యల కోసం ఆమరణ నిరాహార దీక్ష చేసిన గొప్ప నాయకుడు కేసీఆర్ అని తెలిపారు. దశాబ్దాలుగా తెలంగాణకు నీటి పంపకంలో అన్యాయం జరిగిందన్నారు. ఆంధ్రా వలస పాలన పోవాలని, తెలంగాణ సస్యశ్యామలం చేసేందుకు, బీడు భూముల్లో నీళ్లు పారించేందుకు కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మించారని తెలిపారు. దేశంలో పంటలు ఎక్కువగా పండే స్థితికి తెలంగాణను తెచ్చారని, అలాంటి నేతకు కమిషన్ ద్వారా నోటీస్ లిపించి వారి కీర్తి ప్రతిష్టలను తగ్గించడానికి కాళేశ్వరం ప్రాజెక్టును విఫల ప్రయోగమని నిరూపించడానికి ఈ ప్రభుత్వ చర్యలు తెలంగాణ రాష్ట్రానికి ప్రజలకు రాబోయే కాలంలో ఇబ్బంది కలిగించే విధంగా ఉన్నాయని ఉపేంద్ర అన్నారు. ఇలాంటి కమిషన్లు కోర్టులు న్యాయాన్ని ధర్మాన్ని అణచిపెట్టలేదని ఎప్పటికైనా ధర్మం గెలుస్తుందని అన్నారు. కేసీఆర్‌పై ఎలాంటి ఆరోపణలు చేసిన చివరకు అది వారికి వర్తిస్తుందని ఇలాంటి చిల్లర ప్రయత్నాలు సూర్యునిపై ఉమ్మేయాలని, అనుకోవడమే అవుతుందని ఆయన అన్నారు.

## పెంచిన మెట్రో ఛార్జీల్లో స్వల్పంగా తగ్గింపు

**హైదరాబాద్, మే 20 (జనంసాక్షి) :** నగర వాసులకు హైదరాబాద్ మెట్రో రైలు సంస్థ గుడ్ న్యూస్ చెప్పింది. ఇటీవల మెట్రో చార్జీలను భారీగా పెంచిన యాజమాన్యం కాస్తా దిగొచ్చింది. తాజాగా మెట్రో రైలు సంస్థ టికెట్ ధరలను సవరించింది. మంగళవారం మెట్రో చార్జీలను తగ్గిస్తున్నట్లు– ప్రకటించింది. పెంచిన ధరలపై 10 శాతం చార్జీలను తగ్గిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. తగ్గించిన టికెట్ ధరలను మే 24వ తేదీ నుండి అమలులోకి తీసుకురానున్నట్టు– వెల్లడించింది. కాగా, ఇటీ–వల కనిష్టంగా ఉన్న రూ.10 టికెట్ ధరను 12 రూపాయలకు పెంచింది. గరిష్టంగా ఉన్న 60 రూపాయల టికెట్ ధరను 75 రూపాయలకు పెంచిన సంగతి తెలిసిందే.

## విత్తనాలు, ఎరువులను ఎంఆర్పీకే విక్రయించాలి

- అధిక ధరలకు అమ్మితే కఠిన చర్యలు
- జనగామ జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్



**స్టేషన్ ఘన్పూర్, మే 20 (జనం సాక్షి) :** విత్తనాలు, ఎరువులను ఎంఆర్పీ కే విక్రయించాలని, అధిక ధరలకు అమ్మితే కఠిన చర్యలు తప్పవని జనగామ జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. మంగళవారం నియోజకవర్గ కేంద్రంలోని ఆగ్రోస్ రైతు సేవా కేంద్రం -2, తిరుమల ఫెర్టిలైజర్స్ దుకాణాలను అదనపు కలెక్టర్ (రెవెన్యూ) రోహిత్ సింగ్ తో కలిసి జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ సందర్శించి, ఆకస్మిక తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా విత్తనాలు, ఎరువు ల క్రయవిక్రయాలు, రైతుల కొనుగోలు వివరాల రిజిస్ట ర్లను తనిఖీ చేసి, రోజూవారీ విక్రయాల గురించి ఆరా తీశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రైతులకు కొనుగోళ్ల బిల్లుల ను ఖచ్చితంగా అందించా లన్నారు. అన్ని రికార్డులను ఎప్పటికప్పుడు సరైన విధంగా నిర్వహించాలని సూచించారు. అదే విధంగా వివిధ కంపెనీలకు చెందిన విత్తనాలను పరిశీలించి, నకిలీ విత్తనాలను అమ్మరాదని, రైతులకు గరిష్ట చిల్లర ధర (ఎమ్మార్పీ)కి నాణ్యమైన విత్తనాలను మాత్రమే విక్రయించాలని తెలిపారు. స్టాక్ నిల్వలను పరిశీలించి, యూరియా బస్తాలు,జీలుగు విత్తనాలు,ఇతర ఎరువు ల వివరాల గురించి అడిగి తెలుసుకున్నారు. స్టాక్ నిల్వలకు సంబంధించి ధరల పట్టిక వివరాలను బోర్డు పై తప్పనిసరిగా ప్రదర్శించాలన్నారు. ఈ తనిఖీలో కలెక్టర్ వెంట అదనపు కలెక్టర్ రోహిత్ సింగ్, డీఏఓ రామారావు నాయక్, తహసీల్దార్ వెంకటేశ్వర్లు, ఏఓ చంద్రన్ కుమార్, ఆర్ఐ లు శ్రీకాంత్, సతీష్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## కేంద్ర ప్రభుత్వ కార్పొరేట్ అనుకూల విధానాలు ఉపసంహరించుకోవాలి

- యస్ కె యం, కార్మిక సంఘాల నాయకుల పిలుపు
- సెంట్రల్ లేబర్ కమిషనర్ కార్యాలయం ముందు జరిగిన ధర్నా



**హైదరాబాద్, మే 20 (జనంసాక్షి) :** కేంద్ర ప్రభుత్వం కార్పొరేటర్ అనుకూల విధానాలు ఉపసంహరించే వరకు ఐక్యంగా పోరాడుదామని మంగళవారం శివం రోడ్ లోని సెంట్రల్ లేబర్ కమిషనర్ కార్యాలయం ముందు జరిగిన ధర్నా లో సంయుక్త కిసాన్ మోర్చా యస్ కె యం రాష్ట్ర కన్వీనర్ లు టి సాగర్,పశ్య పద్మ, కార్మిక సంఘాల ఐక్య కార్యాచరణ కమిటీ నాయకులు పాలడుగు భాస్కర్, వెంకటేష్ , సూర్యం,యం శ్రీనివాస్,చంద్ర శేఖర్,పబ్లిక్ సెక్టార్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ కార్యదర్శి నాగేశ్వరరావు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా జరిగే నిరసనలలో భాగంగా సెంట్రల్ లేబర్ కమిషనర్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించామని తెలిపారు. నాలుగు లేబర్ కోడ్ లను రద్దు చేయాలని, కార్మికులకు కనీస వేతనాలు 26,000 నిర్ణయించాలని, 8 గంటల పని విధానాన్ని కొనసాగించాలని ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటు కార్పొరేట్ సంస్థలకు కట్టబెట్టొద్దని డిమాండ్ చేశారు.నూతన వ్యవసాయ మార్కెట్ ముసాయిదాను ఉపసంహరించుకోవాలని, సి2 కు 50 శాతం కలిపి మద్దతు ధరల కు కొనుగోలు చేసే చట్టం చేయాలని, రైతు రుణాలు రద్దు చేయాలని, కౌలు రైతుల రక్షణకు సమగ్ర చట్టం చేయాలని, ఇండో అమెరికన్ ఫ్రీట్రేడ్ అగ్రిమెంట్లు తిరస్కరించాలని, ఉపాధి హామీ పథకం 200 రోజులకు, రోజువారీ కూలీ రూ.600కు పెంచాలని, విద్యుత్తు సవరణ చట్టాన్ని రద్దు చేయాలని ,నూతన వ్యవసాయ మార్కెట్ పాలసీని రద్దు చేయకపోతే రైతాంగం తీవ్రంగా నష్టపోతారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులు పండించే పంటల ఉత్పత్తులకు కనీస మద్దతు ధర కేటాయించి, కొనుగోలు చేయాలన్నారు. ఈ నిరసన కార్యక్రమంలో జే వెంకటేష్, ఈశ్వరరావు ,శ్రీకాంత్ కూరపాటి రమేష్ (సిఐటియు ), మూడ్ శోభన్, ప్రభులింగం (రైతు సంఘం) యస్ ఎల్ పద్మ,అనురాధ(ఐఫ్ టి యు), నరసింహ్మ, యాదగిరి ( ఏఐటియుసి) తదితరులు పాల్గొన్నారు.

## హైదరాబాద్‌లో మరో అగ్నిప్రమాదం

**హైదరాబాద్, మే20 (జనంసాక్షి) :** నగరంలో మరో అగ్నిప్రమాదం జరిగింది. నగరంలోని ఛత్రినాక పోలీస్ స్టేషన్ పరిధిలో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ఓ భవనం రెండో అంతస్తులో ప్రమాదవశాత్తు మంటలు చెలరేగాయి. భారీగా మంటలు ఎగసిపడుతుండటంతో దట్టంగా పొగ కమ్ముకుంది. మంటలు చెలరేగడంతో భవనంలోని నివాసితులు వెంటనే కిందకు వచ్చి ప్రాణాలు కాపాడుకున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే సంఘటనాస్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. ఫైరింజన్లతో మంటలను అదుపు చేశారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామని తెలిపారు. కాగా, రెండు రోజుల క్రితం పాతబస్తీలో భారీ అగ్నిప్రమాదం జరిగిన సంగతి తెలిసిందే. ఈ ప్రమాదంలో ఒకే కుటు–ంబంలోని 17మంది ప్రాణాలు కోల్పోయారు.

## క్వారీలో రాళ్లుకూలి ఐదుగురు కూలీల దుర్మరణం

**చెన్నై, మే20 (జనంసాక్షి) :** తమిళనాడు లోని శివగంగ జిల్లా మల్లకొట్టాయ్ లోని ఓ ప్రైవేట్ రాళ్ల క్వారీలో మంగళవారం అకస్మాత్తుగా రాళ్లు కూలి ఐదుగురు మృతి చెందారు. ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. మృతులు మురుగనందం, ఆరుముగం, గణేశన్, ఆండిచామి, తమిళనాడుకు చెందిన వారు కాగా, హర్షిత్ ఒడిసాకు చెందిన వాడు. గాయపడిన వారిని మదురై ఆస్పత్రికి తరలించారు. ఈ ప్రమాదంలో మృతుల కుటు–ంబాలకు రూ. 4 లక్షల వంతున, గాయపడిన వారికి రూ. లక్ష వంతున తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ ప్రకటించారు. శిథిలాల్లో ఇరుక్కున్న మృతదేహాలను పోలీసులు, ఫైర్, సహాయ బృందాలు బయటకు తీశారు.

## రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలి

- ప్రజలు కోరుకుంటేనే అన్ని పదవులు
- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు..



**శాయంపేట, మే 20 (జనం సాక్షి) :** శాయంపేట మండల కేంద్రంలోని ఎస్వీకేకే ఫంక్షన్ హాల్లో పార్టీ మండల అధ్యక్షుడు దూదిపాల బుచ్చిరెడ్డి అధ్యక్షతన మండలంలోని అన్ని గ్రామాల ముఖ్య నేతలతో సంస్థాగత నిర్మాణ సన్నాహక సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. క్షేత్ర స్థాయి నుండి పార్టీ నిర్మాణంలో సామాజిక న్యాయం పాటించడం ద్వారా ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుద్దామని కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ అన్నారని గుర్తుచేశారు. గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు పార్టీ ప్రక్షాళనలో పీసీసీ పరిశీలకుల బాధ్యత అత్యంత కీలకమైందన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పని చేయాలని ఎమ్మెల్యే సూచించారు. త్వరలో జరగనున్న జడ్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచ్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులను గెలిపించుకోవాలన్నారు. పేద, నిరుపేద ప్రజలకు సీఎం సహాయ నిధి ఎంతో అండగా నిలుస్తుందని ఎమ్మెల్యే జీఎస్సార్ అన్నారు. శాయంపేట లో సంస్థాగత నిర్మాణ సన్నాహక సమావేశం అనంతరం మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన మొత్తం 37 మందికి సీఎంఆర్ఎఫ్ లబ్దిదారులకు రూ.16,70,000 విలువ కలిగిన చెక్కులను ఎమ్మెల్యే చేతుల మీదుగా అందజేశారు.

శాయంపేటలో సంస్థాగత నిర్మాణ సన్నాహక సమావేశం అనంతరం ఫంక్షన్ హాల్ నుండి స్థానిక అంబేద్కర్ సెంటర్ వరకు మండల కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిర్వహించిన జై భీమ్, జై బాపూ, జై సంవిధాన్ రాజ్యాంగ పరిరక్షణ పాదయాత్రలో వందలాది మంది కాంగ్రెస్ నేతలతో కలిసి ఎమ్మెల్యే పాల్గొన్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మన దేశ రాజ్యాంగం అమలులోకి వచ్చి 75 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా రాజ్యాంగ విలువలపై ప్రజల్లో అవగాహన పెంచడమే లక్ష్యంగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. నేడు పేద, బలహీన వర్గాల ప్రజల ఆకాంక్షలు నెరవేరటం లేదని, ప్రధానికి పేద ప్రజల కంటే బడాబాబులు ముఖ్యమన్నారు. రాజ్యాంగం కేవలం ఒక పుస్తకం కాదని, అంబేడ్కర్, గాంధీ, పూలే లాంటి గొప్ప వాళ్ళ ఆలోచనలతో కూడిన ఒక పవిత్ర గ్రంథమన్నారు. గ్రామ, మండల స్థాయిలో ఈ కార్యక్రమాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్లాలని కోరారు. ఈ కార్యక్రమాలల్లో అన్ని గ్రామాల కాంగ్రెస్ పార్టీ నాయకులు, పలువురు ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, పాల్గొన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
బుధవారం
21 మే 2025
తెలంగాణ

# మహిళా యూట్యూబర్ ముసుగులో దేశ ద్రోహం

### జ్యోతి మల్హోత్రా: ట్రావెల్ యూట్యూబర్ నుండి గూఢచారిణిగా మారిన కథ

జ్యోతి మల్హోత్రా పేరు ఇప్పుడు భారతదేశం అంతటా ప్రతిధ్వనిస్తుంది. ఆకర్షణీయ రూపురేఖలతో, చక్కటి ఉచ్చారణతో, మంచి వాగ్ధాటితో ఎంతటివారినైనా ఇట్టే ఆకర్షించే శక్తి సామర్థ్యాలు గల జ్యోతి మల్హోత్రా, పర్యాటక ప్రాంతాలకు దూసుకెవెళ్లి, వార్తా విశేషాలను కవర్ చేస్తూ వాటిని వీడియోల ద్వారా సామాజిక మాధ్యమాలలో పోస్ట్ చేస్తూ వీక్షకుల మన్ననలు పొందిన ట్రావెల్ యూట్యూబర్‌గా పేరు పొందింది. ఆమె ఇప్పుడు అనేక ఆరోపణలతో చిక్కుల్లో పడింది. ఆమె పాకిస్థానీ నెంబరు 1 గూఢచారిణి అని కొందరు అంటున్నారు. ఈ విషయం తెలిసిందే తడవుగా అందరూ దిగ్భ్రాంతికి గురైనారు. పహల్గాం ఉగ్రదాడి తరువాత భారత్ సైనిక ఇంటలిజెన్స్ వర్గాల పరిశోధనా సంస్థలు అనేక విషయాలతో పాటు యూట్యూబర్ల కార్యకలాపాలపై కూడా విచారణ చేశాయి. ఈ సందర్భంగా యూట్యూబర్ జ్యోతి మల్హోత్రా దేశ ద్రోహ కుట్రల ఆనువాళ్ళ చరిత్ర బయట పడినట్లు తెలుస్తోంది.

మనదేశంలో బ్రతుకుతూ తన ట్రావెలర్ యుట్యూబర్ వృత్తిలో భాగంగా అనేక ఆకర్షణీయమైన, కీలకమైన ప్రదేశాలను పర్యటిస్తూ, ముఖ్యమైన కట్టడాల వీడియోలు తీసి పాకిస్తాన్ రాయబార కార్యాలయంలో ముఖ్య అధికారులతో సంబంధాలు పెట్టుకోని వారితో సంప్రదింపులు జరిపి మన దేశానికి చెందిన కీలక సమాచారం అందించిందని అందులోనూ సైనిక స్థావరాల సమాచారం కూడా ఉందట. ఇందుకు ప్రతిఫలంగా భారీ మొత్తంలో లంచం అందుకుంటూ వస్తుందట. ఇప్పుడు ఈ యూట్యూబర్ ను భద్రతా బలగాలు తగిన ఆధారాలతో అరెస్టు చేసింది. ఆమె పై ఇంటరాగేషన్ ఇంకా జరుగుతుంది. ఇంకా సంపూర్ణ సమాచారం వెల్లడి కావాల్సి ఉంది. ఆమెకు ట్రావెల్ విత్ జో అనే పేరుగల యూట్యూబ్ ఛానల్ ఉంది. ఆమె మొదట్లో హర్యానా, పంజాబ్ రాష్ట్రాలలో సంచరించింది. తాను హర్యానా, పంజాబీని అని పరిచయం చేసుకుంది. 33 ఏండ్ల ఈ యూట్యూబర్ కు ఇప్పటికే 3 లక్షల 85 వేలకు పైగా ఖాతాదార్లు ఉన్నారు. ఆమె పర్యాటక వీడియోలకు ప్రజాదరణ దక్కింది. ఫలితంగా ఆమెలో తక్కువ సమయంలో అధిక ధనం, ఆస్తులు అంతస్తులు సంపాదించు కోవాలి అనే కోరిక పెరిగింది. దీనితో ఆమె తన వృత్తి ధర్మాన్ని వదిలిపెట్టి దేశంలో కీలక



ప్రదేశాలు, కట్టడాలను వీడియోలు తీసి మన శత్రు దేశం పాకిస్తాన్ ఏజెంట్లుకు చేర వేసిందట. ఈ క్రమంలో పలు దేశాలను స్పెషల్ క్లాస్ విమానాల్లో పర్యటించింది. అమెరికా, చైనా పాకిస్థాన్ వంటి పలు దేశాల్లోని విలాసవంతమైన హెటళ్లలో ఉంటూ అక్కడ ఉన్న సీక్రెట్ స్థలాలు పర్యటించింది. ఆమె అందం, చురుకుదనం అన్నింటిని చూసి పాక్ సమాచార అధికారులు ఆమెను తమ ఏజెంటుగా వాడుకున్నారని పోలీసులు తెలిపా రు. ఆమె తెగువ తనం చివరికి ఆమెను ఏజెంటుగా చేసిందని కేసు దర్యాప్తులో ఉన్న ఎస్పి శశాంక్ కుమార్ సావన్ తెలిపారు.

ఆమెకు ఉన్నత స్థాయిలో కనెక్షన్లు లేవని, రహస్య సమాచారం తెలిపే సరైన వనరులు కానీ వ్యక్తుల పరిచయాలు కానీ లేనని పాక్ రహస్య గూఢవార సంస్థల అధికారులకు కూడా తెలుసు. అయితే ఆమెకున్న చొరవతో ఈ దిశలో ఆమెను తమ కీలక పాత్రధారిగా చేసుకోవచ్చునని నిర్ధారించుకుని ఆమెను రంగంలోకి దింపి నట్లు తెలిసింది. పాకిస్థానీ అధికారులను ఏ విధంగా కలిశారనేది కీలక విషయం అయింది. ఆ దిశగా పరిశోధన సాగుతోంది.

ఆపరేషన్ సిందూర్ తరువాత న్యూఢిల్లీలోని పాక్ హై కమిషనర్ కార్యాలయంలో ఆమె పాక్ అధికారి డానిష్ను కలిసింది. అంతకు ముందు ఆమె పలు సార్లు పాకిస్థాన్‌కు వెళ్లిరావడం, చివరికి పహల్గాం ఉగ్రదాడికి ముందు కూడా ఆమె అక్కడ ఓ అతిథి గృహంలో మకాం వేసి ఉండటం వంటి విషయాలను ఇప్పుడు మన ఇంటలిజెన్స్ వర్గాలు ఆరాతీస్తున్నాయి. ఆమెకు చెందిన పలు ఫోన్లు, యూట్యాబ్లు, ల్యాప్‌ట్యాప్‌లను స్వాధీనం చేసుకున్నారు. ఆ ఫోన్ లలో మారు పేర్లతో పాకిస్తాన్ రాయబార కార్యాలయం సిబ్బంది పేర్లు ఉన్నాయట. గత ఏడాది మార్చిలో ఆమె పాకిస్థాన్ కు వెళ్లి వచ్చింది. పైగా పర్యాటకం ముసుగులో ఓ వీడియో వెలువరించింది. అప్పట్లో ఆమె పాకిస్థాన్ పర్యటనలో భాగంగా తీసిన వీడియోలో ఆమె పాకిస్థాన్‌ను అదేపనిగా కొనియాడిందని భద్రతా అధికారులు గుర్తించారు. పాకిస్థాన్‌లో పర్యటించినప్పుడు. ఆమె 2023లో పది రోజుల పాటు పార్టీలు విందులు వినోదాలతో విలాసవంతంగా గడిపిందిట, అక్కడ ఆమె బస పర్యటనల బాధ్యతను అక్కడి కీలక వ్యక్తి అలీ ఆహవాన్ చూశారని వెల్లడైంది. దేశంలోని పలు ప్రాంతాలు ఢిల్లీ, కోల్‌కతా, హైదరాబాద్ లో కూడా ఆమె యూట్యూబర్‌గా పర్య టించినట్లు, కొందరు ప్రముఖులతో పరిచ యాలు పెంచుకున్నట్లు వెల్లడైంది.

దేశంలో ఇప్పటికీ దాదాపు డిజెన్‌కు పైగా రహస్య ఏజెంట్లు వివిధ ప్రాంతాలలో పట్టుబడ్డారు. పాకిస్థాన్‌కు కీలక సైనిక రహస్య సమాచారం చేరవేతల అభియోగాలతో ఇంటలిజెన్స్ వర్గాల నిఘాలో పట్టు బడ్డ వారిలో ట్రావెటర్ యూట్యూబర్ జ్యోతి, ఇతరులు అనేకులు ఇప్పటివరకూ అరెస్టు అయ్యారు. వారిపై ఇంటరాగేషన్ జరుగుతుంది. పాకిస్థాన్ ఇరుగు పొరుగు రాష్ట్రాలు పంజాబ్, హర్యానా, ఉత్తరప్రదేశ్ ప్రాంతాలకు చెందిన వారే ఈ పట్టుబడ్డవారిలో ఉన్నారని అధికారిక ప్రకటనలతో వెల్లడైంది. పహల్గాం ఉగ్రదాడి, తరువాత ఆపరేషన్ సిందూర్ లో భాగంగా ఇంటలిజెన్స్ వర్గాల నిఘాలో ఈ పాకిస్తాన్ ఏజెంట్లను అరెస్టు చేశారు. పంజాబ్ నుంచి ఆరుగురు, హర్యానా నుంచి ఐదుగురు, యుపి నుంచి ఒక్కరు ఇప్పటి వరకు పట్టుబడ్డారు. అన్వేషణ కొనసాగుతుంది. అనేక రహస్య సమాచారం వెల్లడి కావల్సి ఉంది.



**డాక్టర్ కోలాహలం రామ్ కిశోర్**
**9849328496.**

# పేరు అఖిలపక్షం-తీరు ఏకపక్షం!

పోల్చడం కాదు, కానీ జెస్ట్ ఐడియా కోసం..పీఏసీ చైర్మన్ పోస్టు ప్రతిపక్షానిది. మన వద్ద ప్రధాన విపక్షం బీఆర్ఎస్. ఆ పార్టీనే పేరు ఇవ్వాలి. సాంకేతికంగా గులాబీ ఎమ్మెల్యేనే అయినప్పటికీ ఆ పార్టీ ప్రమేయం లేకుండానే అరికెపూడి గాంధీని ప్రభుత్వం (అధికార కాంగ్రెస్) ఆ మధ్య నియమించింది. సేమ్ శశిథరూర్ ను కాంగ్రెస్ పార్టీని సంప్రదించకుండానే కేంద్ర ప్రభుత్వం (అధికార ఎన్డీయే-బీజేపీ) 33 దేశాలకు వెళ్లే 7 అఖిలపక్ష జట్టుల్లో ఒక బృందానికి సారథిగా సెలెక్ట్ చేసింది. మీ పార్టీ నుంచి మేమే డిసైడ్ చేస్తాం, మా పార్టీ నుంచి మేమే ఎంపిక చేస్తాం అన్నట్టుగా...

అంటే పేరు అఖిలపక్షం, తీరు ఏకపక్షం అన్నమాట. అపసవ్య పాకిస్థాన్ అంశంలో మోడీ నాయకత్వాన భారత ప్రభుత్వం విధాన నిర్ణయాలను దేశ క్షేమం కోసం కాంగ్రెస్ సహా అన్ని పార్టీలూ సమర్థించాయి. ఆల్ పార్టీ మీటింగులకు ప్రధానమంత్రి రాకున్నా ఆక్షేపణతోనే సరిపెట్టుకున్నాయి. ఆపరేషన్ సిందూర్ ను వేనోళ్ళ కొనియాడాయి. హఠాత్తుగా కాల్పుల విరమణ పల్లవి అందుకునే ముందు మాటమాత్రంగానైనా చెప్పకపోగా, ఒక అగ్రరాజ్యం చెప్పడం ఏంటని బాధపడ్డాయి. ఇటువంటప్పుడైనా విదేశాలకు పంపించే ప్రతినిధుల సెలెక్షన్ లో ఆయా పార్టీల స్వేచ్ఛలో వేలు పెట్టకుంటే కాస్తయినా బ్యాలెన్స్ గా ఉండేది. బీజేపీ ఆధిపత్య ధోరణిపై పెదవి విరుపులు తగ్గేవి. సమర్థుల పేరిట ఎదుటి పార్టీల్లోని సమర్థులను తామే గుర్తించడమూ సబబు కాదు. మరీ ముఖ్యంగా శశిథరూర్ విషయంలో కాంగ్రెస్ కు జీర్ణం కావడం లేదు. ఆ అపోజిషన్ 4 పేర్లు ఇవ్వగా, కేవలం ఆనంద్ శర్మనే ఆమోదించింది. అసలు ఆ లిస్టులో ఊసేలేని ఎంపీ శశిథరూర్ ను



మాత్రం భుజాన ఎత్తుకుంది. టీఎంసీ నుంచి యూసుఫ్ పఠాన్ జాబితాలో ఉండడమూ ఇలాంటిదే. తనకు సమాచారం లేకుండా ఎట్లా జరుగుతుందని మమతా బెనర్జీ ప్రశ్నించారు. ఈ అంశంలో కేంద్రం తీరును దీదీ ఓపికగా భరిస్తున్నారు.

### నిర్దేశిత అంశాలతో వాదనా, నివేదనా..

స్టేచర్ పరంగానూ శశిథరూర్ సమర్థులే. సందేహం లేదు. కానీ ఈ మాటున కాంగ్రెస్ మనసును కష్టపెట్టాల్సింది కాదు. ప్రజాస్వామ్య స్ఫూర్తి ఉండి, అహం లేకుంటే మాత్రం ముందే ఆ పార్టీని రిక్వెస్ట్ చేయాల్సింది. అమెరికా, పనామా, గయానా, బ్రెజిల్, కొలంబియా దేశాలను సందర్శించే జట్టును శశిథరూర్ లీడ్ చేస్తారు. శత్రు దేశం వైపు నుంచి పాకిస్థాన్ పీపుల్స్ పార్టీ చీఫ్ బిలావల్ భుట్టో జర్దారీ నేతృత్వం వహిస్తున్నాడు. సో, అమెరికాలో ఏ విధంగా చూసినా శశిథరూర్ సామర్థ్యం ముందు బిలావల్ దిగదుడుపే. ఈ మాట సాక్షాత్తూ ఆ దాయాది దేశంలోనే అంటున్నారు. ఉగ్ర మూలాల పాకిస్థాన్ పాపాలను వాణిజ్య, వ్యాపార తదితర అంశాల పరంగా ప్రాధాన్యం గల వివిధ దేశాల కళ్ళకు కట్టేందుకు మన పార్లమెంటు సభ్యులను అధికారికంగా కేంద్రం పంపిస్తోంది. ఈ నెల 23 నుంచి షురువయ్యే ఈ అంతర్జాతీయ పర్యటనల్లో రూలింగ్ ఎన్డీయే పక్షాన 31 మంది, ఇతర పార్టీల వారు 20 మంది ఎంపీలు సహా ఎనమండుగురు మాజీ దౌత్యవేత్తలు మొత్తం 59 మంది సభ్యులు ఉంటారు. సౌదీ అరేబియా, కువైట్, బహ్రెయిన్, అల్జీరియా కంట్రీలకు పోయే తొలి ప్రతినిధి బృందంలో మన హైదరాబాద్ ఎంపీ, ఏఐఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఓవైసీ ఉంటారు. భారత ప్రభుత్వం నిర్దేశించిన అంశాల మేరకు పాకిస్థాన్ చేష్టలను ఆయా అంతర్జాతీయ వేదికలకు వాదనా పటిమలతో నివేదిస్తారు. దౌత్య విజయమే లక్ష్యంగా వీరి ప్రపంచ విస్తృత పర్యటన ఉద్దేశం. మరోసారి ఎలాగూ ఏకాకి కాబోయే పాకిస్థాన్ కు పరివర్తన, జ్ఞానోదయం ఇప్పటికైనా కలుగాలన్నది ఈ ప్రయత్నాల సారం. మన దేశం లోపల రాజకీయాలు ఎలా ఉన్నా..

సరిహద్దులు దాటి దాటకముందే సమైక్యంగా భారతదేశ బహుళ శక్తి సామర్థ్యాలను, మంచితనాన్ని మన ఎంపీల ఏడు ప్రతినిధి బృందాలు నేరుగా ఆయా 33 దేశాల రాజధానుల పై నుంచి విశ్వానికి ప్రస్ఫుటం చేస్తారని గట్టిగా ఆశిద్దాము. ఎంతో ప్రాముఖ్యత గల వారి టూర్ సంపూర్ణంగా సఫలం కావాలని దృఢమైన ఆకాంక్ష.

**ఇల్లెందుల దుర్గాప్రసాద్**
సీనియర్ ఫ్రీలాన్స్ జర్నలిస్టు, హైదరాబాద్
**9440850384**

## మీలో ఎందరో

అనగనగా ఓ తల్లికోతి, దానికి ఓ పిల్లకోతిబి
తల్లికోతి
ఏ తోటలోనో దూరి ఏ చెట్టు మీదనో చేరి
పళ్ళు కాయలు తెచ్చి పిల్లకోతికి ఆహారంగా
ఇస్తుంది
ఆకలితో కన్పిస్తే తల్లడిల్లిపోయే తల్లికోతిబి
ఇలా రోజులు గడుస్తున్నాయి
పిల్లకోతికి ఇంకా నెలలేబి
ఒక రోజు తనతో వస్తానని మొండికేసింది
ఇద్దరూ కలిసి ఒక పార్కులో దూరారుబి
కాపలావాడు కనిపెట్టి కర్ర విసిరాడుబి
తప్పించుకొనే ప్రయత్నంలో గాయపడ్డది
పిల్లకోతి
కోతులు జీవించే హక్కును గౌరవించేవాళ్ళు
లేరాబి
చిన్న పెద్ద చూడరా?
ప్రకృతి మాది,పెత్తనం మీది
మేం కోతులం
నీతులు వల్లించే కోతులు మీలో ఎందరో!

**కోటం చంద్రశేఖర్**
**9492043348**




### శృతి మించుతున్న ట్రంప్ ప్రేలాపనలు

# మోడీ మౌనం

### ప్రజల్లో, విపక్షాలలో, మోడీ అభిమానుల్లో పెల్లుబుకుతున్న ఆగ్రహం

అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ దూకుడుకు కళ్లెం వేయడంలో మన భారత ప్రధానమంత్రి నరేంద్ర మోడీ దారుణంగా విఫలమయ్యారు. పాతికేండ్ల క్రితం కాశ్మీర్ పైన అభ్యంతరకరమైన, అనుచిత వ్యాఖ్యలు చేసిన అప్పటి అమెరికా అధ్యక్షుడు బిల్ క్లింటన్ ను నాటి భారత రాష్ట్రపతి కే.ఆర్. నారాయణన్ దీటుగా ఎదుర్కొన్నారు. నాటి పరిణామం నుండి మోడీ ఏవైనా పాఠాలు నేర్చుకున్నారా అంటే ? నూటికి నూరు పాళ్ళు లేదనే చెప్పాల్సి ఉంటుంది.

అది 2000వ సంవత్సరం మార్చి 21వ తేదీ, రాష్ట్రపతి భవన్ లో అమెరికా అధ్యక్షుడు క్లింటన్ గౌరవార్థం ప్రథమ పౌరుడు కేఆర్ నారాయణన్ విందు ఇచ్చారు. కాశ్మీర్‌ను అణుబాంబుల కేంద్రంగా, అత్యంత ప్రమాద కరమైన ప్రదేశంగా క్లింటన్ అంతకుముందు చేసిన వ్యాఖ్యలపై విందులో రాష్ట్రపతి తీవ్రంగా స్పందించారు. భారత పర్యటనకు వచ్చే ముందు కాశ్మీర్ పై క్లింటన్ అనుచిత వ్యాఖ్యలు చేశారు. ప్రజలలో భయాన్ని, ఆందోళనను రేకెత్తించే ఆ వ్యాఖ్యలను నారాయణన్ ప్రస్తావిస్తూ శాంతిని విచ్ఛిన్నం చేయాలని అనుకునే వారిని, ఉగ్రవాదం, హింసలో మునిగి తేలాలని అనుకునే వారిని ప్రోత్సహించడానికి మాత్రమే అవి ఉపకరిస్తాయని ఎత్తిపొడిచారు. "అణ్వాయుధాలను ముందుగా ఉపయోగిస్తామని చెప్పింది మేము కాదు. కాబట్టి ప్రమాదం మా వైపు నుండి జరగదు. అలాంటి నిబద్ధత ప్రదర్శించడానికి నిరాకరించే వారి నుండి అలాంటి ప్రమాదం వస్తుంది" అని దౌత్య భాషలో మర్యాదగా, వ్యంగ్యంగా నొక్కి చెప్పారు. క్లింటన్‌పై నారాయణన్ చేసిన వ్యాఖ్యలను అమెరికా పత్రికలు ప్రముఖంగా ప్రస్తావించాయి.

'క్లింటన్‌ను మందలించిన నారాయణన్' అనే శీర్షికతో వాషింగ్టన్ టైమ్స్ ఓ వార్తను ప్రచురించింది. కాశ్మీర్ గురించి క్లింటన్ చేసిన వర్ణనలను భారత రాష్ట్రపతి ఎగతాళి చేశారని తెలిపింది.

### భారత్‌పై ట్రంప్ అవాకులు.. చవాకులు

వర్తమానంలోకి వస్తే. ఆపరేషన్ సిందూర్ మొదలైన మూడు రోజుల తర్వాత అంటే ఈ నెల 10వ తేదీన అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ భారత్, పాకిస్తాన్ కంటే ముందుగానే కాల్పుల విరమణ ప్రకటన చేశారు. ఇలా ఎందుకు చేశారని ఆయనను అటు మన భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము కానీ, ఇటు ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ కానీ నిలదీసిన పాపాన పోలేదు. చారిత్రకంగా శాంతికాముఖ దేశం భారత దేశం. పాకిస్తాన్ పుట్టుకతోనే ఉగ్రవాద దేశం. అలాంటప్పుడు ట్రంప్ ఈ రెండు దేశాలనూ కలిపి ఒకే గాటన కట్టడం ఏంటి? ట్రంప్ ప్రకటన భారత దేశ ప్రజలను దిగ్భ్రాంతికి గురి చేసింది. ఉగ్రవాదానికి మూలంగా ఉన్న పాకిస్తాన్‌ను అన్ని రంగాలలో ఆ దేశం కంటే ఎంతో ముందున్న భారత్‌ను అమెరికా అధ్యక్షుడు ఒకేలా చూడడం దురదృష్టకరం. గర్హనీయం. దీన్ని ఖండించే దుమ్ము, ధైర్యం మన ప్రధాన మంత్రి మోడీకి లేకపోయింది.

యుద్ధ విరమణకు రెండు దేశాలు అంగీకరించాయని విదేశాంగ కార్యదర్శి మిస్త్రి చెప్పడానికి ముందే ట్రంప్ దానిపై ప్రకటన చేసేశారు. కాల్పుల విరమణకు అమెరికా మధ్యవర్తిత్వం వహించిందని, కాశ్మీర్ సమస్యకు పరిష్కారం కనుగొనడానికి రెండు దేశాలతో కలిసి పనిచేస్తానని కూడా ట్రంప్ చెప్పారు. అమెరికా విదేశాంగ మంత్రి, తాత్కాలిక జాతీయ భద్రతా సలహాదారు మార్కో రుబియో మరో అడుగు ముందుకు వేసి తటస్థ దేశంలో చర్చల ప్రారంభానికి భారత్, పాక్ అంగీకరించాయని కూడా తెలిపారు. ఈ ప్రకటన వెలువడిన వెంటనే మన ప్రధాన మంత్రి రంగంలోకి దిగి మార్కో రుబియో ప్రకటనను, ట్రంప్ ప్రకటనను గట్టిగా ఖండించి ఉంటే మన దేశం గౌరవం నిలబడి ఉండేది. మన మోడీకి ఉన్న లక్షణం "అనవసర సమయంలో విస్తారించి ఎక్కువ మాట్లాడటం, అవసరమైన కీలక సమయంలో గప్‌చిప్‌గా మౌనంగా ఉండటం." మోడీ మౌనం భారత దేశ పౌరులను దిగ్భ్రాంతికి గురి చేసింది. ఇది భారత ప్రజలకు తీరని అవమానకరం.

కాల్పుల విరమణపై ట్రంప్ చేసిన ప్రకటనను ప్రధాని మోడీ తిప్పికొట్టలేదు. కాగా మన ప్రధాని మోడీ సమక్షంలో... ట్రంప్ ప్రభుత్వం వందలాది మంది భారతీయ వలసదారులను చేతులు, కాళ్లు, కట్టేసి సైనిక విమానాలలో అవమానకరంగా తిప్పి పంపినప్పుడు కూడా ఆయన ట్రంప్‌ను ధిక్కరించి మాట్లాడలేదు. భారత దేశంతో పోలిస్తే అతి చిన్న దేశం ఉక్రెయిన్ నేత జలెనస్కీ మాత్రం అమెరికా అధ్యక్షుడు ట్రాంప్‌ను ప్రపంచ మీడియా ముందు తన దేశ అవసరాలకోసం ఘాటుగా ధిక్కరించి మాట్లాడారు. మన ప్రధాన మంత్రి మోడీ ట్రంప్ సమక్షంలో కనీసం కిమ్మన లేదు.

ట్రంప్ భారత -పాకిస్తాన్ యుద్ధం మధ్యలో జోక్యం చేసుకొని ఇరు దేశాలు నా బెదిరింపులకు లొంగి కాల్పుల విరమణకు అంగీకరించాయి అని ప్రకటన చేయటం మన దేశ సార్వభౌమాధికారానికి తీరని అవమానకరం. ఇదే విషయాన్ని రాజకీయ నిపుణులు మీడియా ముందు వ్యాఖ్యానించారు. దేశ భద్రతకు ప్రమాదం వాటిల్లినప్పుడు మనం ఏం చేయాలో కూడా అమెరికాయే నిర్ణయించడం దేశానికి తీవ్ర ఇబ్బందిని, అవమానాన్ని కలిగిస్తోంది. ఈ నేపథ్యంలో.... నాడు కాశ్మీర్ పై క్లింటన్ చేసిన వ్యాఖ్యలు, రాష్ట్రపతి కేఆర్ నారాయణన్ వాటిని దీటుగా తిప్పికొట్టిన తీరును ఇక్కడ ప్రస్తావించడం. ఎంతైనా సముచితం.

పాకిస్తాన్ ఉగ్రవాదాన్ని ట్రంప్ గట్టిగా ఖండించిన దాఖలాలు కూడా లేవు. పాకిస్తాన్ భూభాగం నుండి కార్యకలాపాలు సాగిస్తున్న ముష్కరులు సీమాంతర ఉగ్రవాదానికి ఎలా పాల్పడుతున్నారో, దానివల్ల భారత్ ఎంతగా నష్టపోతోందో ఆయన ఎన్నడూ ఎవరికీ చెప్పలేదు. ట్రంప్ వ్యాఖ్యలలో స్పష్టంగా కన్పిస్తున్న ఈ లోపాన్ని భారత రాష్ట్రపతి కానీ, ప్రధాన మంత్రి మోడీ కానీ వేలెత్తి చూపించ లేదు. పాతిక సంవత్సరాల క్రితం కాశ్మీర్ పై క్లింటన్ చేసిన ప్రకటనను రాష్ట్రపతి నారాయణన్ ఖండించిన తీరుకు ఇది పూర్తి భిన్నంగా ఉంది. కాశ్మీర్ ద్వైపాక్షిక సమస్య అని విదేశాంగ శాఖ ప్రతినిధి చెబుతున్నారే కానీ ట్రంప్ ను ఎదుర్కోవడానికి మోడీ ఏ మాత్రం ధైర్యం ప్రదర్శించడం లేదని మాజీ రాష్ట్రపతి కేఆర్ నారాయణన్ వద్ద ఓ ఎస్టీ గా పనిచేసిన ఎస్ఎన్ సాహూ చెప్పారు.

మోడీ ఏమి చేసినా, ఏం మాట్లాడినా గుడ్డిగా సమర్థించే గోదీ మీడియా, ఆరెస్సెస్ , భజరంగ్ దళ్ సైతం మోడీ మౌనం తో ఖంగుతిన్నాయి. పాకిస్తాన్ పై ఈజీగా గెలిచే సత్తా ఉన్న మనం యుద్ధాన్ని సడెన్ గా ఆపేస్తుందని అది కూడా మోడీ ప్రకటించడాన్ని జీర్ణించుకోలేక పోయాయి. ఇప్పటికీ సోషల్ మీడియా ముందు భారత యువత మోడీ యుద్ధ విరమణ ప్రకటనను అది కూడా ట్రంప్ చేయటాన్ని సహించలేక తమ ఆగ్రహాన్ని వ్యక్తం చేస్తున్నారు.

**డాక్టర్ కోలాహలం రామ్ కిశోర్.**
**9849328496.**

# 'సైద్ధాంతిక స్పష్టత' వామపక్షాలకు గీటురాయి



*వర్గ పోరాట సంఘర్షణ నేపథ్యంగా కొనసాగుతున్న ఆయా కమ్యూనిస్ట్ పార్టీలలో నేడు సైద్ధాంతిక స్పష్టతలు లోపిస్తూనే ఉన్నాయి. తత్ఫలితంగా ఆయా కమ్యూనిస్ట్ పార్టీలలో అనేక దుందుకుడు ధోరణులు చాలా ప్రస్ఫుటంగా పొడచూపుతూన్టే ఉన్నాయి అని చెప్పడంలో ఏమాత్రం సందేహం లేదు. కమ్యూనిస్ట్ పార్టీలలో అనేక చీలికలు - పేలికలే వాటికి నిదర్శనంగా నిలుస్తున్నాయి అని నిర్దిష్టంగా చెప్పవచ్చు. అందువలన ఆయా కమ్యూనిస్ట్ పార్టీలు సైద్ధాంతిక స్పష్టతాలకు తప్పనిసరిగా పెద్దపీట వేసి తమ లక్ష్యాలకు అనుగుణంగా ఉద్యమించాల్సిన అవసరం తప్పకుండా ఉంది.*

సోవియట్ యూనియన్ లోనూ మరియు తూర్పు యూరప్ లోనూ సోషలిజం పతనం చెందిననూ నేటికిని అనేక దేశాలలో సోషలిజం స్ఫూర్తి సజీవంగా కొనసాగుతూనే ఉంది. లాటిన్ అమెరికా దేశాలలో ఆయా కమ్యూనిస్ట్ పార్టీలు సైద్ధాంతిక స్పష్టత విషయంలో పూర్తి స్పష్టతను కలిగి ఆ దిశగా గమనం సాగిస్తూ ఉండడమే కాకుండా విజయపథంలో అప్రతిహతంగా దూసుకుపోతూనే ఉండడాన్ని ప్రత్యేకంగా గమనించవచ్చు. కాని కొన్ని దేశాలలోని ఆయా కమ్యూనిస్ట్ పార్టీలలో సైద్ధాంతిక స్పష్టతలు కొరవడినట్లుగా స్పష్టంగా వెల్లడవుతూనే ఉంది.

భారతదేశం లోని అనేక కమ్యూనిస్ట్ పార్టీలు సైద్ధాంతిక స్పష్టత విషయంలో వెనకడుగు వేస్తున్నట్లుగానే కనిపిస్తుంది అని నిర్దిష్టంగా చెప్పవచ్చు. కమ్యూనిస్ట్ పార్టీలు అనేక చీలికలకు గురికావడం సమసమాజ స్థాపనకు గుదిబండగా మారాయి అని చెప్పడంలో ఏమాత్రం సందేహం లేదు. 'ప్రపంచ కార్మికుల్లారా ఏకం కండి. పోరాడితే పోయేదేమీ లేదు' అని గొంతు చించుకునే కమ్యూనిస్టులు తాము మాత్రం చీలికలు - పేలికలుగా విడిపోవడం భారత కమ్యూనిస్ట్ ఉద్యమంలో అత్యంత విషాదకరంగా నిలుస్తుంది అని చెప్పవచ్చు. అదే కమ్యూనిస్టులు మళ్ళీ 'వామపక్షాల ఐక్యత వర్ధిల్లాలి' అనే గొంతు చించుకుంటూ ఆ దిశగా కనీసం అడుగులు కూడా వేయకుండా కేవలం పత్రికా ప్రకటనలకు మాత్రమే పరిమితం కావడం కమ్యూనిస్టుల తిరోగమనాన్ని వెల్లడిస్తుంది అని చాలా స్పష్టంగా చెప్పకనే చెప్పవచ్చు. ఈ మధ్య కాలంలో కొన్ని కమ్యూనిస్ట్ పార్టీలు చీలిపోవడం, అదే విధంగా మళ్ళీ ఐక్యం కావడం అనే అపసవ్య ధోరణులు పరిపాటిగా మారుతుండటం విచారకరం. అందువలన ఆయా కమ్యూనిస్ట్ పార్టీలలో స్పష్టమైన సైద్ధాంతిక స్పష్టతలు కొరవడటం మూలంగానే ఇలాంటి విపత్కర ధోరణులు సంభవిస్తున్నాయి అని చెప్పడంలో ఏమాత్రం సందేహం లేదు.

కమ్యూనిస్ట్ పార్టీలు సైద్ధాంతిక స్పష్టతని విస్మరించి ఎన్నికలలో బూర్జువా పార్టీలతో అవకాశవాద ఎత్తులు - పొత్తులు కొనసాగించడం మూలంగా సొంత క్యాడర్ సైతం వ్యతిరేకతని ప్రదర్శిస్తుండడాన్ని అనేక సందర్భాలలో చాలా స్పష్టంగా గమనించవచ్చు. భారతదేశంలో కమ్యూనిస్ట్ ఏర్పడి వంద వసంతాలు కావస్తున్ననూ క్రమంగా శ్రామిక వర్గానికి దూరమవుతూనే ఉంది. అంతిమంగా జాతీయ హోదాని సైతం కోల్పోయి ప్రజా విశ్వాసానికి దూరం కావడం దరిమిలా నేటికిని అధికారానికి చేరుకోలేకపోవడం పెను విషాదకరం. కమ్యూనిస్ట్ పార్టీలో అసంఖ్యాక చీలికలు కూడా అధికారానికి ఆమడ దూరాన ఉంచుతున్నాయి అని అర్థం చేసుకోవచ్చు. కమ్యూనిస్ట్ పార్టీలలో చీలికల మూలంగా కమ్యూనిస్ట్ వ్యతిరేక పార్టీలు సులువుగా అధికారంలోకి రావడానికి పరోక్షంగా దోహదపడుతున్నాయి అని నిర్దిష్టంగా చెప్పవచ్చు.

నేపాల్ కమ్యూనిస్ట్ పార్టీలలో కూడా సైద్ధాంతిక స్పష్టత కొట్టొచ్చినట్లుగానే కనిపిస్తుంది అని భావించవచ్చు. ఈ తరుణంలోనే వామపక్షాలు సైద్ధాంతిక స్పష్టతతో కొనసాగలేకపోతే తత్ఫలితంగా ప్రతికూలమైన ఫలితాలు సంభవిస్తాయి' అని నేపాల్ ప్రధాన మంత్రి కె.పి.శర్మ ఓ ఇటీవల ప్రస్తావించడం విశిష్ట ప్రాధాన్యాన్ని సంతరించుకుంది. 'వాస్తవికమైన సైద్ధాంతిక వైరుధ్యాలకు బదులుగా వ్యక్తిగతమైన పట్టుదలల వలన కమ్యూనిస్ట్ పార్టీలకు తీవ్ర నష్టం జరుగుతూనే ఉంది. ఖచ్చితమైన సరైన విషయాలను వ్యతిరేకించే పెడధోరణి నేపాల్ కమ్యూనిస్ట్ ఉద్యమంలోనూ ఉంది. వ్యక్తిగతమైన ప్రయోజనాల నిమిత్తం కొందరు కావాలని విభజన రేఖలను సృష్టించారు' అని ఆయన ఆవేదనని వ్యక్తం చేయడాన్ని ఈ సందర్భంగా ప్రత్యేకంగా గమనించవచ్చు.

ఈ పరంపరలోనే ముఖ్యంగా 'సైద్ధాంతిక స్పష్టత లేకపోతే కమ్యూనిస్ట్ ఉద్యమానికి తీవ్ర హాని జరుగుతుంది అనేది వాస్తవం. అందువలన సైద్ధాంతిక పునాదులు చాలా గట్టిగా ఉండాలి. అంత బలమైన పునాదులు ఉన్న సైద్ధాంతిక ఆలోచనలనే ఇచ్చి పుచ్చుకోవాలి. లేకపోతే కమ్యూనిస్ట్ ఉద్యమానికి తీవ్రమైన హాని మాత్రమే కాకుండా ప్రతికూలమైన ఫలితాలు సైతం సంభవిస్తాయి. సరైన సైద్ధాంతిక అవగాహన లేకుండా మరియు దిశా నిర్దేశం లేకుండా అనేక అపసవ్య దిశలలో పయనిస్తూ ఆలోచనలను విస్తరించుకోవడం అనేది ఏమాత్రం సహేతుకం కాదు. ఈ విధంగా దిశారహిత గమనంగా ముందుకు సాగడం పూర్తిగా అర్థరహితం. అలాగే కమ్యూనిస్ట్ ఉద్యమంలో ఒనగూడుతున్న మొండి పట్టుదల ధోరణులను విడనాడాల్సిన అవసరం తప్పకుండా ఉంది' అని నేపాల్ ప్రధానమంత్రి కె.పి.శర్మ ఓలి ప్రముఖంగా ప్రస్తావించడాన్ని బట్టి కమ్యూనిస్ట్ పార్టీలు సైద్ధాంతిక స్పష్టతకి పెద్దపీట వేయాల్సిన అవసరాన్ని నొక్కి చెప్తుంది అని చాలా స్పష్టంగా గమనించవచ్చు. ఆయన వ్యాఖ్యలు కమ్యూనిస్ట్ పార్టీల పురోగమనానికి ఎంతగానో దోహదపడతాయి అని విస్పష్టంగా చెప్పవచ్చు. ఆ క్రమంలోనే 'బహుళ పార్టీ ప్రజాస్వామ్య వ్యవస్థ' అనే భావనని ఆయన చాలా బలంగా సమర్థించడాన్ని సైతం చాలా స్పష్టంగా గమనించవచ్చు. అంతిమంగా మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా ఆయా కమ్యూనిస్ట్ పార్టీలు తమ వర్గ విభేదాలకు అతీతంగా 'సైద్ధాంతిక స్పష్టత' గీటురాయిగా ప్రాధాన్యం ఇస్తూ సమసమాజ స్థాపన లక్ష్యంగా పురోగమించాల్సిన అవసరం తప్పకుండా ఉంది.



**జె.జె.సి.పి.బాబూరావు**
రీసెర్చ్ స్కాలర్
సెల్: 94933 19690

## ధాన్య రాశి.!!



ధాన్యం రాశి విలవిలబోయింది
కుప్పకొచ్చిన గింజ నలిగిపోతుంటే
రేటు రాని కాలాన్ని పట్టుకుని
వెక్కిళ్లు పెట్టి అంగలార్చింది
తడిసిపోయి తంటాలు పడుతుంటే
తల తిప్పి చూడని తీరును చూసి
లోలోపల కుమిలిపోయింది

రైతు ముఖంలో ఆందోళన
నానాటికీ పెరిగిపోతూ కనిపిస్తుంటే
దుక్కి దున్నే నాగలి
కన్నీటి పర్యంతమై రగిలిపోయింది
చేతికొచ్చిన పంట నోటికి రాకపోయేసరికి
పంట చేలు పడి పడి ఏడ్చింది
వేసిన సత్తువ కాలువ పాలు అవుతుంటే
నేలతల్లి తల దించుకుని బాధ పడింది

కూలీ నాలి పోను
కూసింతైనా చేతికి అందని ఫలాన్ని చూసి
గోరు చుట్టు పైన రోకలిపోటైంది
మన్ను మీదేసుకున్న కష్టానికి
వెన్ను విరిగిన రేటును చూసినాక
ముద్ద నోటి కాడికి రాకుండా పోయింది

సద్దుమనిగిన రైతు బ్రతుకులో
పొద్దు పొడవకుండానే పోయింది

గింజల్ని విదిలించిన కంకి
పగలబడి నవ్వుతూ వుంటే
ధాన్య రాశి తల దించుకుని కూర్చుంది
గిట్టుబాటు ధర కరువైన పంట
నష్టం ఊబిలో కూరుకుపోతుంటే
రైతు జీవనంలో వెలుగు మాయమైంది
ధాన్యం విలవిలలాడింది

**- నరెద్దుల రాజారెడ్డి**
**సెల్ : 9666016636**

## కేంద్ర ప్రభుత్వ కార్పొరేట్ విధానాలకు వ్యతిరేకంగా పోరాడాలి

- సిఐటియు మండల కన్వీనర్ బాలా గౌడ్



**వీపనగండ్ల, మే 21 (జనం సాక్షి) :** సిఐటియు, రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో వీపనగండ్ల మండల కేంద్రంలో రోడ్డుపై కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు మండల కన్వీనర్ బాలగౌడ్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్మికుల హక్కులను కాలరాస్తుందని, నాలుగు లేబర్ చట్టాలు తీసుకొచ్చి కార్మికుల కనీస హక్కులు లేకుండా చేస్తుందన్నారు అని విమర్శించారు. కనీస వేతనాలు నెలకు 21,000 వేలు ఇవ్వాలని, కాంటాక్ట్ ఔట్సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని, అసంఘటిత రంగ కార్మికులకు హెల్పర్ బోర్డు ఏర్పాటు చేసి సంక్షేమ పథకాల అమలు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నూతన మార్కెట్ చట్టాన్ని ఉపసహరించుకోవాలని, సీటు ప్లస్ 50% ప్రకారం మద్దతు ధరల చట్టం చేయాలని ,రైతు రుణాలు రద్దు చేయాలని, కౌలు రైతులకు రుణ సమగ్ర చట్టం చేయాలన్నారు. వ్యవసాయ కార్మికులకు 200 రోజుల పని దినాలు కల్పించాలని, ఉపాధిహామీ కార్మికులకు రోజుకు 600 రూపాయలకు ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో సిఐటియు మండల కో కన్వీనర్ ఆశన్న, బాలకృష్ణ చారి, ప్రజా సంఘాల నాయకులు సిహెచ్. వెంకటయ్య, మిద్దె శ్రీనివాసులు, సుగుణ భాయ్, రాణి, లక్ష్మి, సువర్ణ పాల్గొన్నారు.

## ఉత్తమ విద్యార్థులుగా తీర్చిదిద్దాలి

- ఎంఈఓ బుచ్చా నాయక్



**శివ్వంపేట, మే 20 (జనంసాక్షి) :** ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల ప్రవేశాలు, విద్యార్థులకు సంపూర్ణ గుణాత్మక విద్యను అందించేందుకు ప్రతి ఒక్క ఉపాధ్యాయుడు సంసిద్ధం కావాలని ఎంఈఓ బుచ్చా నాయక్ పేర్కొన్నారు. వేసవి సెలవులలో ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులకు ఐదు రోజుల వృత్యంతర శిక్షణా కార్యక్రమం లో భాగంగా మండల పరిధిలోని చిన్న గొట్టిముక్ల జిల్లా పరిషత్ ఉన్నంత పాఠశాలలో మండల విద్యాశాఖ ఆధ్వర్యంలో మంగళవారం మండల ఎస్జీటీ ఉపాధ్యాయులకు శిక్షణా కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ పాఠశాలలోని విద్యార్థులు అందరూ కనీస సామర్థ్యాలు సాధించి వచ్చే విద్యా సంవత్సరంలో ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల ప్రవేశాలు సంపూర్ణంగా చేసి, వారికి గుణాత్మక విద్యా అందిచ్చేలా ప్రతి ఒక్క ఉపాధ్యాయుడు చిత్తశుద్ధితో కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల రిసోర్స్ పర్సన్లు సురేష్, రామకృష్ణ, సత్యం, నర్సాగౌడ్, రాంచంద్రారెడ్డి, బాబా, అరుణ, రాజేంద్ర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## మల్బరీ సాగుకు అవసరమైన చర్యలు తీసుకోవాలి

- కలెక్టర్ సందీప్ కుమార్ ఝా
- కోళ్లమద్దిలో పట్టుపురుగుల కేంద్రం పరిశీలన



**గంభీరావుపేట, మే 20 (జనం సాక్షి) :** మల్బరీ సాగుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ఉద్యానవన శాఖ అధికారులను కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆదేశించారు. గంభీరావుపేట మండలం కోళ్లమద్ది గ్రామంలోని పట్టు పురుగుల పెంపకం కేంద్రంలోని ఆవరణ, మొక్కలు, బిల్డింగ్ మొత్తం మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా మాట్లాడారు. కోళ్లమద్ది గ్రామంలోని పట్టు పురుగుల పెంపకం కేంద్రం వినియోగంలోకి వచ్చేందుకు అన్ని చర్యలు తీసుకోవాలని, ప్రభుత్వ భూమి మరియు చెట్లు అన్యాక్రానంతం కాకుండా చూడాలని సూచించారు. ముందుగా నీటి సౌకర్యం కోసం బోర్ వేయించాలని పేర్కొన్నారు. పట్టు పురుగుల పెంపకం కోసం సన్నద్ధం కావాలని, రైతులకు ఉపయోగపడేలా ప్రణాళిక ప్రకారం ముందుకు వెళ్లాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉద్యానవన అధికారి లత, అధికారులు లోకేష్, జగన్, సత్యం తదితరులు పాల్గొన్నారు.

# లారీని ఢీకొన్న టూరిస్ట్ బస్సు

- నలుగురు మృతి
- బీజాపూర్ హైవే రంగాపూర్ వద్ద ఘటన
- 26 మందికి గాయాలు పదిమంది పరిస్థితి విషమం
- మెరుగైన వైద్యం కోసం వివిధ ఆసుపత్రులకు తరలింపు
- ప్రమాదంపై దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన స్పీకర్ సీఎం చేవెళ్ల పరిగి ఎమ్మెల్యేలు
- క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని ఆదేశం
- సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న పరిగి పోలీసులు











**వికారాబాద్ జిల్లా బ్యూరో, మే 20 (జనం సాక్షి) :** పెండ్లి వారి ఇంట్లో సందడి సంతోషం ఎంతోసేపు నిలవలేదు. మృత్యువు రోడ్డు ప్రమాదం రూపంలో వారిని కబళించి వేసింది. బంధువులంతా వివాహ విందు ముగించుకొని తిరుగు ప్రయాణంలో ఈ దుర్ఘటన జరిగింది . వికారాబాద్ జిల్లా పరిగి మండలం రంగాపూర్ వద్ద ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. సోమవారం అర్ధరాత్రి రంగాపూర్ వద్ద ఆగి ఉన్న లారీని పెండ్లి టూరిస్టు బస్సు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో నలుగురు అక్కడికక్కడే మృతి చెందారు. వీరంతా రంగారెడ్డి జిల్లా షాబాద్ మండలం చందన వెల్లి గ్రామానికి చెందినవారుగా పోలీసులు గుర్తించారు. వీరంతా వివాహ విందు ముగించుకొని తిరుగు ప్రయాణంలో స్వగ్రామానికి బయలుదేరి వెళుతుండగా మార్గమధ్యంలో ఈ సంఘటన జరిగింది. ఈ దుర్ఘటనలో షాబాద్ మండలం సీతారాంపూర్ గ్రామానికి చెందిన మంగలి మల్లేష్(35) సోలిపేట కు చెందిన బాలమ్మ(60) చేవెళ్ల మండలం రావులపల్లికి చెందిన హేమలత(32) ఫరూక్నగర్ మండలం రేగన్ నగర్‌కు చెందిన సందీప్(28) ఈ దుర్ఘటనలో మృతి చెందారు. మరో 26 మంది తీవ్రంగా గాయపడ్డారు. వారిలో పది మంది పరిస్థితి విషమంగా ఉంది. పెండ్లి బంధువుల ద్వారా సమాచారం అందుకున్న పరిగి పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. క్షతగాత్రులను పరిగి దవాఖానకు తరలించారు. ప్రథమచికిత్స అనంతరం వారికి మెరుగైన వైద్యం కోసం వికారాబాద్ జిల్లా దవాఖానకు తరలించారు. పలువురిని హైదరాబాద్ ఉస్మానియా హాస్పిటల్‌కు రెఫర్ చేశారు. బాధితులంతా సోమవారం రాత్రి పరిగిలో జరిగిన వివాహ రిసెప్షన్ వేడుకకు హాజరై తిరిగి వెళ్తున్నారు. ఈ క్రమంలో రంగాపూర్ వద్ద ఆగిఉన్న లారీని బస్సు ఢీకొట్టింది. మృతుల్లో ఇద్దరు మహిళలు, ఇద్దరు పురుషులు ఉన్నారని పోలీసులు తెలిపారు. ఈ సంఘటనలో పలువురికి కాళ్లు, చేతులు విరిగినట్లు పోయాయి. ఈ ఘటనపై కేసు నమోదుచేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. పోస్టుమార్టం నిమిత్తం శవాలను పరిగి ఆసుపత్రికి తరలించారు. పోస్టుమార్టం అనంతరం శవాలను బంధువులకు అప్పగించారు.

### స్పీకర్ సీఎం ఎమ్మెల్యేల దిగ్భ్రాంతి

కాగా ఈ సంఘటనపై తెలంగాణ రాష్ట్ర శాసనసభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. రోడ్డు ప్రమాదంలో మృతి చెంది తీవ్రంగా గాయపడిన పెండ్లి వారి బంధువులకు సానుభూతి తెలియజేశారు. జరిగిన సంఘటనపై విచారణకు ఆదేశించారు. ప్రమాదంలో గాయపడిన క్షేత్రగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని అధికారులను ఆదేశించారు. అంత్యక్రియల కోసం మృతి చెందిన వారి కుటుంబ సభ్యులకు చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య ఆర్థిక సహాయాన్ని అందజేశారు. శుభకార్యం జరిగిన ఇంట్లో అశుభకార్యం జరగడంతో చందనవెల్లిలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

## టీడబ్ల్యూజెఎఫ్ రాజేంద్రనగర్ నూతన కమిటీ ఎన్నిక



**శంషాబాద్, మే 20 (జనంసాక్షి) :** రంగారెడ్డి జిల్లా టి డబ్ల్యు జె ఎఫ్ అధ్యక్ష కార్యదర్శులు ఎం. సత్యనారాయణ ఎం. సైదులు జర్నలిస్టులందరూ ఐక్యంగా పోరాడి హక్కులు సాధించుకోవాలన్నారు. శంషాబాద్ లోని ఫంక్షన్ హాల్‌లో మంగళవారం తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష కార్యదర్శులతో పాటు జిల్లా యూనియన్ సీనియర్ నాయకులు గణేష్ , సురేష్ కుమార్, చంద్రశేఖర్ పాల్గొన్నారు. ఈనెల 12 వ తేదీన మరణించిన ఐఎఫ్ డబ్ల్యూజే జాతీయ అధ్యక్షులు విక్రమ్ రావుకు నివాళులు అర్పించారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అధ్యక్ష కార్యదర్శులు సత్యనారాయణ, సైదులు మాట్లాడుతూ గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంలో కూడా జర్నలిస్టుల పరిస్థితి ఏమీ మారలేదన్నారు. పోరాడి సాధించుకున్న తెలంగాణలో జర్నలిస్టుల పరిస్థితి దినదిన గండంగా మారిందన్నారు. హక్కులు సాదించుకోవడం కోసం యూనియన్ ఆధ్వర్యంలో జర్నలిస్టులు ఐక్యంగా పోరాడాలని సూచించారు. సీనియర్ నాయకులు గణేష్ , సురేష్, చంద్రశేఖర్ మాట్లాడుతూ తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ మరింత బలోపేతంగా ఎదగడానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. కొత్తగా ఎన్నికైన కమిటీ నిబద్ధత అంకితభావంతో జర్నలిస్టుల సమస్యల పరిష్కారం కోసం పనిచేయాలన్నారు. మాజీ అధ్యక్షులు సుదర్శన్ గౌడ్ మాట్లాడుతూ యూనియన్ నిర్మాణంలో అందరూ భాగస్వాములు కావాలన్నారు. సమస్యల సాధన కోసం కార్యచరణ తో ముందుకు వెళ్లాలి. అక్రిడిడేషన్ కార్డులు, హెల్త్ కార్డులు, విద్యలో రాయితీ, ఇళ్ల స్థలాలు సాధించడం కోసం పోరాటాలు తప్పనిసరిగా ఎంచుకోవాలన్నారు. ఉద్యమ బాట మన పందాగా భావించాలన్నారు. జిల్లా నూతన కమిటీ సభ్యులుగా బి. దేవేందర్, కే. సుదర్శన్ గౌడ్, ఎం. శ్రీనివాస్ ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో షాద్నగర్ యూనియన్ నాయకులు నర్సింహా రెడ్డి , సీనియర్ జర్నలిస్టులు పి. విక్రమ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ రాష్ట్ర అవతరణ ఉత్సవాలను ఘనంగా జరపాలి




**నారాయణపేట జిల్లా బ్యూరో, మే 20 (జనం సాక్షి) :** తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవం జూన్ రెండున ఘనంగా నిర్వహిం చేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ సిక్త పట్నాయక్ ఆదేశించారు.మంగళవారం జిల్లా కలెక్టరేట్ మీటింగ్ హాల్లో రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకల సంబంధించి సమావేశం ఎస్పీ యోగేష్ గౌతంతో కలిసి సమీక్షించారు. జూన్ 2న జరిగే అవత రణ దినోత్సవ వేడుకలకు అన్ని ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. తహసీల్దార్, మున్సిపల్ కమీషనర్ వారు ఏర్పాట్లను పర్యవేక్షించాలని సిపిఓ స్పీచ్‌కు సంబంధించిన వాటిని చూడాలన్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు డీఈవో ఆధ్వ ర్యంలో నిర్వహించాలని మైక్ ఇతర సదుపాయాలు డిపిఆర్ఓ నిర్వహించాలన్నారు. డిఎంహెచ్ఓ వైద్య సదుపాయాలు కల్పించాల న్నారు.ఫైర్ ఇతర సేవలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు.ఎస్పీ యోగేష్ గౌతమ్ మాట్లాడుతూ జూన్ 2వ న పరడే గ్రౌండ్ లో అవ తరణ వేడుకలకు అన్ని ఏర్పా ట్లు చేస్తున్నట్లు తెలిపారు.బార్కెట్లు ఇతర పార్కింగ్ తదితర ఏర్పాట్లను పర్యవే క్షించి చేస్తామన్నారు. ఈ సమావేశంలో డిఎస్పీ లింగయ్య జిల్లా అధికారులు. తదితరులు పాల్గొన్నారు.

# శాంతిభద్రతల పరిరక్షణ నేరాల నియంత్రణే లక్ష్యం

- నకిలీ విత్తనాల అమ్మకాలపైనప్రత్యేక దృష్టి
- అక్రమ రవాణాపై పాదం
- జిల్లా ఎస్పీ నారాయణ రెడ్డి




**వికారాబాద్ జిల్లా బ్యూరో, మే 20 (జనం సాక్షి) :** జిల్లాలో శాంతి భద్రతలు. నకిలీ విత్తనాలు. అక్రమ రవాణా పై ఉక్కు పాదం మోపుతామని వికారాబాద్ ఎస్పీ నారాయణ రెడ్డి ఒక ప్రకటన లో తెలియజేశారు.మంగళవారం వికారాబాద్ జిల్లా ఎస్పీ నారాయణ రెడ్డి, జిల్లా పోలీస్ కార్యాలయంలో పోలీస్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పోలీస్ స్టేషన్లలో నమోదు అవుతున్న కేసులు, శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణ, మరియు ప్రజలకు మెరుగైన పోలీస్ సేవలు అందించడంపై సమగ్రంగా సమీక్షించారు. పెండింగ్ కేసుల ఫైళ్లను క్షుణ్ణంగా పరిశీలించి, వాటి సత్వర పరిష్కారానికి పలు కీలక ఆదేశాలు జారీ చేశారు.సమావేశంలో ఎస్పీ జారీ చేసిన ముఖ్య ఆదేశాలు సూచనలు చేశారు. కేసుల సత్వర పరిష్కారం.పెండింగ్‌లో ఉన్న కేసుల దర్యాప్తును వేగవంతం చేసి, నిర్ణీత కాలపరిమితిలో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా, పాత కేసుల పురోగతిని సమీక్షించి, ఛార్జిషీట్లు దాఖలు చేయడంలో జాప్యం లేకుండా చూడాలన్నారు. రోడ్డు ప్రమాదాలు, ఆత్మహత్యల నివారణ. జిల్లాలో జరుగుతున్న రోడ్డు ప్రమాదాలు మరియు ఆత్మహత్యల వెనుక గల కారణాలను లోతుగా విశ్లేషించి, వాటిని తగ్గించడానికి అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రమాదాలు తరచుగా జరిగే ప్రాంతాలను గుర్తించి, అక్కడ కళాజాత బృందాలచే ప్రజలకు ట్రాఫిక్ నియమాలు, రహదారి భద్రతపై విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు.అక్రమ రవాణాపై ఉక్కుపాదం. ఇసుక, గుట్కా, మరియు ప్రజా పంపిణీ వ్యవస్థ (పిడిఎస్) బియ్యం అక్రమ రవాణాను పూర్తిగా అరికట్టాలని, ఇటువంటి కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. సరిహద్దు చెక్‌పోస్టుల వద్ద నిఘాను మరింత పటిష్టం చేయాలన్నారు. సీసీటీవీల ప్రాముఖ్యతపై అవగాహన. నేరాల నియంత్రణ మరియు దర్యాప్తులో సీసీటీవీ కెమెరాల ప్రాముఖ్యతను ప్రజలకు వివరించాలని, వారి నివాసాలు మరియు వ్యాపార సంస్థల వద్ద స్వచ్ఛందంగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకునేలా ప్రోత్సహించాలని తెలిపారు. "నేను సైతం" కార్యక్రమంలో భాగంగా ప్రజలను భాగస్వాములను చేయాలన్నారు. వారం చివరిలో ప్రత్యేక డ్రైవ్‌లు వారాంతాల్లో మద్యం సేవించి వాహనాలు నడిపేవారిని గుర్తించడానికి (డ్రంక్ %ఌ% డ్రైవ్), బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడాన్ని (ఓపెన్ బుజింగ్) నిరోధించడానికి, అనుమానాస్పద వాహనాలను తనిఖీ చేయడానికి ప్రత్యేక డ్రైవ్‌లు ముమ్మరంగా నిర్వహించాలని ఆదేశించారు.ఈ-పెట్టి కేసులపై ప్రత్యేక దృష్టి. ఈ-పెట్టి కేసుల నమోదు మరియు దర్యాప్తుపై ప్రత్యేక నిఘా ఉంచాలని, బాధితులకు తక్షణ న్యాయం అందేలా చూడాలని సూచించారు. కోర్ట్ మానిటరింగ్ మరియు కన్విక్షన్ రేటు. కోర్ట్ మానిటరింగ్ సిస్టమ్‌ను సమర్థవంతంగా పర్యవేక్షించాలని, కేసులలో నేరస్తులకు శిక్ష పడే శాతాన్ని (కన్విక్షన్ రేటు) గణనీయంగా పెంచడానికి కృషి చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. ప్రాసిక్యూషన్‌తో సమన్వయం చేసుకుంటూ, సాక్ష్యాధారాలను పకడ్బందీగా కోర్టు ముందు ఉంచాలన్నారు.మహిళల భద్రతకు పెద్దపీట. మహిళలు మరియు బాలికలపై జరిగే నేరాల పట్ల అత్యంత కఠినంగా వ్యవహరించాలని, నిందితులపై తక్షణమే కేసులు నమోదు చేసి, చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. షీ టీమ్స్ పనితీరును మరింత మెరుగుపరిచి, మహిళలకు సురక్షితమైన వాతావరణం కల్పించాలన్నారు.నకిలీ విత్తనాలపై పోలీస్ అధికారులు దృష్టి సవరించాలి. ముఖ్యంగా రాబోయే ఖరీఫ్ సీజన్‌ను దృష్టిలో ఉంచుకుని, ఇతర రాష్ట్రాల నుంచి నకిలీ విత్తనాలు రాకుండా నిరోధించడానికి కఠినమైన నిఘా ఉంచాలని ఆదేశించారు.నకిలీ విత్తనాలు అమ్మేవారిపై ప్రివెంటివ్ డిటెన్షన్ (పీడీ) చట్టం కింద చర్యలు తీసుకుంటామని ఎస్పీ హెచ్చరించారు. నకిలీ విత్తనాల సరఫరా మరియు అమ్మకాలను అరికట్టడానికి ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ బృందాలను ఏర్పాటు చేస్తున్నారు.వ్యవసాయ శాఖ అధికారులతో సమన్వయం చేసుకుని ఎరువులు మరియు విత్తనాల దుకాణాలపై దాడులు నిర్వహించాలని పోలీసు అధికారులకు సూచించారు.రైతులు నకిలీ విత్తనాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, ఏదైనా అనుమానం వస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు.తక్కువ ధరకు విత్తనాలు ఇస్తామని చెప్పే వారిని నమ్మవద్దని, లైసెన్స్ కలిగిన డీలర్ల వద్ద మాత్రమే విత్తనాలు కొనాలని రైతులకు సూచించారు.ఈ విధంగా, నకిలీ విత్తనాల వల్ల రైతులు నష్టపోకుండా ఉండేందుకు పోలీస్ అధికారులు చర్యలు తీసుకుంటున్నారని ఎస్పీ తెలియజేశారు. బక్రీద్ పండుగ సందర్భంగా ప్రత్యేక నిఘా:లి త్వరలో రాబోయే బక్రీద్ పండుగను పురస్కరించుకుని, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూడాలని, ముఖ్యంగా పశువుల అక్రమ రవాణా జరగకుండా పటిష్టమైన నిఘా ఏర్పాటు చేయాలని పోలీసు అధికారులను ఆదేశించారు. శాంతి కమిటీ సమావేశాలు నిర్వహించి, ప్రజల సహకారంతో పండుగ ప్రశాంత వాతావరణంలో జరిగేలా చూడాలన్నారు.ఈ సమావేశంలో జిల్లా అదనపు శ్రీ టివి హనుమంత్ రావు ,వికారాబాద్,పరిగి,తాండూర్ మరియు డిసిఆర్‌బి డీఎస్పీలు, జిల్లా సీఐలు,జిల్లా ఎస్ఐలు మరియు ఇతర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## కార్మిక వ్యతిరేక కోడ్‌లను రద్దు చేయాలి




- ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షులు ఎండి. యూసుఫ్

**కుత్బుల్లాపూర్, మే 20 (జనం సాక్షి) :** కేంద్ర ప్రభుత్వం 44 కార్మిక చట్టాలు రద్దుచేసి వాటి స్థానంలో కార్మికులకు వ్యతిరేకంగా తెచ్చిన నాలుగు కోడ్ ల ను వెంటనే రద్దు చేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు ఎండి యూసుఫ్ డిమాండ్ చేశారు. మంగళవారం కుత్బుల్లాపూర్ నియోజక వర్గం జీడిమెట్ల పారిశ్రామిక వాడలోని రైతు బజార్ నుండి ఉషోదయ టవర్స్ వరకు వివిధ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. సందర్భంగా ఏ ఐ టి యు సి రాష్ట్ర అధ్యక్షులు ఎండి యూసుఫ్, జిల్లా అధ్యక్షులు కే స్వామి,మండల ఉపాధ్యక్షులు ఉమామహేశ్వర్లు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్మికులకు వ్యతిరేకంగా యాజమాన్యాలకు అనుకూలంగా చట్టాలను రూపొందిస్తుందని ఆరోపించారు. దీనికి నిరసనగా మే 20వ తేదీన దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెకు కార్మిక సంఘాలు పిలుపునిచ్చాయని తెలిపారు. కార్మికులకు చట్టబద్ధంగా సమ్మె చేసే హక్కు లేకుండా చేయడానికి ప్రభుత్వం కుట్ర పన్ను తుందన్నారు. 8 గంటల పని దినాన్ని 12 గంటలకు మార్చే ఉద్దేశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. కార్మిక వ్యతిరేక విధానాలను మానుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయుసీ మేడ్చల్ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, కుత్బుల్లాపూర్ నియోజకవర్గం అధ్యక్షులు వీ హరినాథ్ రావు, నాయకులు రాములు, ఏఐటీయూసీ హమాలి యూనియన్ నాయకులు నర్సింహారెడ్డి, జార్జి, గురప్ప, సుంకిరెడ్డి, బోనాల కనకయ్య, నరసింహులు, అశోక్, లక్ష్మణ్, సిఐటియు హమాలి నాయకులు దేవదానం, కే శ్రీను, డి కర్ణాకర్, భాష, టియు సిఐ నాయకులు ప్రవీణ్ కుమార్, బిఆర్‌టి యు నాయకులు రవి తదితరులు పాల్గొన్నారు.

జనంసాక్షి www.janamsakshi.org | బుధవారం 21 మే 2025

# సీఎం జిల్లా పర్యటనతో అభివృద్ధిలో రూపురేఖలు మారుతాయి

- కేంద్రీయ విద్యాలయ నూతన భవనం ప్రారంభించను సీఎం
- జహీరాబాద్ నియోజకవర్గంలో సీఎం పర్యటన చారిత్రాత్మకం కావాలి
- ప్రభుత్వ శాఖల సమన్వయంతో సీఎం పర్యటన విజయవంతం చేయాలి
- రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహా



**సంగారెడ్డి ప్రతినిధి, మే 20 (జనం సాక్షి) :** జహీరాబాద్ నియోజకవర్గంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పర్యటనతో సంగారెడ్డి జిల్లా అభివృద్ధిలో రూపురేఖలు మారుతాయని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ పేర్కొన్నారు. ఈనెల 23న జహీరాబాద్‌లో ముఖ్యమంత్రి పర్యటనపై కలెక్టరేట్ లోని సమావేశం మందిరంలో మంత్రి దామోదర్ రాజనర్సింహ, జహీరాబాద్ ఎంపీ సురేష్ షెట్కర్, నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి, జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు, ఎస్పీ పరితోష్ పంకజ్, అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ తో మంత్రి దామోదర్ రాజనర్సింహ జిల్లా అధికారులతో సమీక్ష సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మంత్రి దామోదర్ రాజనర్సింహ మాట్లాడుతూ ఈ నెల 23న సంగారెడ్డి జిల్లాలోని జహీరాబాద్ నియోజకవర్గంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పర్యటన తెలంగాణ రాష్ట్రంలో చారిత్రాత్మకం కావాలన్నారు. సీఎం రేవంత్ రెడ్డి పర్యటనతో సంగారెడ్డి జిల్లా అభివృద్ధిలో రూపురేఖలు మారుతాయన్నారు. అన్ని శాఖల అధికారుల సమన్వయంతో సీఎం పర్యటన విజయవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. అధికారులు సీఎం పర్యటన కోసం రూట్ మ్యాప్ ప్రణాళిక, సెక్యూరిటీ, బందోబస్తు, బారికేడ్లు , ట్రాఫిక్ నియంత్రణ, త్రాగునీరు,హెలిప్యాడ్, హెల్త్ క్యాంప్‌లు పకడ్బందీగా ఏర్పాటు చేయాలన్నారు. ముఖ్యమంత్రి పర్యటనలో బసవేశ్వర విగ్రహావిష్కరణ, కేంద్రీయ విద్యాలయ నూతన భవనం ప్రారంభోత్సవం, మహిళా పెట్రోల్ బంకు, జిల్లా అభివృద్ధికి కావలసిన కొన్ని కార్యక్రమాలను శంకుస్థాపనలు చేసి, వివిధ అభివృద్ధి సంక్షేమ పథకాల పై ఏర్పాటు చేసిన స్టాల్‌లను పరిశీలించి సభ లో పాల్గొంటారని తెలిపారు. జహీరాబాద్ ఎంపీ సురేష్ శేఖర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి జిల్లాకు రావడం చాలా సంతోషమని జిల్లా అభివృద్ధిలో మరిన్ని అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను ప్రారంభోత్సవం చేసుకుందామన్నారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం జహీరాబాద్ నియోజకవర్గానికి ఎన్నో పరిశ్రమలను తీసుకువచ్చి, ప్రజలందరికీ ఉపాధి కల్పించిందని గుర్తు చేశారు. నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి మాట్లాడుతూ అన్ని శాఖల అధికారులు సమన్వయం చేసుకొని ప్రజలకు ఇబ్బందులు లేకుండా ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి పర్యటనలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా ఏర్పాటు చేయాలని పక్కా ప్రణాళికతో సీఎం పర్యటన ఏర్పాట్లు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# పెండింగ్‌లో ఉన్న భూ సేకరణ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలి

- జిల్లా కలెక్టర్ సంతోష్



**గద్వాల నడిగడ్డ, మే 20 (జనం సాక్షి) :** జవహర్ నెట్టెంపాడు లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు పరిధిలో పెండింగ్‌లో ఉన్న భూ సేకరణ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ బి.యం.సంతోష్ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఐడీఓసీ వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో ఇరిగేషన్, రెవెన్యూ శాఖల అధికారులతో పెండింగ్ ఆయకట్టు భూ సేకరణపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జవహర్ నెట్టెంపాడు లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు కింద పెండింగ్‌లో ఉన్న 480 ఎకరాల భూసేకరణపై చర్యలు తక్షణమే ప్రారంభించాలని సూచించారు.భూ సేకరణ ప్రక్రియలో డిస్ట్రిబ్యూషన్ కెనాల్స్ వారీగా తహసీల్దార్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్, మండల సర్వేయర్, ఇరిగేషన్ అధికారులతో కూడిన ప్రత్యేక టీమ్‌లు ఏర్పాటు చేసి భూ సేకరణను వేగవంతంగా చేపట్టాలని ఆదేశించారు.భూమికి పరిహారం చెల్లించిన వెంటనే సివిల్ వర్క్స్ ప్రారంభించాలని స్పష్టం చేశారు.కాలువల నిర్మాణం వల్ల గ్రామాల అభివృద్ధి,సాగు సౌకర్యాలు ఎలా మెరుగవుతాయో ప్రజలకు వివరించాలన్నారు. డిస్ట్రిబ్యూషన్ కెనాల్స్ ప్రాంతాలను స్వయంగా పరిశీలిస్తానని కలెక్టర్ తెలిపారు. ఈ సమీక్ష సమావేశంలో అదనపు కలెక్టర్ లక్ష్మీ నారాయణ,ఆర్డీఓ శ్రీనివాసరావు, ఇరిగేషన్ ఎస్.ఈ రహీముద్దీన్, ఇరిగేషన్,రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు నాణ్యతమైన విద్యను బోధించేందుకు శిక్షణా తరగతులు



**న్యాల్‌కల్, మే 20 (జనం సాక్షి) :** పక్షం రోజుల్లో ప్రారంభం కానున్న ప్రభుత్వం పాఠశాలల విద్యార్థులకు.. 2025 - 26 విద్యా సంవత్సరానికి గాను మరింత మెరుగైన, నాణ్యతతో కూడిన విద్యను అందించేందుకు ఉపాధ్యాయులకు ప్రత్యేక శిక్షణా తరగతులు ప్రారంభమయ్యాయి. జిల్లా విద్యాశాఖాధికారి ఆదేశం, మండల విద్యాధికారి మారుతి రాథోడ్ పర్యవేక్షణలో మంగళవారం మండలంలోని మిర్జాపూర్ (బి) జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల ఉపాధ్యాయులకు శిక్షణిచ్చారు. జిల్లా స్థాయిలో ప్రత్యేక శిక్షణ పొందిన 8 మంది రిసోర్స్ పర్సన్లు (ఆర్పీలు).. సుధాకర్, మురళి, పాండయ్య, కాశీనాథ్, శంకర్, శ్వేత, ప్రసాద్, సోమశేఖర్ లు అంశాల వారీగా శిక్షణ ఇచ్చారు. మండలంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలకు చెందిన 92 మంది ఉపాధ్యాయులకు గాను 87 మంది ఉపాధ్యాయులు శిక్షణకు హాజరయ్యారు. హాజరైన ఉపాధ్యాయులకు ఆర్పీలు.. బోధనా సామర్థ్యం పెంచడం, నాణ్యతమైన విద్య, పరిసరాల విజ్ఞానం, పాఠ్యాంశాల (తెలుగు,ఆంగ్లం,గణితం) పై అవగాహన కల్పించారు. ఈ నెల 20న ప్రారంభమైన శిక్షణా తరగతులు 24 వరకు, ఐదు రోజుల పాటు కొనసాగనున్నాయి.

# కార్మికులు చట్టపరమైన అవగాహన కలిగి ఉండాలి

- సీనియర్ జడ్జి శ్రీనివాస్



**గద్వాల నడిగడ్డ, మే 20 (జనం సాక్షి) :** అసంఘటిత రంగంలోని కార్మికులకు చట్టపరమైన అవగాహన కలిగి ఉండాలని ప్రిన్సిపల్ సీనియర్ జడ్జి వి.శ్రీనివాస్ అన్నారు.మంగళవారం గద్వాల మండలంలోని మదనపల్లి గ్రామంలోని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సులో అసంఘటిత రంగంలోని కార్మికుల కొరకు ఉద్దేశించిన చట్టపరమైన అవగాహన సదస్సులో ముఖ్యఅతిథిగా ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి వి.శ్రీనివాసులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా అసంఘటిత కార్మికుల యొక్క సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అసంఘటిత కార్మికుల యొక్క చట్టాల గురించి వివరించారు.అసంఘటిత రంగ కార్మికులు అంటే ప్రభుత్వంతో అధికారికంగా నమోదు కాని వ్యాపారాలో పని చేసే వ్యక్తులు,తరచుగా చట్టపరమైన,నియంత్రణ చట్టానికి వెలుపల పని చేస్తారు.ఈ రంగం చిన్న వ్యాపారాలు నుండి ఇంటి ఆధారత పని వరకు విస్తృత శ్రేణి కార్యకలాపాలను కలిగి ఉంటుంది,ఎక్కువ మంది శ్రామిక శక్తిని కలిగి ఉంటుందని అన్నారు. అసంఘటిత రంగ కార్మికులు తరచుగా తక్కువ వేతనాలు సామాజిక భద్రత లేకపోవడం,క్రమ రహిత ఉపాధి వంటి సమస్యలను కలిగి ఉంటుంది కార్మికులందరూ లేబర్ కార్డు,ఇ(శ్రం కార్డు ప్రతి ఒక్క కార్మికుడు కలిగి ఉండాలని అన్నారు.ఈ కార్డుల వల్ల ప్రభుత్వం యొక్క సదుపాయాలని వినియోగించుకోవచ్చు అన్నారు. దళారులను నమ్మి మోసపోవద్దని మీసేవ కేంద్రం ఉపయోగించుకోవాలన్నారు. వారి యొక్క సమస్యలను దరఖాస్తు రూపంలో జిల్లా న్యాయ విజ్ఞాన సదస్సుకు అందచేయాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో లీగల్ ఎయిడ్ కౌన్సిల్స్ వి. రాజేందర్,బి. శ్రీనివాసులు,లక్ష్మణ స్వామి పాల్గొన్నారు.

# వరి ధాన్యం తరలించాలని రైతులు ధర్నా



**రేవల్లి, మే 20 (జనంసాక్షి) :** ఏదుల మండలంలోని చీర్కపల్లి గ్రామానికి చెందిన తెలంగాణ రైతు సంఘం, వనపర్తి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో గ్రామంలో వరి కొనుగోలు కేంద్రం గత పది రోజుల నుంచి నిలిపి వేయడానికి నిరసనగా మంగళవారం ఉదయం మెయిన్ రోడ్డుపై రెండు గంటల పాటు రైతులు రాస్తారోకో నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి రైతు సంఘం జిల్లా అధ్యక్షులు డి బాల్ రెడ్డి, నాగర్ కర్నూల్ జిల్లా కార్యదర్శి ఎం శ్రీనివాసులు, జిల్లా నాయకులు రమేష్ మాట్లాడడం జరిగింది. లారీలు వచ్చేంతవరకు ఇక్కడనే ఉంటామని, రైతులు రైతు సంఘం నాయకులు డిమాండ్ చేయడంతో పోలీస్ అధికారులు చొరవ తీసుకొని సంబంధిత జిల్లా అధికారులతో మాట్లాడి మూడు లారీలను పంపించడం జరిగింది. తరుగు, తాలు పేరుతో జరుగుతున్న మోసాన్ని కూడా ఎండ కట్టడం జరిగింది. అనంతరం రైతులతో మాట్లాడి రైతు సంఘం సభ్యత్వం, చీర్కపల్లి గ్రామ కమిటీ ఎన్నుకున్నారు.

# గుంతల రోడ్డుకు మరమ్మత్తులు చేయాలి




**అమీన్పూర్, మే 20 (జనం సాక్షి) :** చందానగర్ నుంచి అమీన్పూర్ వరకు ఉన్న రోడ్డుకు మరమ్మత్తులు చేయాలని అమీన్పూర్ పీపుల్స్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు తిరుమలరెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం జిహెచ్ఎంసి జోనల్ కమిషనర్ హేమంత్‌కి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చందానగర్ నుంచి అమీన్పూర్ వెళ్లే రహదారి పూర్తిగా గుంతల మయం అయిందన్నారు. జిహెచ్ఎంసి పరిధిలో ఈ రోడ్డు మరి అధ్వానంగా మారిందన్నారు. దాంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. గుంతల రోడ్డులో వాహనాలు వాడవుతున్నాయని తెలిపారు. ఈ గుంతల రోడ్డుకు వెంటనే మరమ్మతులు చేసి ప్రజల ఇబ్బందులను తీర్చాలని డిమాండ్ చేశారు. లేకపోతే ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

# క్రీడలు స్నేహ భావన్ని పెంచుతాయి



**ఊర్కొండ, మే 20 (జనం సాక్షి) :** మండల పరిధిలోని ఊర్కొండపేట జెడ్పీహెచ్ఎస్ క్రీడా మైదానంలో అబ్దుల్ వహాబ్ స్మారక ఉమ్మడి జిల్లా స్థాయి క్రికెట్ టోర్నీ మంగళవారం ప్రారంభమైంది. మొదటి బహుమతి ప్రదాత ఆర్టీసీ జబ్బార్ నాయకులు వహిదొద్దిన్, శ్రీనివాసులు,మాజీ సర్పంచ్ కృష్ణ గౌడ్, ముఖ్యఅతితులుగా హాజరై క్రీడాకారులను పరిచయ కార్యక్రమం చేసి టోర్నమెంట్ ప్రారంభంభించారు .ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యువత చెడు అలవాట్లకు దూరంగా ఉంటూ క్రీడల్లో రాణించాలని అన్నారు.క్రీడల్లో రాణిస్తే ఉన్నత భవిష్యత్తు లభిస్తుందని సందర్భంగా వారు సూచించారు. అలాగే క్రీడాకారులు ఈ టోర్నమెంట్లో పాల్గొనడానికి ఆర్గనైజర్స్ షబ్బీర్, గులాం రసూల్, జహంగీర్ ఇబ్రహీం,7799088832 నంబర్ కు సంప్రదించాలని ఆర్గనైజర్లు కోరారు.

# క్షేత్రస్థాయిలో పర్యటించి ధరణి పెండింగ్ ఫిర్యాదును పరిష్కరించిన జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి



**వనపర్తి బ్యూరో, మే 20 (జనంసాక్షి) :** మదనపూర్ మండలం, ద్వారక నగర్ గ్రామంలో దాదాపు సంవత్సర కాలం నుండి పెండింగ్ లో ఉన్న ధరణి పెండింగ్ కేసును మంగళవారం ఉదయం జిల్లా కలెక్టర్ స్వయంగా మోకా మీదికి వెళ్ళి రెవెన్యు అధికారులు, గ్రామస్తులతో మాట్లాడి సమస్యను పరిష్కరించారు.కొత్తకాపు రామయ్య తండ్రి పేరు చిన్నయ్య భూమిని గతంలో ఉన్న రెవెన్యూ అధికారి నోషనల్ ఖాతాగా మార్చడంతో సదరు భూ యజమాని ధరణిలో దరఖాస్తు చేసుకున్నారు. అట్టి భూమిని రెవెన్యూ అధికారులతో సర్వే చేయించిన అనంతరం కొత్తకాపు రామయ్యకు చెందిన 25 గుంటల భూమిని నోషనల్ ఖాతా నుండి తొలగించి పట్టా భూమి గా మార్చుతూ పంచనామ చేయించారు.ఇక నుండి వ్యవసాయం చేసుకోవాలని కలెక్టర్ రైతును సూచించారు. భూ సమస్య పరిష్కరించినందుకు రైతు కలెక్టర్ కు ధన్యవాదాలు తెలిపారు.తహసిల్దార్ అబ్రహం లింకన్, గిర్దావర్ రాజేశ్వరి, సర్వేయర్ సుచరిత గ్రామస్తులు తదితరులు ఉన్నారు.

# శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలి



**నంగునూర్, మే 20 (జనం సాక్షి) :** నంగునూరు మండలం నాగరాజుపల్లి గ్రామంలో జరిగే శ్రీ రేణుక ఎల్లమ్మ వార్షికోత్సవం, కళ్యాణ మహోత్సవం పాల్గొని అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేసిన వంగ రాజేశ్వర్ రెడ్డి మహిళలు మంగళ హారతులతో, డప్పు సప్పులతో ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎల్లమ్మ తల్లి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో ఆయురారోగ్యాలతో ఉండాలని తల్లి చల్లని దీవెనలతో మీకు మరింత సేవ చేసే భాగ్యం కల్పించాలని అమ్మవారిని కోరినట్టు తెలిపారు. ఘనంగా శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లి కళ్యాణ మహోత్సవం నిర్వహించిన, కుల పెద్దలకిఅభినందనలుతెలియజేశారు దేవతల ఆశీస్సులు పొందారు.ఈ కార్యక్రమంలో తాజా మాజీ సర్పంచ్ పాకాల కల్పనబాబు,మాజీ ఉపసర్పంచ్ పాకాల రవి,పాకాల బాలు, పాకాల రాజేందర్, పాకాల కరుణాకర్, పాకాల ఎల్లం, పాకాల భరత్, పాకాల హేమంత్, పాకాల అజయ్ ,పాకాల రాకేష్, పాకాల బాబు ,పాకాల శివ, పాకాల ప్రమోద్,పాకాల శ్రీకాంత్ మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధే మా మొదటి ప్రాధాన్యం



**చిలప్‌చేడ్, మే 20 (జనంసాక్షి) :** ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి లక్ష్యంగా స్థానిక కేజీబీవీ చిట్కుల్ పాఠశాలలో ఉపాధ్యాయుల వృత్యంతర శిక్షణ కార్యక్రమంలో చేపట్టిన ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు. ఇందులో భాగంగా మొదటి రోజు మండల విద్యాధికారి విటల్ ఆధ్వర్యంలో ఘనంగా ప్రారంభమైంది. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి మండల విద్యాధికారి మాట్లాడుతూ ఈ శిక్షణ ఉపాధ్యాయులకు ఎంతో మేలు కలుగుతుందని తద్వారా ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి ఎంతగానో దోహదపడుతుందని అభిప్రాయపడ్డారు అదే విదంగా ఈ శిక్షణలో తీసుకోవలసిన మెలకువలు, శిక్షణ యొక్క ప్రాముఖ్యతను ఉపాధ్యాయులందరికీ తెలియజేసి వారిలో నూతన ఉత్తేజాన్ని నింపారు. జూన్ నెలలో చేపట్టబోయే బడిబాట కార్యక్రమం ద్వారా పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచుతూ ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి పథంలో నడపాలని ఉపాధ్యాయులను కోరారు. ఈ కార్యక్రమానికి ఉపాధ్యాయులందరూ సకాలంలో హాజరై రిసోర్స్ పర్సన్ లు చెప్పే విషయాలను నోట్ చేసుకొని ఉత్సాహంగా పాల్గొనడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండలంలోని వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు, పాల్గొన్నారు.

# బక్రీద్ ప్రశాంతంగా జరిగేలా చూడాలి



**నారాయణపేట జిల్లా బ్యూరో, మే 20 (జనం సాక్షి) :** బక్రీద్ పండుగ ప్రశాంతంగా జరిగేలా అధికారులు చర్యలు తీసుకోవాలని నారాయణ పేట జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ అధికారులను ఆదేశించారు.బక్రీద్ వేడుకను పురస్కరిం చుకుని కలెక్టర్ అధ్యక్షతన మంగళవారం జిల్లా కలెక్టర్ మీటింగ్ హాల్లో జిల్లా కలెక్టర్ సిక్త పట్నాయక్, ఎస్. పి. యోగేష్ గౌతమ్ బక్రీద్ పండుగ పై జిల్లా స్థాయి సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో పశువుల జంతు సంక్షేమ నియమాల అమలుపై సంబంధిత శాఖల అధికారులతో కలెక్టర్, ఎస్పీ సమీక్షించారు.బక్రీద్ పండుగ ను దృష్టిలో పెట్టుకుని ఎలాంటి సమస్యలు ఉత్పన్నం కాకుండా సంబంధిత శాఖల అధికారులు పరస్పర సమన్వ యంతో విధులు నిర్వర్తించా లని సూచించారు.జంతు సంక్షేమం కోసం ఉద్దేశించిన చట్టాల ఉల్లంఘన జరగకుం డా చూడాలని అన్నారు.ఈ విషయాలపై ప్రజలకు విస్తృత స్థాయిలో అవగాహన కల్పి స్తూ,పశువులను స్లాటర్ హౌజ్ లలోనే వధించాలని,రోడ్లపై ఎక్కడబడితే అక్కడ వధించరాదని సూచించారు.పశువులను తరలించడానికి, వాటిని వధించడానికి ముందు తప్పనిసరిగా పశు వైద్యాధికారిచే ధ్రువీకరణ పొందాలని అన్నారు. బక్రీద్ పండుగ దృష్ట్యా వెటర్నరీ వైద్యులు అన్ని చోట్ల సరిపడా సంఖ్యలో అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని పశు సంవర్ధక శాఖ అధి కారులను ఆదేశించారు. పోలీస్ శాఖలకు చెందిన అధికారులు నిరంతరం నిఘా ఉండేలా పర్యవేక్షణ జరపాల న్నారు. అధికారులు క్షేత్రస్థాయికి వెళ్లి శాంతిభద్రతల సమస్య తలెత్తకుండా సంయ మనంతో వ్యవహరిస్తూ అవసరమైన అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు హితవు పలికారు. పశువుల కు తగిన షెల్టర్ కల్పిస్తూ, వాటికి పశుగ్రాసం, నీటి వసతి అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని అన్నారు.పశువుల వారాంతపు సంతలలో నిబంధనలకు అనుగుణంగా,పశు సంరక్షణ చట్టానికి లోబడి క్రయవిక్రయాలు జరిగేలా చూడాలన్నారు. వ్యర్థాలను ఎక్కడబడితే అక్కడ పారవేయకుండా చూడాలని, వ్యర్థాలను వెంటది వెంట జనావాసాలకు దూరంగా తరలించేలా ప్రణాళికాబద్ధంగా వ్యవహరించాలని మున్సిపల్, పంచాయతీరాజ్ శాఖల అధికారులకు సూచించారు. సున్నితమైన, సమస్యాత్మక ప్రాంతాలపై ప్రత్యేక దృష్టిని కేంద్రీకరిం చాలని, ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావు లేకుండా శాంతియుత వాతావరణంలో బక్రీద్ వేడుక జరిగేలా కృషి చేయాలని హితవు పలికారు. మస్జీద్, ఈద్గాల దగ్గర శానిటేషన్ పై ప్రత్యేక చర్యలు తీసుకోవాలి అన్నారు.ఈ సమావేశంలో. డి. ఎస్. పి. లింగయ్య, జిల్లా మైనారిటీ అధికారి రషీద్,పోలీస్ అధికారు లు,జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు అబ్దుల్ ఖాదర్, ఎంఐఎం సదర్, యూసుఫ్ తాజ్, కాంగ్రెస్ ప్రతినిధి సరఫరాజ్ అన్సారీ, తదితరులు పాల్గొన్నారు.

# తరగని భక్తులు.. కొనసాగుతున్న పుష్కర స్నానాలు..

- **జనాలతో త్రివేణి సంగమ తీరం కళకళ..**





**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో/మహాదేవపూర్/కాళేశ్వరం, (జనంసాక్షి):** కాళేశ్వరంలో పవిత్ర సరస్వతి పుష్కర స్నానాలు కొనసాగుతున్నాయి.. రోజులు గడిచినా భక్తుల రాక తగ్గడం లేదు.. వచ్చిన జనాలతో త్రివేణి సంగమ తీరం కళకళ లాడుతుంది.. ఆరో రోజు కూడా త్రివేణి సంగమం భక్తులతో కిక్కిరిసిపోయింది.. సువిశాలంగా విస్తరించిన త్రివేణి సంగమంలో లక్షలాది మంది భక్తులు పుణ్య స్నానాలు చేసేందుకు వస్తున్నారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండలం కాళేశ్వరంలో అంతర్వాహిని సరస్వతి నదిలో పుష్కర స్నానమాచరించిన భక్తులు పుణీతులై నీరాజానాలు అర్పిస్తున్నారు. ఆరో రోజు కూడా భక్తుల తాకిడీ తీవ్రంగా పెరగడంతో జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ పర్యవేక్షణలో అధికార యంత్రాంగం సేవలందించే విధుల్లో నిమగ్నమైంది. త్రివేణి సంగమంలో ఏర్పాటు చేసిన పుష్కర ఘాట్ల వద్ద భక్తులు నది లోపలకు వెళ్లకుండా ఉండేందుకు, ప్రమాదాలు జరగకుండా ఉండేందుకు బారికేడ్లు, గజ ఈతగాళ్లు, ఎన్డీఆర్ఎఫ్, సింగరేణి రెస్క్యూ బృందాలను, బోట్లు అందుబాటులో ఉంచిన అధికా రులు భక్తులు ప్రమాదాలకు గురి కాకుండా పకడ్బందీ చర్యలు చేపట్టారు.

**ఒక్కో రోజు ఒక్కో ప్రత్యేకత..**

పుష్కర నదికి మొదటి 12 రోజుల్లో ఒక్కో రోజు ఒక్కో ప్రత్యేకత ఉంటుంది. ఆ ప్రత్యేకతననుసరించి భక్తులు దానం చేయడం వల్ల పుణ్యం లభిస్తుందని పురాణాలు చెబున్నాయి. ప్రకృతిలో భాగమైన నదుల వద్ద సహజత్వాన్ని పెంపొందించేందుకు భక్తులు కూడా చొరవ తీసుకోవాలన్న సంకల్పంతోనే హైందవ ఆచారాలు పాటించాల్సి ఉంటుంది. ప్రాకృత్య ధర్మానికి మించింది మరోటి లేదన్నది చేతల్లో చూపించేందుకే పూర్వీకులు ఈ సాంప్రాదాయాలను కొనసాగించే వారు. పుష్కర నది తీరంలో ఆరవ రోజున ఔషధ దానం, కర్పూర దానం, చందన దానం, కస్తూరి దానం చేయాలని పురణాలు వివరించాయి. ఈ రోజు పుష్కర సరస్వతి ఒడిలో పుణ్య స్నానాలు చేసిన భక్తులు దానాలు చేయడం మంచిదని చెప్తున్నాయి. ఆరో రోజైన మంగళవారం తెలంగాణ, ఏపీ, చత్తీస్ గడ్, ఒడిషా, మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల నుండి అధిక సంఖ్యలో భక్తులు కాళేశ్వరం చేరుకుంటున్నారు.

**క్యూ లైన్లు కిటకిట..**

కాళేశ్వర ముక్తీశ్వర స్వామి ఆలయంలో క్యూ లైన్లు కిటకిట లాడుతున్నాయి. సరస్వతి నదిలో పుష్కర స్నానాలు ఆచరించిన భక్తులు స్వామి వారిని దర్శించుకునేందుకు క్యూ లైన్ లో నిలబడుతున్నారు. భక్తుల తాకిడి పెరగడంతో అధికారులు వికలాంగులకు ఇబ్బందులు కలుగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. దీంతో భక్తులకు కొన్ని ఇబ్బందుల మధ్య దర్శనం చేసుకుంటున్నా, వికలాంగులకు మాత్రం ఇబ్బందులు లేకుండా ఈజీ దర్శనం ఏర్పాటు చేశారు.

## ఊపిరి ఆడక పసికందు మృతి



**ఖానాపూర్, మే 20 (జనంసాక్షి) :** నియోజకవర్గం కేంద్రంలోని సుభాష్ నగర్ కాలనీకి చెందిన ఆలకుంట సుజాత 28 రోజుల క్రితం ఆడ పాపకు జన్మనిచ్చింది. సుజాత భర్త ఆలకుంట శేఖర్ మద్యం మత్తులో భార్యను తమ ఇంటికి పంపించాలని అత్తవారితో గొడవపడ్డాడు. అందులో భాగంగా గత సోమవారం రాత్రి చంటి పాపను తీసుకుని తల్లి సుజాత మంచం పైన పడుకోగా మంగళవారం వేకువ జామున సుమారు 5:00 గంటల ప్రాంతంలో ఆలకుంట శేఖర్ సుజాత పడుకున్న మంచంపై పడుకున్నాడు. పక్కనే 28 రోజుల పసికందు ఉన్న విషయాన్ని గమనించకపోవడంతో ఆమె పైన పడుకోవడంతో పసికందు మృతి చెందినట్లు సిఐ సిహెచ్.అజయ్ తెలిపారు. ఆలకుంట సుజాత తల్లి అల్లేపు రాజమణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ వివరించారు.

## రెండు రోజులు నీటి సరఫరా బంద్

- **టయోటా షోరూం వద్ద పైపులైనుకు కొనసాగుతున్న మరమ్మతు పనులు**

**వరంగల్ ఎంజీఎం, మే 20(జనంసాక్షి):** అండర్ రైల్వే జోన్ కు నీటి సరఫరా జరిగే ధర్మసాగర్ నుండి వచ్చే ప్రధాన పైపులైనుకు టయోటా షోరూం (అమ్మ వారి పేట వెళ్ళు రోడ్డు) వద్ద పగలడం వల్ల అట్టి పైపు లైనుకు మరమ్మతు పనులు కొనసాగుతున్నందున రెండు రోజుల పాటు (బుధ, గురు వారాల్లో) నీటి సరఫరా జరుగదని, అట్టి ప్రాంత వాసులు గమనించి సహకరించాలని బల్దియా ఇన్చార్జి ఎస్ఈ శ్రీరామోజు శ్రీనివాస్ నేడొక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా అండర్ రైల్వే జోన్ పరిధిలోని ప్రాంతాలైన కరీమాబాద్, ఎస్ ఆర్ ఆర్ తోట, ఖిలా వరంగల్, శివనగర్, ఉర్సు, కరీమాబాద్, చింతల్, పెరుకవాడ ప్రాంతాల్లో రెండు రోజుల పాటు నీటి సరఫరా జరగదని అట్టి ప్రాంతవాసులు గమనించి సహకరించాలని ఆయన కోరారు.

## కాళేశ్వరంలో భక్తుడికి అస్వస్థత



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో/కాళేశ్వరం, (జనంసాక్షి):** కాళేశ్వరంలో ఓ భక్తుడు మంగళవారం అస్వస్థతకు గురయ్యాడు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన కృష్ణమూర్తి(66) అనే భక్తుడు పుష్కర స్నానానికి వచ్చి, విఐపి ఘాట్ లో వడదెబ్బతో అస్వస్థతకు గురయ్యాడు. వెంటనే స్పందించిన సిబ్బంది కృష్ణమూర్తిని అత్యవసర సేవలకు అంబులెన్స్ ద్వారా తరలించారు. ప్రస్తుతం కృష్ణమూర్తి కోలుకుంటున్నట్లు వైద్యులు తెలిపారు.

## టాటా ఏసీ వాహనం ఢీ

- **ఒకరి మృతి**

**చెన్నారావుపేట, మార్చి 20 (జనం సాక్షి):** టాటా ఏసీ వాహనం ఢీ:కొట్టడంతో ఒకరు అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన చెన్నారావుపేట మండల కేంద్రంలో మంగళవారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.... చెన్నారావుపేట గ్రామానికి చెందిన మర్రి రాములు(65) సైకిల్ పై మంగళవారం ఉదయం రోజువారి మాదిరిగానే పాల బాటిల్ ఇవ్వడానికి వెళ్లి తిరిగి ఇంటికి వస్తున్నాడు. ప్రధాన సెంటర్ వద్దకు వచ్చి తన ఇంటి వైపు వెళ్లడానికి రోడ్డును దాటుతున్నాడు. నర్సంపేట నుండి నెక్కొండ వైపు వెళ్తున్న టాటా ఏసీ వాహనం వేగంగా వచ్చి ఢీ: కొంది. దీంతో తీవ్ర గాయాల పాలైన రాములు అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య సమ్మక్క, కుమారుడు, కూతురు ఉన్నారు. మృతుడి కుమారుడు రాజు ఫిర్యాదు మేరకు పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## కోటగుళ్లు ఆలయం శిల్ప సంపద భావితరాలకు అందించాలి

- **తెలంగాణ స్టేట్ ఏసీబీ డైరెక్టర్ తరుణ్ జోషి**
- **ఆలయ సందర్శన స్వామివారికి ప్రత్యేక పూజలు**



**గణపురం, మే 20 (జనంసాక్షి):** కాకతీయులు నిర్మించిన కోట గుళ్ళు ఆలయ నిర్మాణం ఎంతో అద్భుతమని తెలంగాణ స్టేట్ ఏసీబీ డైరెక్టర్ తరుణ్ జోషి అన్నారు. మంగళవారం ఆయన శ్రీ భవాని సహిత గణపేశ్వరాలయం కోట గుళ్ళ ను సందర్శించారు. ఈ సందర్భంగా కోటగుళ్లు పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు జూలపల్లి నాగరాజు వారికి ఘన స్వాగతం పలికారు. మొదట గణపతి, నందీశ్వర గణపేశ్వర స్వాములకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజా కార్యక్రమాలు అనంతరం ఆలయ కమిటీ పక్షాన శాలువాలు పూలమాలలతో ఘనంగా సన్మానించారు. పూజా కార్యక్రమాల అనంతరం ఆయన ఆలయ ప్రాంగణాన్ని పరిశీలించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రామప్ప శిల్ప సంపదని పోలిన విధంగా కోటగుళ్లు ఎంతో అద్భుతంగా ఉన్నాయని తను వరంగల్ లో పని చేసిన సమయంలో ఎప్పుడు ఇక్కడికి రాలేదని ఈ ఆలయంలో పూజలు జరుగుతున్న విషయం తమకు తెలియదన్నారు. మొట్టమొదటిసారి ఆలయాన్ని సందర్శించడం జరిగిందని ఇక్కడి వాతావరణం తనకెంతో నచ్చిందని అన్నారు. కాటేశ్వరాలయం నందిమండపం నాట్య మండపాలను ప్రత్యేకంగా పరిశీలించారు. సుమారు గంటపాటు ఆలయ ప్రాంగణంలోనే గడిపారు. అనంతరం హరిత అతిథి గృహం ప్రాంగణంలో ఉన్న శివ ద్వారా పాలక విగ్రహాలను పరిశీలించారు. మరోసారి కుటుంబ సమేతంగా ఆలయాన్ని సందర్శిస్తారని అన్నారు. ఆయన వెంట చిట్యాల సిఐ మల్లేష్, భూపాలపల్లి సిఐ దొమ్మాటి నరేష్ కుమార్ గౌడ్ గణపురం ఎస్ఐ రేఖ అశోక్ తదితరులు ఉన్నారు.

## యాదవ విద్యవంతులు రాజ్యాధికారం సాధించేలా ఎదగాలి

- **వైఐఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు చలకాని వెంకట్ యాదవ్**



**మహబూబాబాద్ బ్యూరో, మే 20 (జనం సాక్షి) :** మహబూబాబాద్ జిల్లా యాదవ విద్యావంతుల వేదిక జిల్లా అధ్యక్షులు సందకృష్ణ యాదవ్ ఆధ్వర్యంలో సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర అధ్యక్షుడు చలకాని వెంకట్ యాదవ్ హాజరై మాట్లాడుతూ యాదవుల యొక్క రాజకీయ మరియు రాజ్యాధికారం ఎలా సాధించాలి అనే దానిపై మన యాదవ విద్య వంతులు యాదవ సమాజానికి అవగాహన కలిగించాలని తెలిపారు. అలాగే ఈ సమావేశంలో వల్లబ కొమురయ్య విగ్రహావిష్కరణ తొర్రూరులో ఏర్పాటు చేయాలని, దీనికిగాను వెయ్యి మంది యాదవులతో ర్యాలీ నిర్వహించాలని, యాదవుల విద్య వంతుల వేదిక యొక్క మహబూబాబాద్ జిల్లా కమిటీని పూర్తిస్థాయిలో ప్రకటించడం వంటి తీర్మానాలు చేశారు. ఈ కార్యక్రమంలో కొంపెల్లి వెంకటయ్య యాదవ్, వల్లపు మధుసూదన్ యాదవ్, రాచగొల్ల సత్యం యాదవ్, దూదిమెట్ల మహేందర్ యాదవ్, ఉగ్గుల అశోక్ యాదవ్, చిన్నాల కట్టయ్య యాదవ్, చేపూరి గణేష్ యాదవ్ మరియు శ్యామ్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.


## సంపద సృష్టికర్తలు కార్మికులే..


- **కేంద్ర ప్రభుత్వం 44 కార్మిక చట్టాల రద్దుకు యత్నం**
- **నిరసనగా కేంద్రప్రభుత్వ దిష్టి బొమ్మ దగ్ధం**




**మంచిర్యాల ప్రతినిధి మే 20 (జనంసాక్షి) :** కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ దేశవ్యాప్త ఆందోళనలో భాగంగా మంచిర్యాల బస్టాండ్ ముందు వామపక్ష నాయకుల ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దగ్ధం చేశారు . ఈ సందర్భంగా ఏఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల దాసు, ఐఎఫ్టీయూ జిల్లా అధ్యక్షులు డి బ్రహ్మానందం,సిఐటియూ జిల్లా నాయకులు జి ప్రకాష్,లు మాట్లాడుతూ... దేశంలో సంపద సృష్టికర్తలు కార్మికులని గుర్తు చేశారు. సహజ వనరులను వెలికి తీసి వాటిని సంపదగా మార్చే కార్మిక వర్గం మాత్రమే సంపద సృష్టికర్తలని అలాంటి కార్మికులు పోరాడి సాధించుకున్న హక్కులను 44 కార్మిక చట్టాలను 4 కోడ్ లుగా మార్చటం కార్మిక వర్గానికి హక్కులు లేకుండా కేవలం కార్పొరేట్, వ్యాపార వర్గాలకు మాత్రమే అవి లాభదాయకమని అటువంటి 4 లేబర్ కోడ్ లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె జులై 9 న విజయవంతం చేయాలని కార్మిక వర్గాన్ని కోరారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేట్ వ్యక్తులకు ఇచ్చే విధానాలను కేంద్ర ప్రభుత్వం మానుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్టీయూ టి శ్రీనివాస్ ,ఖలీందర్ అలీ ఖాన్,మిట్టపల్లి పోలు ,దొడ్డిపట్ల రవీందర్ ,రాయమల్లు రాములు,ప్రభాకర్ సిఐటియూ రవి,రాజేందర్,సందీప్ తదితరులు పాల్గొన్నారు.

## కాళేశ్వరం స్పెషల్ ఎడ్లబండి





- **'ఎడ్ల బండి'లో వెళ్తే టికెట్ రూ.50లు**

**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో/కాళేశ్వరం, (జనంసాక్షి):** కాళేశ్వరంలో ఎడ్ల బండ్లు స్పెషల్ గా మారాయి. బండిలో డ్రాప్ చేస్తే ఒక్కరికి రూ. 50లు టికెట్ ధర తీసుకుంటున్నారు. వ్యవసాయ పనులకు మాత్రమే ఎక్కువగా ఉపయోగ పడే ఎడ్ల బండ్లు కాళేశ్వరంలో భక్తుల రాకపోకలకు ఉపయోగపడుతున్నాయి. దీంతో ఇక్కడి ఎడ్ల బండ్లకు గిరాకీ ఏర్పడింది. సరస్వతి ఘాటు చివరలో ఎడ్లబండ్లకు ప్రత్యేకంగా సెంటర్ ఏర్పాటు చేసుకున్నారు. ఆ సెంటర్ నుండి సరస్వతి నది ఒడ్డు వరకు తీసుకెళ్తే ఒక్కరికి రూ. 50లు టికెట్ ధర తీసుకుంటున్నారు. ఒక్కో ఎడ్లబండిలో నాలుగు, లేదా ఐదుగురు భక్తులు తరలివెళ్తున్నారు. దీంతో ఒక్కో ట్రిప్పుకు రూ. 200ల నుండి రూ. 250ల వరకు సంపాదిస్తున్నారు ఎడ్లబండి ఓనర్లు.



## భూ సమస్యల దరఖాస్తుల పరిష్కారంలో వేగం పెంచాలి

- **జనగామ జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్**

**స్టేషన్ ఘన్‌పూర్, మే 20 (జనంసాక్షి) :** భూ సమస్యల దరఖాస్తులన్నింటినీ క్షేత్రస్థాయిలో నిశి తంగా పరిశీలించి, ఆయా భూ సమస్యల పరిష్కారం లో వేగంపెంచి,త్వరగాపూర్తిచేయాలని జనగామ జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్ ఆదేశించారు.మంగళవారం స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గం లోని ఆర్డీఓ కార్యాల యంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) రోహిత్ సింగ్ తో కలిసి జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ భూ భారతి – రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన దరఖాస్తుల పరిష్కారంపై ప్రత్యేక ఉప కలెక్టర్లు,నియోజకవర్గ మండలాల తహసీ ల్దార్ లతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించి, పలు సూచనలుచేశారు.ఈసందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లా డుతూ రెవెన్యూ సదస్సులద్వారా ప్రతి మాడ్యూల్ లో వచ్చిన వివిధ భూసమస్యల దరఖాస్తుల పరిష్కారాని కి దిశానిర్దేశం చేశారు. ఈ మేరకు సక్సెషన్, పెండింగ్ మ్యుటేషన్, మిస్సింగ్ నంబర్, భూ సేకరణ, కోర్టు కేసు లు, డిజిటల్ సంతకం వంటి మాడ్యూల్ లలోని సమ స్యలపరిష్కారం దిశగా క్షుణ్ణంగాచర్చించారు.రెవెన్యూ సదస్సుల్లో, ప్రత్యేకంగా తహసీల్దార్ కార్యాలయానికి కలిపి ఇప్పటివరకు మొత్తం1900 దరఖాస్తులు వచ్చా యని కలెక్టర్ తెలిపారు. ఈ సమీక్ష సమావేశంలో ప్రత్యేక ఉప కలెక్టర్లు సుహాసిని, హనుమాన్ నాయక్, స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గంలోని అన్నిమండలాల తహసీల్దార్ లు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా ప్రధాన ఆస్పత్రిలో కలెక్టర్ ఆకస్మిక తనిఖీ



**మహబూబాబాద్ బ్యూరో, మే 20(జనం సాక్షి):** మంగళవారం జిల్లా కలెక్టర్ మహబూబాబాద్ పట్టణంలోని ప్రధాన ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆస్పత్రిలోని ఆరోగ్యశ్రీ బ్లాక్, యూరాలజీ బ్లాక్, జనరల్ వార్డ్, పరిసరాలను, హాస్పటల్ ఇన్ పేషెంట్, ఔట్ పేషంట్, డాక్టర్స్ సిబ్బంది హాజరు పట్టికలను పరిశీలించారు. ఆస్పత్రికి వస్తున్న పేషెంట్లకు అందిస్తున్న సేవల వివరాలు సూపర్డెంట్ డాక్టర్ శ్రీనివాస్ ఆర్ఎంఓ డాక్టర్ జగదీష్‌లను అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రిలో వైద్యులు ప్రజలకు అందుబాటులో ఉంటూ నిరంతరం సేవలు అందించాలని, హాస్పిటల్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. సదరం క్యాంపుల నిర్వహణ (వైద్య పరీక్షల) కోసం ఆస్పత్రిలో అనువైన ప్రదేశంలో వారి కి సేవలు అందించడానికి యుఐడి (బ్లాక్) నిర్మాణ ప్రతిపాదిత స్థలాన్ని పరిశీలించారు. స్పెషలైజేషన్ మానసిక, కంటి, చెవి, ముక్కు, దంతాల, విభాగం తదితర వినికిడి లోపం ఉన్న వారిని పరీక్షల కోసం తగిన ఏర్పాట్లను చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఆసుపత్రికి వచ్చే పేషెంట్,లకు ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్ ద్వారా స్వచ్ఛమైన పదార్థాలను అందించాల న్నారు, ఆస్పత్రిలో పార్కింగ్, వైద్య విభాగాలు, సానిటేషన్ నిర్వహణ తదితరాంశాలపై కలెక్టర్ తగు సూచనలు చేశారు. కలెక్టర్ వెంట డిఆర్డిఓ ప్రాజెక్ట్ డైరెక్టర్ మధుసూదన రాజు, డిఈ, ఏఈ, శంకర్, సంబంధిత విభాగాల సిబ్బంది ఉన్నారు.

## బిఆర్ఎస్ పార్టీ కార్యకర్తలకు రుణపడి ఉంటా

- **మాజీ శాసనసభ్యులు బానోత్ శంకర్ నాయక్**



**మహబూబాబాద్ ప్రతినిధి, మే 20 (జనం సాక్షి) :** మంగళవారం బిఆర్ఎస్ పార్టీ క్యాంపు కార్యాలయంలో మహబూబాబాద్ నియోజకవర్గ వ్యాప్తంగా గూడూరు మహబూబాబాద్ నెల్లికుదురు కేసముద్రం మండలాలలో తన పుట్టినరోజు సందర్భంగా అన్నదానం రక్తదానం కార్యక్రమాలు నిర్వహించి కేకులు కట్ చేసి టపాసులు పేల్చి ఉత్సాహం నిర్వహించిన మానుకోట ప్రజలకు పార్టీ కార్యకర్తలకు రాజకీయ నాయకులకు మాజీ ప్రజా ప్రతినిధులు సర్పంచులు ఎంపీటీసీలు జడ్పిటిసిలు కౌన్సిలర్లు పార్టీ శ్రేణులకు జీవితాంతం రుణపడి ఉంటానని మానుకోట నియోజకవర్గ బిఆర్ఎస్ పార్టీ కార్యకర్తలకు కంటికి రెప్పలా కాపాడుకొని మీసేవకుడిగా మీకోసం నిత్యం ప్రజలలోనే ఉంటానని హామీ ఇస్తూ పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేసిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలియజేయడం జరిగింది

## రాపోకలకు ఇబ్బంది లేకుండా రోడ్డు పనులు



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో/కాళేశ్వరం (జనంసాక్షి):** రాపోకలకు ఇబ్బంది లేకుండా అధికారులు సోమవారం రాత్రి రోడ్డు పనులు నిర్వహించారు. పొద్దంతా భక్తులు, వాహనాల రాకపోకలు కొనసాగుతున్నందున రాత్రి మరమ్మతు పనులు చేపట్టి, రోడ్డు బాగు చేశారు. వర్షం పడితే రవాణాకు ఇబ్బంది లేకుండా ఉండేందుకు గాను ఆది ముక్తీశ్వర స్వామి దేవాలయం క్రాస్ రోడ్డు నుండి విఐపి ఘాట్ రహదారి వరకు ఈ నిర్మాణ పనులు జరిగాయి.

# వంద పడకల ఆసుపత్రిని సందర్శించిన జిల్లా కలెక్టర్

- గతం కంటే ఇప్పుడు రోగుల సంఖ్య గణనీయంగా పెరిగింది- పాయం
- ప్రభుత్వ ఆసుపత్రి లో 57 మందికి సాధారణ కాన్పులు
- మూడు నెలల్లో 57 నుంచి 578 కి పెరిగిన ఓపీ...
- ఆసుపత్రి వైద్యులను, వైద్య సిబ్బంది నీ అభినందించిన కలెక్టర్..



**మణుగూరు, మే 20 (జనం సాక్షి) :** వైద్యం కోసం వచ్చిన రోగులను కుటుంబ సభ్యుల ఆదరించాలని భద్రాద్రి జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ అన్నారు. మంగళవారం మణుగూరు వంద పడకల ఆసుపత్రి ని సందర్శించి హాస్పిటల్ సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... మణుగూరు వంద పడకల ఆసుపత్రిలో గతం కంటే ఇప్పుడు రోగుల సంఖ్య గణనీయంగా పెరిగిందన్నారు. వైద్యులు వైద్య సిబ్బందితో జరిపిన సమావేశములో వైద్యులు నర్స్ శానిటైజ్ , సిబ్బంది రోగులను ప్రేమతో ఆదరించాలని, మీ ఆదరణ మంచి పలకరింపు తోనే రోగులకు సగం జబ్బు నయం అవ్వాలని సూచించటం జరిగింది. అలాగే వారికో మెరుగైన వైద్యం అందించాలని తెలిపారు. మణుగూరు ప్రభుత్వ హాస్పిటల్ లో వైద్య సిబ్బంది ప్రజలకు మెరుగైన వైద్యం అందిస్తున్నారు అని ఇదేవిధంగా ప్రజలకు మంచి సర్వీస్ అందిస్తూ ప్రజల ఆదరణ పొందాలని సిబ్బందిని అభినందించారు. గత రెండు నెలల నుంచి ప్రతిరోజు 97 ఓపీ సంఖ్య క్రమ క్రమంగా 500కీ పైగా పెరిగిందని, ప్రజలకు ప్రభుత్వ ఆసుపత్రి పై పూర్తి నమ్మకం కలిగే విధంగా సర్వీస్ అందిస్తున్నారని అన్నారు. గైనకాలజిస్ట్ వచ్చిన తర్వాత 57 మంది గర్భిణీ స్త్రీలకు ఆపరేషన్ లేకుండా సాధారణ ప్రసవాలు చేయడం జరిగిందని తల్లి బిడ్డ క్షేమంగా ఉన్నారని అన్నారు. ఇదే పద్ధతిలో మరెన్నో సాధారణ ప్రసవాలు చేసి హాస్పిటల్ కి ప్రభుత్వానికి మంచి పేరు తేవాలన్నారు. ప్రతిరోజు శానిటైజ్ కార్మికులు హాస్పటల్ ను సొంత ఇంటిలాగా చూసుకోవాలని ప్రతిక్షణం శుభ్రపరుస్తూ మెరుగైన సేవలు అందించాలని తెలిపారు. సిబ్బంది పేషంట్లపై చులకన భావంతో ప్రవర్తిస్తే సహించేది లేదని అటువంటి వారిపై చర్యలు తప్పవని సూచించారు. హాస్పిటల్ కి సంబంధించి ఏ సమస్య ఉన్న తన దృష్టికి తీసుకురావాలని ఆ సమస్య పరిష్కారం కోసం కృషి చేస్తామని తెలిపారు. ఎమ్మెల్యే పాయం మాట్లాడుతూ పేదవారు ఎక్కువగా ఉన్న ఏజెన్సీ ప్రాంతంలో ప్రభుత్వ ఆసుపత్రిలో మెరుగైన వైద్యం అందించాలని ఉద్దేశ్యంతో కాంగ్రెస్ ప్రభుత్వం సహకరించటంలో ముందుంటుందని అన్నారు. గతంలో లేని విధంగా 8 మంది వైద్యులను నియమించటం జరిగిందన్నారు. ఓపీ ఫిబ్రవరిలో 89, మార్చిలో 464, ఏప్రిల్‌లో 578కి పెరిగింది. అలాగే ఐపి ఫిబ్రవరిలో 8, మార్చిలో 92, ఏప్రిల్‌లో 97కి పెరిగిందన్నారు. చిన్న పిల్లల, ఆర్థోఫిడిక్ వైద్యులు నియమించాలి, ఐ సి యు ఏర్పాటు చేయాల్సి ఉందన్నారు. ఆసుపత్రికి సంబంధించిన సివిల్ వర్క్ గురించి మాట్లాడటం జరిగిందన్నారు. ప్రవేట్ ఆసుపత్రి ధీటుగా ప్రభుత్వ ఆసుపత్రి మెరుగైన సేవలు అందించాలని తెలిపారు. ఈ కార్యక్రమానికి భద్రాద్రి కొత్తగూడెం జిల్లా డిసిహెచ్, ఎస్. రవిబాబు, మణుగూరు ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ సునీల్, హాస్పటల్ సిబ్బంది, మణుగూరు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పిరినాకి నవీన్, పట్టణ అధ్యక్షులు, శివ, సైదులు, నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు తరుణ్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు, యువజన నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోలు వేగవంతం చేయాలి

- జిల్లా కలెక్టర్ తేజస్ నందన్ లాల్ పవార్



**తుంగతుర్తి, మే 20 (జనం సాక్షి) :** ధాన్యం కొనుగోలు వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ తేజస్ నందన్ లాల్ పవార్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ఐకెపి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఐకెపి నిర్వాహకులతో మాట్లాడుతూ ధాన్యం మాశ్చరైజేషన్ వచ్చిన వెంటనే కాంటాలు వేసి మిల్లులకు తరలించాలని అన్నారు. ఇటీవల కురుస్తున్న భారీ వర్షాల వల్ల రైతులకు ఇబ్బందులు పడకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని నిర్వాహకులకు ఆదేశించారు. ఐకెపి సెంటర్లో ఇంకా ఏమైనా సమస్యలు ఉంటే వెంటనే అధికారుల దృష్టికి తీసుకువెళ్లి సమస్యను పరిష్కరించుకోవాలన్నారు. అవసరమైతే కూలీలను పెంచుకొని ధాన్యాన్ని కాంటాలు వేసి మిల్లులకు తరలించాలన్నారు కలెక్టర్ వెంట స్థానిక తహసిల్దార్ దయానందం రెవిన్యూ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్ ఐకెపి నిర్వాహకులు రైతులు పాల్గొన్నారు.

## పార్టీని బలోపేతం చేసి స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయం సాధించాలి

- కాంగ్రెస్ పార్టీ శ్రేణులకు మంత్రి పొన్నం ప్రభాకర్ పిలుపు



**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి, మే 20 (జనంసాక్షి) :** కాంగ్రెస్ పార్టీ అధిష్టానం ఆదేశాల మేరకు వేములవాడ పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్ లో మంగళవారం వేములవాడ నియోజకవర్గ స్థాయి బ్లాక్ కాంగ్రెస్ పార్టీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తో పాటు ప్రభుత్వ విప్ వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, పీసీసీ పరిశీలకులు పక్రుద్దిన్,కృష్ణా రెడ్డి,జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నాగుల సత్యనారాయణ గౌడ్, మండల,బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు,మార్కెట్ కమిటీ చైర్మన్లు,ఇతర ముఖ్య నేతలు హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ తెలంగాణ వ్యాప్తంగా నూతనంగా ఏఐసిసి సెక్రటరీ గతంలో ఎన్ఎస్యుఐ అధ్యక్షురాలిగా,పార్లమెంట్ సభ్యురాలిగా,ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీ తెలంగాణ ఇన్చార్జిగా పని చేస్తున్న మీనాక్షి నటరాజన్ క్షేత్ర స్థాయిలో పార్టీ స్థానిక సంస్థల్లో విజయం సాధించాలనే ఉద్దేశంతో పార్టీ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారన్నారు. ఎవరైతే గ్రామ కాంగ్రెస్ పార్టీని నడపగలుగుతారో అలాంటి వారినే గ్రామ శాఖ అధ్యక్షులుగా ఎన్నుకోవాలని సూచించారు. మండల అధ్యక్షులుగా సమష్టిగా నిర్ణయం తీసుకోవాలన్నారు. మీ అందరి కృషి శ్రమతో తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న కార్యక్రమాలు ప్రతి ఇంటికి తీసుకుపోయి అన్ని ఎన్నికల్లో పార్టీ గెలిచేలా బాధ్యత మీదనీ, గ్రామ, మండల, జిల్లా కాంగ్రెస్ నేతలు పార్టీ అధికారంలోకి రావడానికి ఎలా కష్టపడ్డారో ఇప్పుడు అలాగే క్షేత్ర స్థాయిలో పార్టీ కార్యక్రమాలు తీసుకుపోయి త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. మండలాలు, గ్రామాల్లో పార్టీ పునఃనిర్మాణం జరగాలనీ, అనుబంధ సంఘాలు,యువజన సంఘాలు బలోపేతం కావాలన్నారు. వేములవాడ రాజరాజేశ్వర స్వామి ఆశీర్వాదంతో ఆలయం అభివృద్ధి చేస్తున్నామని,కానీ కొంతమంది ప్రతిదీ రాజకీయం చేసే ప్రయత్నం చేస్తున్నారని, ఆలయ అభివృద్ధి శృంగేరి పీఠాధిపతి చెప్పిన సలహాల మేరకే జరుగుతుందని, ఇందులో ఎవరి వ్యక్తిగత రాజకీయ అవకాశాలు లేవన్నారు. ఆలయ అభివృద్ధితో వ్యాపారులను ఇబ్బందులు పెట్టాలని తమకు లేదనీ, పూజ కార్యక్రమాలకు ఇబ్బందులు లేవనీ స్పష్టం చేశారు. భక్తుల మనోభావాలు మేరకే ఆలయ అభివృద్ధి జరుగుతుందనీ ఈ విషయాన్ని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలనీ పార్టీ శ్రేణులకు సూచించారు. ఈ సమావేశంలో నియోజకవర్గ పరిధిలోని కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి

- టార్పాలిన్లు అందుబాటులో ఉంచాలి
- మిల్లర్లు ధాన్యం దిగుమతిలో జాప్యం చేయవద్దు
- జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్

**సూర్యాపేట ప్రతినిధి, మే 20 (జనంసాక్షి) :** ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అన్నారు. మంగళవారం నూతనకల్,తుంగతుర్తి, మద్దిరాల మండలం పోలుమళ్ళ, రామచంద్రపురం జాజిరెడ్డిగూడెం మండలంలోని అర్వపల్లి,తిమ్మాపురం – 2, సూర్యాపేట మండలం ఎర్కారం కొనుగోలు కేంద్రాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధాన్యంలో తాలు, గడ్డి లేకుండా తూర్పులా పోస్తేనే ధాన్యం నాణ్యతగా ఉంటాయని అన్నారు. అకాల వర్షాలకు వడ్లు తడవకుండా టార్పాలిన్లు అందుబాటులో ఉంచుకోవాలని, ఎక్కువ మంది హమాలీలను ఏర్పాటు చేసుకొని కాంటా వేయగానే వెంటనే ధాన్యం లారీలకు లోడ్ చేయాలని తెలిపారు. లారీలను సర్దుబాటు చేస్తామని, అందుబాటులో ఉన్న లారీలను సర్దుబాటు చేసుకోవాలని సాధ్యమైనంత తొందరగా కేంద్రాలలో ఉన్న మొత్తం ధాన్యం కొనుగోలు చేసి కొనుగోలు కేంద్రాలను మూసివేయాలని సూచించారు. రైతులతో మాట్లాడుతూ రెండు మూడు రోజులలో అన్ని కొనుగోలు కేంద్రాలలో ధాన్యం పూర్తిగా కొనుగోలు చేస్తామని రైతులకి భరోసానిచ్చారు. ఆయా కేంద్రాలలో రికార్డులను పరిశీలించి ఎన్ని లోడ్లు తరలించారు, ఇంకా ఎన్ని లోడ్లకి సరిపోను ధాన్యం కొనుగోలు కేంద్రాలలో ఉందని నిర్వాహకులని అడిగి తెలుసుకున్నారు. నూతనకల్ ఐకేపీ నుండి 8145 క్వింటాల్, మద్దిరాల నుండి 4500 క్వింటాళ్ళు, జాజి రెడిగూడెం మండలం అర్వపల్లి ఎన్ డీసీఎం నుండి 8000 క్వింటాలు, ఐకేపీ తిమ్మాపురం నుండి 8400 క్వింటాలు, తుంగతుర్తి ఉమెన్స్ ఫార్మర్ ప్రొడ్యూసర్ కంపెనీ నుండి 6200 క్వింటాలు, సూర్యాపేట మండలం ఎర్కారం పిఏసీఎస్ నుండి 21400 క్వింటాలు ధాన్యం మిల్లులకి ఎగుమతి చేయటం జరిగిందని తెలిపారు. సూర్యాపేట మండలం బాలెంలలోని వజ్ర రైస్ ఇండస్ట్రీస్, పెన్ పహాడ్ మండలం మాచారంలోని వెంకటసాయి రైస్ ఇండస్ట్రీస్ ను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మిల్లర్లు ఎక్కువ మంది హమాలీలను ఏర్పాటు చేసుకొని ఎప్పటికప్పుడు జాప్యం చేయకుండా ధాన్యం దిగుమతి చేసుకోని అన్నారు. లారీలను ధాన్యం కొనుగోలు కేంద్రాలకి పంపాలని ఆదేశించారు. ఈ కార్యక్రమం లో సివిల్ సప్లై కార్పొరేషన్ డియం ప్రసాద్, తహసీల్దార్లు శ్రీనివాసరావు, అమీన్ సింగ్, రాంప్రసాద్,లాల్ నాయక్, ఎంపిడిఓ సునీత, ఎఓ మురళి బాబు, ఏపియం రాంబాబు, ఏఈఓ సత్యం, ఇంచార్జిలు నాగార్జున, ముత్తయ్య,సురేష్,సంఘం సభ్యులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.



## మూడేళ్లలో ఎస్ఎల్‌బీసీ సొరంగం పనులు పూర్తి చేస్తా..

- మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి



**కనగల్లు, మే 20 (జనం సాక్షి) :** వచ్చే మూడేళ్లలో ఎస్ఎల్బీసీ సొరంగం పనులను పూర్తిచేసి జిల్లా ప్రజల రుణం తీర్చుకుంటానని రాష్ట్ర రోడ్లు, భవనముల, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని జి ఎడవల్లి గ్రామంలోని చెరువు తూము మరమతుల పనులకు కలెక్టర్ ఇలా త్రిపాఠితో కలిసి శంకుస్థాపన చేశారు. అనంతరం ఏర్పాటుచేసిన సభలో మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో పెండింగ్ ప్రాజెక్టుల పనులను సకాలంలో పూర్తిచేసి రైతాంగానికి సాగునీరు అందించడం జరుగుతుందన్నారు. గ్రామాలలో పేర్కుపోయిన సిసి రోడ్లు, డ్రైనేజీలను నిర్మించి ప్రజల సమస్యలు తీరుస్తానని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఇన్చార్జి జాయింట్ కలెక్టర్ నారాయణ అమిత్, ఆర్డీవో అశోక్ రెడ్డి, తహిశిల్దర్ బి పద్మ, ఆర్టిఏ జిల్లా సభ్యుడు కే రాజారెడ్డి, గిర్దావర్లు సునీత, మర్రి యాదగిరి, ఎల్లమ్మ గుడి చైర్మన్ సిహెచ్ వెంకట్ రెడ్డి మండలపార్టీ అధ్యక్షులు అనుపు రెడ్డి, మాజీ సర్పంచులు జి నరసింహ, గోలి నర్సిరెడ్డి, ప్రజాప్రతినిధులు, గ్రామప్రజలు పాల్గొన్నారు.

## వైద్యుల పనితీరు మార్చుకోకపోతే చర్యలు తప్పవు



**బూర్గంపహాడ్, మే 20 (జనంసాక్షి) :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, బూర్గంపహాడ్ మండల కేంద్రం లో ఉన్న సిహెచ్ సి ప్రభుత్వ వైద్యశాలలో సిబ్బంది తీరు మార్చుకోకపోతే చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ హెచ్చరించారు. సామాజిక ఆరోగ్య తనిఖీ కేంద్రాన్ని మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. వైద్యులు, సిబ్బంది పనితీరుపై తీవ్ర అసహనం, ఆగ్రహం వ్యక్తం చేశారు. జిల్లాలోని ఇతర సామాజిక ఆరోగ్య కేంద్రాలతో పోల్చుకుంటే బూర్గంపహాడ్ సి హెచ్ సి పనితీరు గుండు సున్నా అని అన్నారు. ఆసుపత్రిలో వైద్యులు లేక మ్యూజియంగా మారిందని మండిపడ్డారు. పనితీరు మార్చుకోకపోతే చర్యలు తప్పవని, ఇదే చివరి హెచ్చరికని ఈసారి చర్యలు తీసుకుంటానని హెచ్చరించారు. దీంట్లో హెడ్ నర్స్ రోగులు సరిగా రావడం లేదని చెప్పే ప్రయత్నం చేశారు. దీంతో మరింత ఆగ్రహం వ్యక్తం చేస్తూ మీరు సరిగ్గా పనిచేస్తే రోగులు ఎందుకు రారని, రోగులు రావడంలేదని వైద్యశాలకు రాకుండా నిద్రపోతున్నారా.. జీతాలు సరైన సమయంలోనే తీసుకుంటున్నారు కదా అని చెప్తూ తాను కలెక్టర్‌గా విధులు నిర్వహిస్తూ నా దగ్గరకు ప్రజలు రావడం లేదని నేను ఇంట్లో పడుకుంటే సరిపోతుందా నేనే ప్రజల దగ్గరకు వెళ్లాలి అలాగే మీరు కూడా రోజులకు సరైన వైద్యం అందిస్తుంటే రోగులు సంఖ్య ఎందుకు పెరగదని ప్రశ్నించారు. ప్రతిరోజు ఏదో ఒక విధంగా వైద్యశాల కు సంబంధించి పర్యవేక్షణ చేస్తుంటానని ఎవరు నిర్లక్ష్యం వహించ వద్దని, 24 గంటలు ప్రజలకు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. వైద్యశాల సూపర్డెంట్ సరిగ్గా రాకపోతే సరిగ్గా పనిచేయకపోతే మిగతావారు ఎలా వస్తారని, ఎలా పనిచేస్తారని ప్రశ్నించారు. అనంతరం వైద్యశాల పునర్నిర్మాణ స్థలాన్ని పరిశీలించారు. సాధ్యమైనంత తొందరలో శంకుస్థాపనకు ఏర్పాటు చేయాలని ఇంజనీరింగ్ అధికారులను సంబంధిత కాంట్రాక్టర్‌కు డిసిహెచ్ఎస్ రవిబాబుకు సూచించారు.

## అంతర్జాతీయస్థాయి కరాటే పోటీలలో జిల్లా విద్యార్థినులు అద్భుత ప్రదర్శన



**పెద్దపల్లి, మే 20 : (జనం సాక్షి) :** అంతర్జాతీయ స్థాయి కరాటే పోటీలలో జిల్లా విద్యార్థినులు అద్భుత ప్రదర్శన కనబరిచారని వీరికి జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్షలి ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. మంగళవారం సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో అంతర్జాతీయ స్థాయి ఛాంపియన్షిప్ పోటీలలో అద్భుత ప్రదర్శన కనబరిచిన పెద్దపల్లి జిల్లా విద్యార్థినులను జిల్లా కలెక్టర్ అభినందించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్షలి మాట్లాడుతూ, మే 17 18 తేదీలలో ఉత్తరాఖండ్ హరిద్వార్ ఓకేనావ మార్షల్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన అంతర్జాతీయ స్థాయి కరాటే 2025 పోటీలలో పెద్దపల్లి విద్యార్థులు మంచి ప్రతిభ కనబరిచారని అన్నారు. అంతర్జాతీయ కరాటే 2025 పోటీలలో పెద్దపల్లి మహాత్మ జ్యోతిభా పూలే పాఠశాల విద్యార్థులు పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబరిచారని అన్నారు. అండర్ 14 కట్ ఆఫ్ కుమితి విభాగంలో 2 బంగారు పతకాలు, 3వెండి పతకాలు, 3 కాంస్య పతకాలు సాధించారని అన్నారు. అండర్ 14 కటాస్ కుమితి విభాగంలో టి. శరణ్య బంగారు వెండి, పతకం జి.కృష్ణవేణి బంగారు, కాస్య పథకం జీ.వైష్ణవి వెండి కాస్య పథకం టి రక్షిత వెండి కాస్య పథకం యు కీర్తన వెండి కాశ్యం పథకం సాధించడం జరిగిందని తెలిపారు. అంతర్జాతీయ స్థాయి ఛాంపియన్షిప్ పోటీలలో పాల్గొని పతకాలు సాధించిన విద్యార్థినులను కలెక్టర్ అభినందించారు. ఈ కార్యక్రమంలో కరాటే మాస్టర్ కర్ర వెంకటేష్, ప్రిన్సిపాల్ మనిదీప్తి ఇన్స్పెక్టర్ అలేఖ్య విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు.

## విద్యాప్రమాణాలు మెరుగుపరచడంలో ప్రధానోపాధ్యాయులదే కీలక పాత్ర

- జిల్లా కలెక్టర్




**కామారెడ్డి జిల్లా ప్రతినిధి, మే 20 (జనం సాక్షి) :** ప్రభుత్వ పాఠశాలలలో విద్యా ప్రమాణాలు మెరుగుపరచడంలో ప్రధానోపాధ్యాయులు కీలక పాత్ర వహించాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ అన్నారు. కామారెడ్డి జిల్లా కేంద్రంలోని దేవునిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఐదు రోజులపాటు నిర్వహించనున్న జిల్లాస్థాయి ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయుల కెపాసిటీ బిల్డింగ్ ట్రైనింగ్ శిక్షణ కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన ప్రసంగిస్తూ ప్రధానోపాధ్యాయులు ఎప్పటికప్పుడు నాయకత్వ లక్షణాలు పెంపొందించుకుంటూ నూతన బోధనా పద్ధతులను మెరుగుపరుచుకుంటూ ఉపాధ్యాయులను దిశ నిర్దేశం చేయాలని సూచించారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ తో కూడిన విద్యాబోధన విద్యార్థులకు అందజేయాలని ఆయన సూచించారు. ఇప్పటికే మొదటి దశ శిక్షణ పూర్తయిందని, రెండవ దశలో 800 మందికి మారుతున్న కాలానికి అనుగుణంగా శిక్షణ అందించడం జరుగుతున్నదని తెలిపారు. ప్రతి ప్రధానోపాధ్యాయులు సకాలంలో తల్లిదండులతో టీచర్స్ సమావేశాలు నిర్వహించాలని అన్నారు. ఈ విద్యా సంవత్సరం ప్రారంభం నాటికే పాఠ్య పుస్తకాలు, యూనిఫారం సిద్ధంగా ఉంచుకోవాలి అని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి రాజు, అకాడమిక్ మానిటరింగ్ అధికారి వేణుగోపాల్ ట్రైనింగ్ సెంటర్ ఇంచార్జి గంగా కిషన్, ఏ సీ జీ ఈ బలరాం, పరీక్షల కార్యదర్శి లింగం తదితరులు పాల్గొన్నారు.

# శ్రీలక్ష్మినరసింహస్వామి కళ్యాణం కమనీయం

- భక్తజన సంద్రోహంతో కిటకిటలాడిన దేవాలయం
- కళ్యాణంలో అధిక సంఖ్యలో పాల్గొన్న భక్తులు

**తలకొండపల్లి, మే 20 (జనంసాక్షి) :** తలకొండపల్లి మండల కేంద్రానికి ఉత్తరదిక్కు ఉన్న గుట్టపై స్వయంభువుగా వెలసిన శ్రీ లక్ష్మీనరసింహస్వామి పురాతన ఆలయాన్ని గత రెండు సంవత్సరాల క్రితం ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ సౌజన్యంతో కోట్లాది రూపాయలు వెచ్చించి పునర్ నిర్మించడం జరిగింది. శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయ ద్వితీయ వార్షికోత్సవంలో భాగంగా స్వామివారి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. మంగళవారం శ్రీశ్రీశ్రీ లక్ష్మీనరసింహస్వామి కళ్యాణం వైభోగపేతంగా గూడ శ్రీనివాసమూర్తి, ఆదిత్యుని మురళీధర శర్మల వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య పచ్చటి తోరణాలు, మంగళ వాయిద్యాలతో కమనీయంగా శ్రీ లక్ష్మీనరసింహ స్వామి వారి కళ్యాణం అంగరంగ వైభవంగా జరిపించారు. స్వామివారి కళ్యాణంలో భాగంగా స్వామి వారికి పట్టు వస్త్రాలంకరణలు, పూలు, పండ్లను తలకొండపల్లి జడ్పిటిసి ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ఉప్పల వెంకటేష్ మంజుల మరియు ఉప్పల మేఘన అఖిల్ పుణ్య దంపతులు వస్త్రాలు సమర్పించారు. వేద పండితుల మధ్య జరిగే స్వామి వారి కళ్యాణంలో పుణ్య దంపతులు ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ వెంకటేష్-ఉప్పల మంజుల మరియు ఉప్పల మేఘన అఖిల్ పుణ్య దంపతులు కూర్చుని స్వామి వారి కళ్యాణాన్ని జరిపించారు. ఆలయమంతా చూడముచ్చటగా కలర్ కలర్ లైట్లతో,రకరకాల పూలతో,పచ్చటి తోరణాలతో అలంకరించి స్వామివారి కళ్యాణాన్ని జరిపించారు. ఈ కళ్యాణాన్ని చూడడానికి వివిధ గ్రామాల నుండి తండోపతండాలుగా భక్తులు తరలివచ్చి స్వామివారి కళ్యాణాన్ని తిలకించారు. ఈ సందర్భంగా ఉప్పల చారిటేబుల్ ట్రస్ట్ చైర్మన్ ఉప్పల వెంకటేష్ మాట్లాడుతూ.. ప్రజలందరూ దైవ సేవ చేయడంతో పాటు,ప్రజాసేవ చేయడంలోనే మనశ్శాంతి లభిస్తుందని అన్నారు. తలకొండపల్లి మండల కేంద్రము నుండి ఒక కిలోమీటర్ దూరంలో 400 సంవత్సరాల చరిత్ర గల శ్రీశ్రీశ్రీ లక్ష్మీ నరసింహ స్వామి వెలుశాడనీ పూర్వీకులు చెప్పేవారనీ పేర్కొన్నారు. అలాంటి దేవాలయాన్ని పునర్నిర్మానంతో నూతన వరవడికను సృష్టిస్తూ 4,కోట్ల రూపాయలతో మండలంలో ఒక గొప్ప నాందికి శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. ప్రజలందరూ భక్తి భావంతోనే ముక్తి లభిస్తుందని నాయకులు ప్రజలకు సూచించారు. ఈ కార్యక్రమంలో తలకొండపల్లి తహసీల్దార్ నాగార్జున,డిప్యూటీ తాహసిల్దార్ సంతోష్, తలకొండపల్లి మాజీ ఎంపీపీ సిఎల్ శ్రీనివాస్ యాదవ్, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు కుమ్మరి శంకర్, తలకొండపల్లి మాజీ సర్పంచ్ లలిత జ్యోతయ్య, మండల బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు గుజ్జారి రాఘవేందర్, కటికల శేఖర్ యాదవ్, బుచ్చిబాబు, ఈశ్వర్, నరసింహ్మా, నరోత్తంరెడ్డి, బాల కుమార్, దశరథం, రవికుమార్, పోతుగంటి మల్లేష్, ఉప్పల వెంకటేష్ మిత్రమండలి యువ నాయకులు విజయ్ కుమార్, సంపత్ కుమార్, విట్టల్, కోర్ర కృష్ణ నాయక్, వెంకటేష్, నవీన్ గుప్త, మనోహర్, శ్రీను, భక్తులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.






## యూపీఎస్‌లో పెన్షన్‌పై క్లారిటీ..

- అందుబాటులోకి కాలిక్యులేటర్..

జనంసాక్షి:ప్రభుత్వ ఉద్యోగులు తమ పదవీ విరమణ అనంతరం ఎంత పెన్షన్ వస్తుందో తెలుసుకునే వెసులుబాటును కేంద్రం కల్పించింది. కొత్తగా యూపీఎస్ పెన్షన్ కాలిక్యులేటర్‌ను అందుబాటులోకి తెచ్చింది.యూనిఫైడ్ పెన్షన్ స్కీమ్ ద్వారా ఎంత పెన్షన్ వస్తుందో దీని ద్వారా తెలుసుకోవచ్చని కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ పరిధిలోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఫైనాన్షియల్ సర్వీసెస్ (డీఎఫ్ఎస్) మంగళవారం తెలిపింది. దీని ద్వారా యూపీఎస్‌తో పాటు ఎన్‌పీఎస్‌లో ఎంత పెన్షన్ వస్తుందో తెలుసుకోవచ్చని పేర్కొంది. దేన్ని ఎంచుకోవాలనే మీమాంసలో ఉన్న ఉద్యోగులకు ఇది ఉపయుక్తంగా ఉంటుందని తెలిపింది. కాలిక్యులేటర్ కోసం క్లిక్ చేయండి..కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు ఏకీకృత పింఛన్ పథకం (%ఖూూ%) తీసుకొచ్చిన సంగతి తెలిసిందే. 2004 తరవాత ప్రభుత్వ ఉద్యోగాల్లో చేరిన వారికి ప్రస్తుతం జాతీయ పింఛన్ పథకం (%చీూూ%)లో ఉన్నారు. అయితే, ఎన్‌పీఎస్‌లో చాలా తక్కువ మొత్తం పింఛన్ వస్తుందని, తమకు కూడా 2004కు ముందు ఉద్యోగులకు అమలవుతున్న పాత పింఛన్ పథకాన్నే (ఓపీఎస్‌నే) అమలుచేయాలని డిమాండ్లు వెల్లువెత్తాయి. దీంతో కేంద్రం యూపీఎస్ తీసుకొచ్చింది. పదవీ విరమణకు ముందు 12 నెలల్లో సగటు మూలవేతనం ఎంత ఉందో దానిలో 50 శాతాన్ని ఈ పథకం కింద పింఛనుగా అందిస్తారు. ప్రస్తుతం నేషనల్ పెన్షన్ సిస్టమ్‌లో ఉన్న వారికి యూపీఎస్‌లోకి మారేందుకు వెసులుబాటు కల్పించింది. ఇందుకు మూడు నెలల గడువు ఇచ్చింది. ఈ నేపథ్యంలో ఏది ఎంచుకోవాలనే దానిపై స్పష్టత తెచ్చుకునేందుకు ఉద్యోగులకు కాలిక్యులేటర్‌ను అందుబాటులోకి తెచ్చింది.

## ఎయిర్‌టెల్ యూజర్లకు గుడ్‌న్యూస్

- ఉచితంగా 100 జీబీ క్లౌడ్ స్టోరేజీ


జనంసాక్షి:ప్రముఖ టెలికాం సంస్థ భారతీ ఎయిర్‌టెల్ తన యూజర్లకు గుడ్‌న్యూస్ చెప్పింది. గూగుల్ వన్ క్లౌడ్ స్టోరేజ్ సబ్‌స్క్రిప్షన్ సేవల్ని యూజర్లకు ఉచితంగా అందించనున్నట్లు తెలిపింది.దీని కోసం గూగుల్‌తో జట్టుకట్టినట్లు వెల్లడించింది. పోస్ట్ పెయిడ్, వైఫై కస్టమర్లకు అదనపు స్టోరేజీ అందించాలనే లక్ష్యంతో ఈ చర్యలు చేపట్టినట్లు పేర్కొంది. గూగుల్ వన్ సబ్‌స్క్రిప్షన్ కింద ఎయిర్‌టెల్ పోస్ట్ పెయిడ్, వైఫై కస్టమర్లు అదనపు ఖర్చు లేకుండా ఆరు నెలలకు 100జీబీ గూగుల్ వన్ క్లౌడ్ స్టోరేజ్‌ను అందించనుంది. అయితే ఈ స్టోరేజ్‌ను ఐదుగురు వ్యక్తులతో పంచుకొనే సదుపాయాన్ని టెలికాం అందిస్తోంది. అర్హులైన కస్టమర్లు ఎయిర్‌టెల్ థ్యాంక్స్ యాప్‌లో లాగిన్ అయి ఈ ప్రయోజనాల్ని పొందొచ్చు. అయితే ఆరు నెలల తర్వాత స్టోరేజ్ కావాలంటే డబ్బు ఖర్చు చేయాల్సిందే. నెలకు రూ.125 వెచ్చించాల్సి ఉంటుంది. ఈ క్లౌడ్ స్టోరేజీ సదుపాయం ఆండ్రాయిడ్, ఐఓఎస్ యూజర్లు వినియోగించుకోవచ్చు. గూగుల్‌తో కలిసి ఈ సేవల్ని తీసుకురావడం ఆనందంగా ఉందని ఎయిర్‌టెల్ సీఈఓ సిద్ధార్థ్ శర్మ అన్నారు. టెలికాం సంస్థ జియో కూడా ఎంపిక చేసిన ప్రీపెయిడ్, పోస్ట్ పెయిడ్ ప్లాన్లపై 50జీబీ క్లౌడ్ స్టోరేజీని ఉచితంగా అందిస్తోంది. రూ.299, అంతకంటే ఎక్కువ మొత్తంతో రీఛార్జి చేసుకున్న వారికి ఈ క్లౌడ్ స్టోరేజీని ఇస్తోంది. అంతకంటే తక్కువ మొత్తం రీఛార్జి చేసిన వారికి 5 జీబీ డేటా మాత్రమే ఫ్రీ ట్రయల్ రూపంలో లభిస్తోంది.

## హర్యానాలో సుజుకీ మోటార్ సైకిల్ ప్లాంట్

జనంసాక్షి:ప్రముఖ గ్లోబల్ ద్విచక్ర వాహన తయారీ సంస్థ 'సుజుకీ మోటార్ సైకిల్ ఇండియా' మంగళవారం హర్యానాలోని ఖారోడాలో వాహన తయారీ ప్లాంట్‌కు పునాది రాయి వేసింది.దీన్ని రూ.1,200 కోట్ల ప్రారంభ పెట్టుబడితో అభివృద్ధి చేయాలని భావిస్తోంది. ఇండస్ట్రియల్ టౌన్‌షిప్‌లో 100 ఎకరాల విస్తీర్ణంలో ఈ కొత్త తయారీ ప్లాంట్‌ను ఏర్పాటు చేస్తుంది. మొదటి దశలో ఏటా 7.50 లక్షల ద్విచక్ర వాహనాలను ఉత్పత్తి చేయగల సామర్థ్యంతో కంపెనీ దీన్ని ఏర్పాటు చేస్తుంది. పెరుగుతున్న దేశీయ డిమాండ్‌ను తీర్చడానికి, స్థానిక అభివృద్ధి, ఉద్యోగ సృష్టికి మద్దతు ఇవ్వడానికి కంపెనీ వ్యూహంలో ఇది ఒక భాగమని కంపెనీ ఒక ప్రకటనలో తెలిపింది. ఈ ప్లాంట్ 2027లో తన కార్యకలాపాలను ప్రారంభించనుంది. ఇది దేశంలో సుజుకీ మోటార్ సైకిల్ ఉత్పత్తి సామర్థ్యాలను మరింత పెంచుతుందని కంపెనీ తెలిపింది.

# భారీ నష్టాల్లో సూచీలు

- సెన్సెక్స్ 873 పాయింట్లు డౌన్..
- 24,700 దిగువకు నిఫ్టీ



జనంసాక్షి:దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు భారీ నష్టాల్లో ముగిశాయి. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి బలహీన సంకేతాలు, విదేశీ సంస్థాగత మదుపర్ల విక్రయాలు సెంటిమెంట్‌ను దెబ్బతీశాయి.గరిష్ఠాల వద్ద లాభాల స్వీకరణ దీనికి తోడైంది. ఆరంభంలో లాభాల్లో కదలాడిన సూచీలు.. తర్వాత భారీ నష్టాలను మూటగట్టుకున్నాయి. సెన్సెక్స్ 800 పాయింట్లకు పైగా నష్టపోగా.. నిఫ్టీ 24,700 దిగువకు చేరింది. నిఫ్టీ ఆటో సూచీ 2 శాతానికి పైగా నష్టపోగా.. నిఫ్టీ బ్యాంక్, ఫైనాన్షియల్ సర్వీసెస్, ఎఫ్ఎంసీజీ షేర్లు 1 శాతానికి పైగా నష్టపోయాయి. మిడ్‌క్యాప్ 100 సూచీ 1.62 శాతం, స్మాల్‌క్యాప్ సూచీ 0.94 శాతం చొప్పున క్షీణించాయి. బీఎస్ఈలో నమోదిత కంపెనీల మొత్తం విలువ దాదాపు రూ.3.50 లక్షలు క్షీణించి రూ.440.23 లక్షల కోట్లకు చేరింది.సెన్సెక్స్ ఉదయం 82,116.17 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 82,059.42) లాభాల్లో ప్రారంభమైంది. కాసేపటికే నష్టాల్లోకి జారుకుంది. ఇంట్రాడేలో 81,153.70 వద్ద కనిష్ఠాన్ని తాకిన సూచీ.. చివరికి 872.98 పాయింట్ల నష్టంతో 81,186.44 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 261.55 పాయింట్ల నష్టంతో 24,683.90 వద్ద ముగిసింది. డాలరుతో రూపాయి మారకం విలువ 85.63గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో టాటా స్టీల్, ఇన్ఫోసిస్, ఐటీసీ షేర్లు మినహా మిగిలిన అన్ని షేర్లు నష్టాల్లో ముగిశాయి. ఎటర్నల్, మారుతీ సుజుకీ, మహీంద్రా అండ్ మహీంద్రా, అల్ట్రాటెక్ సిమెంట్, పవర్‌గ్రిడ్ కార్పొరేషన్ షేర్లు ప్రధానంగా నష్టపోయాయి.

**కారణాలు ఇవే..**

అమెరికా ప్రభుత్వ అప్పులపై ఆందోళన నేపథ్యంలో యూఎస్ క్రెడిట్ రేటింగ్‌ను మూడీస్ డౌన్‌గ్రేడ్ చేసింది. దీంతో అక్కడి 30 ఏళ్ల బాండ్ రాబడులు 2023 నవంబర్ తర్వాత గరిష్ఠ స్థాయి అయిన 5.03 శాతానికి చేరాయి. బాండ్ రాబడులు పెరగడంతో భారత్ వంటి వర్ధమాన దేశాల మార్కెట్లకు లిక్విడిటీ తగ్గొచ్చన్న భయాలతో మన మార్కెట్లు పడ్డాయి.గత కొన్ని రోజులుగా కొనుగోళ్లవైపు మొగ్గుచూపిన విదేశీ సంస్థాగత మదుపర్లు మే 19న అమ్మకాలకు దిగారు. రూ.526 కోట్ల విలువైన షేర్లను విక్రయించారు. దేశీయ సంస్థాగత మదుపర్లు సైతం రూ.238 కోట్లు విలువైన షేర్లను విక్రయించారు.భారత్-పాక్ మధ్య కుదిరిన కాల్పుల విరమణ ఒప్పందం అనంతరం స్టాక్ మార్కెట్ సూచీలు దూసుకెళ్లాయి. ఈ నేపథ్యంలో 4 శాతం మేర లాభపడ్డాయి. ఈ క్రమంలో మదుపర్లు లాభాల స్వీకరణకు దిగడం అమ్మకాల ఒత్తిడి కనిపించింది.ముఖ్యంగా హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, రిలయన్స్ ఇండస్ట్రీస్, ఐసీఐసీఐ బ్యాంక్, మారుతీ వంటి లార్జ్‌క్యాప్ స్టాక్స్‌లో అమ్మకాలు సూచీలపై ఒత్తిడి పెంచాయి.మళ్లీ కొవిడ్ కేసులు పెరుగుతుండడం కూడా మార్కెట్ సెంటిమెంట్‌ను ప్రభావితం చేసింది. ముఖ్యంగా హాంకాంగ్, సింగపూర్‌లో పెద్ద సంఖ్యలో కేసులు నమోదవుతున్నాయి. భారత్‌లోని దక్షిణాది రాష్ట్రాల్లో కొత్తగా కొవిడ్ కేసులు నమోదు కావడమూ మార్కెట్ నెగటివ్‌గా తీసుకుందని అనలిస్టులు భావిస్తున్నారు.

# అమెరికాకు వెళ్తున్నారా.. జాగ్రత్త!

**ఈ వస్తువులను లగేజీలో తీసుకెళ్లొద్దు!**



జనంసాక్షి:విమానాల్లో ప్రమాదాల నివారణే లక్ష్యంగా అమెరికా రవాణా భద్రతా సంస్థ కీలక నిర్ణ యం తీసుకుంది. విమాన ప్ర యాణాన్ని సురక్షితంగా మార్చ డంతో పాటు భద్రతా చర్యలను మరింత కట్టడి చేసేందుకు ట్రాన్స్‌పోర్ట్ సెక్యూరిటీ అడ్మిని స్ట్రేషన్ ఫెడరల్ ఏవియేషన్ అడ్మినిస్ట్రేషన్ తో కలిసి కొత్త నియమాల్ని తీసుకొచ్చింది.ఇందులో భాగంగా అమెరికా విమానాల్లో చెక్- ఇన్ లగేజీలో లిథియం బ్యాటరీతో నడిచే ఏడు రకాల వస్తువులపై నిషేధం విధించారు. ఇటీవల వాణిజ్య విమానాల్లో జరుగుతున్న అగ్ని ప్రమాదాలను దృష్టిలో పెట్టుకుని ఈ నిర్ణయం తీసుకుంది. ఇకపై వీటిని క్యారీ- ఆన్ లగేజీలో తీసుకెళ్లే వెసులుబాటు ఉంది.లిథియం బ్యాటరీలకు వేడెక్కే స్వభావం ఉంటుందని ఎఫ్ఏఏ తన మార్గదర్శకాల్లో పేర్కొంది. దీనివల్ల 'థర్మల్ రన్ అవే' అనే ప్రమాదకరమైన రసాయన రియాక్షన్‌కు కారణమవుతుందని వెల్లడించింది. ఓవర్ ఛార్జింగ్, సరిగ్గా ప్యాక్ చేయకపోవడం లేదా తయారీలో లోపాల కారణంగా ఇటువంటి ప్రమాదాలు జరుగుతాయని తెలిపింది. ముఖ్యంగా విమానంలోని కార్గోలో ఉన్నప్పుడు ప్రమాదానికి ఆస్కారం ఎక్కువ, దీనివల్ల ఇతర బ్యాటరీలకు వేగంగా వ్యాపించి తీవ్రమైన అగ్ని ప్రమాదం సంభవించొచ్చని పేర్కొంది. ఈ నేపథ్యంలో పైన పేర్కొన్న వస్తువుల్ని తీసుకెళ్లేందుకు వీలుండదు. వాటిని క్యారీ- ఆన్ లగేజీలో మాత్రమే తీసుకెళ్లాల్సి ఉంటుంది.2025 జనవరిలో ఎయిర్ బూసాన్ ఫ్లైట్ 391లో పవర్ బ్యాటరీ కారణంగా వ్యాపించిన మంటల్లో చిక్కుకుని ఏడుగురు ప్రయాణికులు గాయపడ్డారు. 2024 నవంబర్‌లో విమానం గాల్లో ఉండగా.. ఓ ప్రయాణికుడి ఫోన్ పేలడంతో సిబ్బంది తోటి ప్రయాణికుల్ని అప్రమత్తం చేశారు. దీంతో విమానంలో కాసేపు గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి. ఇలాంటి ప్రమాదాల నేపథ్యంలో లిథియం అయాన్ బ్యాటరీతో రూపొందించిన ఏడు వస్తువులను లగేజీలో తీసుకెళ్లడంపై బ్యాన్ విధించడం గమనార్హం.

**నిషేధం వీటిపైనే..**

పవర్ బ్యాంక్‌లు, సెల్‌ఫోన్ బ్యాటరీ ఛార్జింగ్ కేస్‌లు, స్పేర్ లిథియం- అయాన్ బ్యాటరీలు, స్పేర్ లిథియం- మెటల్ బ్యాటరీలు, సెల్‌ఫోన్ బ్యాటరీలు, ల్యాప్‌ట్యాప్ బ్యాటరీలు, ఎక్స్‌టర్నల్ బ్యాటరీ ప్యాక్‌లు, పోర్టబుల్ రీఛార్జులు

**గుడ్ల ధరలు**

| హైదరాబాద్ | వరంగల్ |
|---|---|
| ₹ 5.30 | ₹ 5.32 |

**బంగారం ధరలు (10 గ్రాములు)**
హైదరాబాద్

| | |
|---|---|
| ₹ 87,100 (22 క్యారెట్లు) | ₹ 95,020 (24 క్యారెట్లు) |

**వెండి ధరలు (కేజీ)**
హైదరాబాద్
₹ 1,08,000

# ఆసియాలో మళ్లీ కరోనా

- వేల సంఖ్యలో కేసులు..
- భారత్‌లోనూ అక్కడక్కడా నమోదు
- తీవ్రత తక్కువే అంటున్న కేంద్ర ఆరోగ్యశాఖ





న్యూఢిల్లీ:యావత్ ప్రపంచాన్ని కకావికలం చేసిన కరోనా మహమ్మారి కొన్ని దేశాల్లో మళ్లీ ప్రభావం చూపిస్తోంది. ముఖ్యంగా హాంకాంగ్, సింగపూర్, థాయ్‌లాండ్‌తో పాటు చైనాలోనూ కొవిడ్-19 వ్యాప్తి విపరీతంగా ఉంది. వారానికి వేల సంఖ్యలో కేసులు వెలుగు చూస్తున్నాయి. భారత్‌లోనూ కొన్ని కేసులు నమోదవుతున్నప్పటికీ.. తీవ్రత తక్కువేనని కేంద్ర ఆరోగ్యశాఖ పేర్కొంది. అయినా అప్రమత్తంగా ఉంటూ పరిస్థితులను పర్యవేక్షిస్తున్నామని తెలిపింది. సింగపూర్ ఆరోగ్యశాఖ నివేదిక ప్రకారం ఏప్రిల్ చివరి వారంలో 14వేల కరోనా కేసులు వెలుగుచూశాయి. అంతకుముందు వారం కూడా దాదాపు 11వేల పాజిటివ్ కేసులు నమోదయ్యాయి. నిత్యం 100 మంది బాధితులు ఆసుపత్రుల్లో చేరుతుండగా.. ఐసీయూలో చేరికలు మాత్రం అతి స్వల్పంగా ఉన్నాయని అధికారులు వెల్లడించారు.థాయ్‌లాండ్‌లోనూ వారానికి వేల సంఖ్యలో కొవిడ్ కేసులు నమోదవుతున్నాయి. మే రెండో వారంలోనే 33వేల కేసులు రికార్డయినట్లు అంచనా. ఒమిక్రాన్ తరగతికి చెందిన ఎక్స్ఈసీ వేరియంట్ వల్లే కేసుల సంఖ్య పెరుగుతున్నట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. అటు హాంకాంగ్‌లోనూ కొవిడ్ వ్యాప్తి విపరీతంగా పెరిగింది.చైనాలో కూడా కొవిడ్ పాజిటివ్ కేసుల సంఖ్య క్రమంగా పెరుగుతున్నట్లు అక్కడి ఆరోగ్యశాఖ వెల్లడించింది. ఫ్లూ తరహా లక్షణాలతో గత ఐదు వారాలుగా ఆసుపత్రులకు వెళ్తున్న వారి సంఖ్య సాధారణంతో పోలిస్తే రెట్టింపు అయినట్లు తెలిపింది. కేసుల పాజిటివిటీ రేటు 7.8శాతం నుంచి 16శాతానికి పెరగగా.. ఆసుపత్రి చేరికలు 3శాతం నుంచి 6శాతానికి పెరిగినట్లు సమాచారం.ఆసియా దేశాల్లో ప్రస్తుతం వైరస్ వ్యాప్తికి జేఎన్.1 వేరియంట్, దాని ఉపరకాలే కారణంగా అధికారులు చెబుతున్నారు. జేఎన్.1 ఉపరకాలైన ఎల్ఎఫ్.7, ఎన్‌బీ.1.8 వేరియంట్ల వ్యాప్తి అధికంగా ఉందని సింగపూర్ ఆరోగ్యశాఖ తెలిపింది. స్థానికంగా సీక్వెన్స్ చేసిన కేసుల్లో మూడింట రెండు వంతుల కంటే ఎక్కువ కేసులు ఇవేనని పేర్కొంది. ప్రస్తుత కొవిడ్-19 వ్యాక్సిన్‌లో జేఎన్.1 వేరియంట్‌ను ఉపయోగించినట్లు వెల్లడించింది.సీజనల్ వాతావరణ పరిస్థితులు, సామూహిక కార్యక్రమాలు, ప్రయాణాలు పెరగడం కేసుల పెరుగుదలకు కారణంగా సింగపూర్ ఆరోగ్యశాఖ పేర్కొంది. ప్రజల్లో రోగనిరోధక శక్తి క్షీణించడం కూడా ఇందుకు కారణమని చెప్పింది. కరోనా వైరస్ స్థానిక వ్యాధిగా పరిణామం చెందిందని హాంకాంగ్ ఆరోగ్య శాఖ వెల్లడించింది. వైరస్ వేరియంట్లలో కలిగే మార్పులు ప్రస్తుత వ్యాప్తికి సంబంధం ఉందని, దీంతోపాటు హెర్డ్ ఇమ్యూనిటీ తగ్గడం కూడా మరో కారణంగా పేర్కొంది. అయితే, ప్రస్తుతం ఆసియా దేశాల్లో కొవిడ్ వ్యాప్తికి కారణంగా భావిస్తున్న జేఎన్.1 రకం 'వేరియంట్ ఆఫ్ ఇంట్రెస్ట్' మాత్రమేనని, ఆందోళన కలిగించే రకం కాదని ప్రపంచ ఆరోగ్య సంస్థ ఇదివరకే స్పష్టం చేసింది.

# బైడెన్‌కు క్యాన్సర్.. ఎందుకు దాచారు?

**ఆలస్యంగా బయటపెట్టడం సరికాదు : ట్రంప్**



జనంసాక్షి:అమెరికా మాజీ అధ్యక్షుడు జో బైడెన్‌కు క్యాన్సర్ నిర్ధరణ అయిన సంగతి తెలిసిందే. తాజాగా దీనిపై ప్రస్తుత అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మాట్లాడుతూ కీలక వ్యాఖ్యలు చేశారు.బైడెన్‌కు క్యాన్సర్ సోకిందనే విషయాన్ని ఆలస్యంగా బయటపెట్టడాన్ని ఆయన ప్రశ్నించారు. విలేకరులతో మాట్లాడుతూ ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేశారు.బైడెన్‌కు ప్రొస్టేట్ క్యాన్సర్ నిర్ధరణ అయినట్లు ఆయన కార్యాలయం ఆదివారం ప్రకటించింది. ఈ క్యాన్సర్‌ను గ్లీసన్ స్కోరింగ్ సిస్టమ్‌ను ఉపయోగించి అంచనా వేస్తారు. ఇందులో బైడెన్ స్కోరు 9 ఉన్నట్లు కార్యాలయం తెలిపింది. దీనిపైనే తాజాగా ట్రంప్ మాట్లాడుతూ.. 'క్యాన్సర్ సోకిందన్న విషయం చాలా రోజుల తర్వాత తెలియడం నాకు ఆశ్చర్యం కలిగిస్తోంది. స్కోరు 9కు చేరుకోవడానికి చాలా సమయం పడుతోంది. బైడెన్ మానసికంగా ఆరోగ్యంగానే ఉన్నారని గతంలో అదే వైద్యుడు చెప్పారు. ఇది రాజకీయమైన అంశం కాదు. ఇది మన దేశానికి ప్రమాదం. క్యాన్సర్ విషయం ఇప్పటివరకు ఎందుకు బయటకు చెప్పలేదు. ప్రజలకు దీని గురించి వాస్తవాలు తెలియాలి. కొందరు వాస్తవాలు చెప్పడం లేదు. ఇది మరో పెద్ద సమస్య' అని ట్రంప్ పేర్కొన్నారు.

**జిల్ బైడెన్ నకిలీ వైద్యురాలు**

జో బైడెన్ క్యాన్సర్ నిర్ధరణ ఆలస్యం కావడంపై డొనాల్డ్ ట్రంప్ జూనియర్ స్పందించారు. ఈసందర్భంగా బైడెన్ సతీమణి జిల్ బైడెన్ ఒక నకిలీ వైద్యురాలంటూ విమర్శలు చేశారు. జిల్ డాక్టర్ అయినప్పటికీ తన భర్తలో క్యాన్సర్ లక్షణాలు గమనించకపోవడాన్ని ఆయన తప్పుపట్టారు. ఈ మేరకు ఆయన ఎక్స్ వేదికగా పోస్టు పెట్టారు.

## 'బలోచిస్థాన్'పై సీఎం హిమంత బిశ్వశర్మ కీలక వ్యాఖ్యలు

గువాహటి: పాకిస్థాన్‌లోని బలోచిస్థాన్ ప్రావిన్స్ స్థితిగతుల పై అస్సాం సీఎం హిమంత బిశ్వశర్మ కీలక వ్యాఖ్యలు చేశారు. కల్లోలిత బలోచిస్థాన్ ప్రావిన్స్‌లో అపారమైన ఖనిజ సంపద ఉన్నప్పటికీ ప్రభుత్వం నిర్లక్ష్యం వల్లే ఆ ప్రాంతం అభివృద్ధి చెందలేదన్నారు. ఈ క్రమంలోనే బలోచిస్థాన్ ప్రావిన్స్ దశాబ్దాలుగా ఆర్థిక, రాజకీయ దోపిడీకి గురవుతోందని ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ పేర్కొన్నారు. ఈ మేరకు హిమంత తన 'ఎక్స్' ఖాతాలో ట్వీట్ చేశారు"బలోచిస్థాన్ ప్రావిన్స్‌లో భారీగా ఖనిజ సంపద ఉన్నప్పటికీ నిర్లక్ష్యానికి గురవుతోంది. దశాబ్దాల తరబడి ఆ ప్రాంతంలో ఆర్థిక, రాజకీయ దోపిడీ ఎక్కువైంది. పాకిస్థాన్‌లోని మొత్తం ఖనిజ సంపదలో 80 శాతానికిపైగా బలోచిస్థాన్‌లోనే ఉండగా.. ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. అక్కడ భారీగా రాగి- బంగారు నిక్షేపాలు కూడా ఉన్నాయి. ప్రపంచవ్యాప్తంగా ఉపయోగించని సుమారు 5.9 బిలియన్ టన్నుల ఖనిజం, 41.5 మిలియన్ ఔన్సుల బంగారం, 35 మిలియన్ టన్నుల రాగి కూడా ఉంది" అని హిమంత తెలిపారు.ఇదిలా ఉంటే.. బలోచిస్థాన్‌లో సుయ్ గ్యాస్ నిక్షేపాలు ఉన్నట్లు 1952లో కనుగొనగా.. 2020 నాటికి పాకిస్థాన్‌కు సుమారుగా 56శాతం సహజ వాయువును అందిస్తోందని హిమంత బిశ్వశర్మ చెప్పుకొచ్చారు. బలోచిస్థాన్‌లోని గ్వదర్ ఓడరేవు 770 కిలోమీటర్ల తీరప్రాంతాన్ని కలిగి ఉన్నప్పటికీ ఆ ప్రాంతంలో స్వచ్ఛమైన తాగునీరు, విద్యుత్, ప్రాథమిక మౌలిక సదుపాయాలు అందుబాటులో లేవన్నారు.

# దుబారా వద్దు.. పొదుపు చేయండి

**ప్రభుత్వంలోని అధికారులు ఖర్చులు తగ్గించుకోవాలని చైనా ప్రభుత్వం ఆదేశం**



జనంసాక్షి:మందగమనంలో ఉన్న ఆర్థిక వ్యవస్థను పునరుద్ధరించేందుకు చైనా తన ప్రయత్నాలను ముమ్మరం చేసింది. అందులోభాగంగా ప్రభుత్వంలోని అధికారులు ఖర్చులు తగ్గించుకోవాలని చైనా ప్రభుత్వం ఆదేశించింది.ప్రయాణాలు, మద్యం, సిగరెట్ ఖర్చులు తగ్గించుకునేలా ప్రణాళికలు వేసుకోవాలని పేర్కొంది. ఈమేరకు అక్కడి అధికారిక మీడియాలో కథనాలు వెలువడ్డాయి.ఆర్థిక వ్యవస్థపై ఒత్తిడి పెరుగుతున్న నేపథ్యంలో అధ్యక్షుడు జిన్‌పింగ్ నేతృత్వంలోని ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. అందులోభాగంగా అక్కడి ప్రభుత్వ అధికారులతో పాటు, అధికార పార్టీ నేతలకు కీలక ఆదేశాలు జారీ చేసింది. వాటి ప్రకారం ప్రయాణాలు, మద్యం, సిగరెట్, ఆహారం, కార్యాలయాల అద్దెలు వంటివి తగ్గించుకునేలా ప్రణాళికలు చేసుకోవాలని ఆదేశించింది. ప్రభుత్వ వనరులను ఖర్చు చేసేటప్పుడు జాగ్రత్త వహించాలని కోరింది. దుబారాను తగ్గించాలని పేర్కొంది. ఈ దుబారా ఖర్చులు చేయడాన్ని సిగ్గుచేటు చర్యగా ప్రభుత్వం అభివర్ణించింది. ఇటీవల కాలంలో స్థిరాస్తి విక్రయాలకు సంబంధించిన ఆదాయం విషయంలో చైనా నష్టాలను చూస్తోంది. అంతేకాక స్థానిక ప్రభుత్వాలపై అప్పుల భారం కూడా పెరిగిపోయింది. ఈ క్రమంలో అధికారులు చేసే ఖర్చులతో ఒత్తిడి పెరగకుండా ఉండేలా చర్యలు తీసుకుంటోంది. స్థానిక ప్రభుత్వాల ఆర్థికవృద్ధిని మెరుగుపరచాలని నిర్ణయించుకుంది. అందులోభాగంగా అక్కడి అధికారులను ఖర్చులు తగ్గించుకోవాలని ఆదేశించింది.

## యుద్ధం ముగించడం రష్యాకు ఇష్టంలేదు

**- ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ**

యుద్ధాన్ని పూర్తిగా ఆపేయాలి. ఇదే మేం కోరుతున్నాం. ఎలాంటి షరతులు లేకుండా ఈ కాల్పుల విరమణను ప్రతిపాదించినందుకు ట్రంప్‌నకు కృతజ్ఞతలు' అని జెలెన్‌స్కీ పేర్కొన్నారు. రష్యా ఈ హత్యలు ఆపేందుకు సిద్ధంగా లేకుంటే.. దానిపై ఆంక్షలు విధించాలని ఈ సందర్భంగా జెలెన్‌స్కీ డిమాండ్ చేశారు. మాస్కోపై ఒత్తిడి తీసుకొచ్చి కీవ్‌లో శాంతి నెలకొల్పాలన్నారు.రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్, ట్రంప్ దాదాపు 2 గంటల పైనే ఫోన్‌లో మాట్లాడుకున్నారు. దీని అనంతరం ఉక్రెయిన్‌తో యుద్ధం ముగింపునకు సిద్ధంగా ఉన్నట్లు పుతిన్ తెలిపారు. ఉక్రెయిన్‌తో కలిసి శాంతి స్థాపనకు అంగీకరించిన ఆయన.. అందుకు పలు నియమాలు ఉన్నట్లు వెల్లడించారు. ప్రస్తుతం ఇరుదేశాల మధ్య చర్చలు సరైన దిశలోనే సాగుతున్నట్లు పుతిన్ తెలిపారు. శాంతిస్థాపన అనేది సంఘర్షణలకు మూల కారణాలను పరిష్కరించడంపై ఆధారపడి ఉంటుందన్న ఆయన.. అందుకు ఉత్తమమైన మార్గాలను వెతకడం ప్రస్తుతం ముఖ్యమన్నారు. ఇక, ఈ ఫోన్ కాల్ అనంతరం ట్రంప్ మాట్లాడుతూ. ఇరుదేశాలు తక్షణమే కాల్పుల విరమణ చర్చలు ప్రారంభిస్తాయని ఆశాభావం వ్యక్తంచేశారు. రష్యా అధ్యక్షుడితో ఫోన్ కాల్ అద్భుతంగా సాగినట్లు తెలిపారు.

## డార్క్ వెబ్‌లో ఆ విద్యార్థి కార్యకర్తకు అకౌంట్లు..

**మహారాష్ట్ర యాంటీ టెర్రరిజం స్క్వాడ్**

భారత ప్రభుత్వం పాక్‌లోని ఉగ్రవాదులపై చేపట్టిన ఆపరేషన్ సిందూర్‌ను, కేంద్ర ప్రభుత్వాన్ని వ్యతిరేకిస్తూ.. సోషల్ మీడియాలో పోస్టులు చేసిన కేరళకు చెందిన విద్యార్థి కార్యకర్త రెజాజ్ ఎం షీబా సిద్ధిఖ్‌ను మహారాష్ట్ర యాంటీ టెర్రరిజం స్క్వాడ్ ఇటీవల అదుపులోకి తీసుకుంది.దర్యాప్తులో భాగంగా అతడికి ఉగ్రవాదులతో సంబంధాలు ఉన్నాయని.. నిషిద్ధ డార్క్‌వెబ్‌సైట్లలో పలు అకౌంట్లు ఉన్నాయని గుర్తించినట్లు అధికారులు పేర్కొన్నారు. అతడు డార్క్‌వెబ్‌లో చురుగ్గా ఉన్నాడని.. అందులో దేశవ్యతిరేక పోస్టులను అనుసరిస్తూ.. వాటికి మద్దతు పలుకుతున్నట్లు గుర్తించామని అన్నారు.రెజాజ్‌కు పాకిస్థాన్‌కు చెందిన పలు ఉగ్ర సంస్థలలో సభ్యత్వం కూడా ఉన్నట్లు తెలిపారు. మరిన్ని విషయాలు తెలుసుకోవడానికి అతడి వద్ద ఉన్న డిజిటల్ పరికరాలను సైబర్-ఫోరెన్సిక్ ప్రయోగశాలకు పంపినట్లు తెలిపారు. సోషల్ మీడియాలో అతడు చేసిన పోస్టులలో నాగ్‌పుర్‌లోని ఒక రైఫిల్ దుకాణాన్ని సందర్శించి.. తుపాకీ పట్టుకొని తీసుకున్న ఫొటోలు ఉండడంతో అతడిని అదుపులోకి తీసుకొని విచారిస్తున్నామని పేర్కొన్నారు. అతడికి ఇంకా ఎవరెవరితో సంబంధాలు ఉన్నాయనే విషయాలు తెలుసుకోవడానికి సోషల్ మీడియా అకౌంట్లను తనిఖీ చేస్తున్నామని అన్నారు.

**డార్క్‌వెబ్ అంటే?**

డార్క్ వెబ్‌లో కంటెంట్ మొత్తం ఎన్‌క్రిప్ట్ చేస్తారు. దాన్ని వాడాలంటే ప్రత్యేక బ్రౌజర్లు వినియోగించాలి. ద ఆనియన్ రింగ్ (టార్), ఫ్రీ నెట్, ఇన్‌విజబుల్ ఇంటర్నెట్ ప్రాజెక్,ద అమీజక్ ఇన్‌కాగ్నిటో లైవ్ సిస్టమ్ (టైల్స్), వోనిక్స్ అందుకు ఉదాహరణలు. డార్క్ వెబ్‌ను తొలినాళ్లలో గోప్యత కోసం రూపొందించినా.. తర్వాత అక్రమార్కులు దాన్ని తమకు అడ్డాగా మలుచుకుంటున్నారు.

## ప్రజల అభీష్టం మేరకు ముంబైకు లహరి ఏసి స్లీపర్ బస్సు సర్వీసు





### రాష్ట్ర బీసి, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్

**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి మే 20 (జనంసాక్షి) :** ప్రజల అభీష్టం మేరకు వేములవాడ నుండి ముంబైకు లహరి స్లీపర్ బస్సు సర్వీసు ఏర్పాటు చేసినట్లు రాష్ట్ర బీసి, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు.మంగళవారం వేములవాడ గుడి ప్రాంగణం వద్ద వేములవాడ నుంచి ముంబై వరకు వెళ్లే రెండు ఏసీ బస్సులను రాష్ట్ర బీసి, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్,జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ లతో కలిసి పూజ చేసి జెండా ఊపి ప్రారంభించారు.ఈ సందర్భంగా రాష్ట్ర బీసి, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ ప్రజల అభీష్టం మేరకు మే 20 నుండి వేములవాడ నుండి ముంబై వెళ్ళెందుకు ఏసీ స్లిపర్ బస్సు లహరి సర్వీసులను ప్రారంభిస్తున్నామన్నారు.2 లహరి సర్వీస్ ఏసీ బస్సులను ముంబై సర్వీస్ నిమిత్తం కేటాయించడం జరిగిందని మంత్రి తెలిపారు.ప్రతి రోజు మధ్యాహ్నం 12.30 గంటలకు వేములవాడ నుండి బయలు దేరి తెల్లారి ఉదయం 4.45 గంటలకు ముంబై కు చేరుకుంటుందని, అదే రోజు మధ్యాహ్నం ఒంటి గంటకు ముంబై నుంచి బయలుదేరి మరుసటి రోజు ఉదయం 5 గంటలకు వేములవాడ చేరుకుంటుందన్నారు. ప్రతిరోజు ముంబై నగరానికి అప్ అండ్ డౌన్ సర్వీస్ నడుస్తుందన్నారు.లహరి బస్సు సర్వీస్ లో 22 సీట్స్, 20 స్లిపర్ బెర్త్ లు ఉన్నాయని, ప్రతి సీటుకు చార్జింగ్ పాయింట్, ఏసి అడ్జస్ట్ మెంట్ సౌకర్యం ఉందని, వైఫై సౌకర్యం బస్సులో కల్పించామని, సిసి కేమేరాలు ఉన్నాయని మంత్రి తెలిపారు. వేములవాడ నుంచి ముంబైకు పెద్దలకు స్లీపర్ బెర్త్ కు ఛార్జీలు రూ 2 వేలు,సీటు రూ1500లు,పిల్లలకు బెర్త్ రూ 1600, సీట్ రూ 1230 టికెట్ ఉంటుందని, పట్టణ వాసులు ఈ సర్వీసు ను వినియోగించుకోవాలని మంత్రి కోరారు. ముంబైలో ఉన్న తెలంగాణ బిడ్డల ప్రయాణనికి ఇబ్బంది కలగవద్దని అక్కడి ప్రయాణికుల విజ్ఞప్తి మేరకు బస్సు ప్రారంభం చేసుకున్నామనీ,ఈ బస్సు నిర్ణయాన్ని ముఖ్యమంత్రి ప్రశంసించారనీ రాబోయే కాలంలో జిల్లా కేంద్రం నుండి హైదరాబాద్ కు ప్రతి పుణ్యక్షేత్రం నుండి బస్సులు వేసే ప్రయత్నాలు కొనసాగుతున్నాయన్నారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ఏర్పడిన ప్రజా పాలన ప్రభుత్వంలో మహిళలకు మహాలక్ష్మి పథకం కింద ఉచిత ప్రయాణంతో పాటు ఈపథకం విజయవంతం కావడానికి కష్టపడుతున్న ఆర్టీసీ డ్రైవర్ లు ,కండక్టర్ కు ,సిబ్బంది సంక్షేమానికి కట్టుబడుతూనే సంస్థ అభివృద్ధి దిశగా పని చేస్తున్నామని,ఆర్టీసీ లో కొత్త నియామకాలు ,కొత్త బస్సులు కొనుగోలు చేస్తున్నామన్నారు.

మంత్రి వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామినీ దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. బస్సు ప్రారంభించిన అనంతరం ఆలయ ప్రాంగణం నుండి వేములవాడ తిప్పాపూర్ బస్టాండ్ వరకు అదే బస్సులో ప్రయాణించీ ముంబై వెళ్ళే ప్రయాణికులకు, పట్టణ ప్రజలకు స్థానిక ప్రజలకు ముంబై లో ఉన్న తెలుగు వారందరికీ శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎస్పి మహేష్ బి.గీతే, ఏఎస్పి శేషాద్రి రెడ్డి, గ్రంథాలయ సంస్థ చైర్మన్ నాగుల సత్యనారాయణ గౌడ్, ప్రజా ప్రతినిధులు,ఆర్టీసీ రీజనల్ మేనేజర్లు, డిపో మేనేజర్లు,ప్రజలు, ప్రయాణికులు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## స్కిల్ డెవలప్మెంట్ ట్రైనింగ్ సెంటర్‌ను
# ఒక యజ్ఞంలా నిర్వహించాలి

- ఇక్కడ ట్రైనింగ్ తీసుకున్న వారిని ఎక్కడైనా జాబ్ సాధించేలా తీర్చిదిద్దాలి
- స్కిల్ డెవలప్మెంట్ ట్రైనింగ్ సెంటర్ ప్రారంభోత్సవంలో మంత్రి శ్రీధర్ బాబు
- త్వరలో రాష్ట్రవ్యాప్తంగా స్టల్ సర్వే.. పైలట్ ప్రాజెక్టు కింద మొదటగా మంథని, కొడంగల్ నియోజకవర్గాల్లో సర్వే



**మంథని, (జనంసాక్షి) :** పెట్టామా ఏదో నేర్పించామా అన్నట్లు కాకుండా.. స్కిల్ డెవలప్మెంట్ ట్రైనింగ్ సెంటర్ ను ఒక యజ్ఞంలా నిర్వహించాలని, ఇక్కడ ట్రైనింగ్ తీసుకున్నవారు ఎక్కడైనా జాబ్ సాధించేలా ఉండేలా వారిని తీర్చిదిద్దాలని రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు సింగరేణి అధికారులకు సూచించారు. వృత్తి నైపుణ్యత పెంపొందించుకోవడం ద్వారా ఉపాధి అవకాశాలు మెరుగవుతాయని అన్నారు. మంగళవారం రామగుండం-3, అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియాలోని ఎంవిటిసి నందు సింగరేణి సంస్థ సిఎస్ఆర్ నిధులతో ఏర్పాటు చేసిన స్కిల్ డెవలప్మెంట్ ట్రైనింగ్ సెంటర్ (నైపుణ్యాభివృద్ధి శిక్షణ కేంద్రం)ను మంత్రి శ్రీధర్ బాబు ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. విశిష్ట అతిథిగా రామగుండం శాసనసభ్యులు మక్కాన్ సింగ్ రాజ్ ఠాగూర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభా కార్యక్రమానికి రామగుండం-3 ఏరియా జనరల్ మేనేజర్ నరేంద్ర సుధాకరరావు అధ్యక్షత వహించి, సింగరేణి సంస్థ ద్వారా పరిసర ప్రాంతాల నిరుద్యోగ యువతకు వివిధ విభాగాల్లో ఉచితంగా ఇస్తున్న శిక్షణ గురించి తెలియజేశారు. తదుపరి మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ.. సింగరేణి సంస్థ నిరుద్యోగ యువతీ యువకులలో వృత్తి నైపుణ్యత పెంచి, ఉపాధి అవకాశాలు కల్పించడం కోసం వివిధ ఏరియాలలో ఇలాంటి శిక్షణా కేంద్రాలు నిర్వహిస్తుందన్నారు. ఈ స్కిల్ డెవలప్మెంట్ ట్రైనింగ్ సెంటర్ ద్వారా సుమారు 38 కోర్సులలో నైపుణ్యాభివృద్ధి శిక్షణ ఇవ్వబడుతుందని, అలాంటి శిక్షణా కేంద్రాన్ని ఇక్కడ ఏర్పాటు చేయడం సంతోషకరమని అన్నారు. నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఉపాధి అవకాశాలు పొందాలని ఆకాంక్షించారు. శిక్షణ పొందే అభ్యర్థులు సర్టిఫికెట్ కోసమే కాకుండా, పూర్తిస్థాయిలో శిక్షణ పొంది నిజమైన నైపుణ్యాన్ని సాధించాలని కోరారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటు చేసిందని, త్వరలో రాష్ట్రంలో స్కిల్ సర్వే నిర్వహించి, నిరుద్యోగులకు వివిధ విభాగాలలో ఉన్నటువంటి నైపుణ్యత ఆధారంగా వారికి ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు కృషి చేస్తామని తెలియజేశారు.

ఇందులో భాగంగా పైలట్ ప్రాజెక్టు కింద మొదటగా మంథని, కొడంగల్ నియోజకవర్గాల్లో ఈ సర్వే చేపట్టను న్నట్లు మంత్రి శ్రీధర్ బాబు వెల్లడించారు. సింగరేణి యాజమాన్యం ఈ నైపుణ్యాభివృద్ధి శిక్షణా కేంద్రాన్ని ఒక కళాశాలగా అభివృద్ధి చేసి, ఇక్కడి నుండే నియామకాలు చేపట్టే విధంగా కృషి చేయాలని కోరారు.

ఈ కార్యక్రమంలో పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష, అడిషనల్ కలెక్టర్ జె.అరుణశ్రీ, హెచ్.ఆర్.డి. విభాగం జనరల్ మేనేజర్ గుంజపడుగు రఘుపతి, రామగుండం-1 ఏరియా జనరల్ మేనేజర్ డి.లలిత్ కుమార్, అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియా జనరల్ మేనేజర్ కొలిపాక నాగేశ్వరరావు, గుర్తింపు సంఘం ప్రధాన కార్యదర్శి కె.రాజ్ కుమార్, ప్రాతినిధ్య సంఘ నాయకులు కోట రవీందర్ రెడ్డి, అధికారుల సంఘం ప్రధాన కార్యదర్శి పి.నరసింహులు, ఆర్.డి.ఓ. సురేష్, ఎస్వోటు జిఎం బి.వి.సత్యనారాయణ, వివిధ గనుల,విభాగాల అధిపతులు, అధికారులు, ప్రజా ప్రతినిధులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఇద్దరు దిగ్గజాల మరణం బాధాకరం
### మంత్రి శ్రీధర్ బాబు



**మంథని, (జనంసాక్షి) :** భారతదేశ శాస్త్రీయ స్వరూపాన్ని మార్చివేసిన విశిష్ట పద్మ అవార్డు గ్రహీతలు డాక్టర్ ఎం.ఆర్. శ్రీనివాసన్, ప్రొఫెస ర్ జయంత్ నార్లికర్ అనే ఇద్దరు దిగ్గజాల మరణం బాధాకరం అని రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు అన్నారు. మంగళవారం ఎక్స్ వేదికగా మంత్రి శ్రీధర్ బాబు తన సంతాపం వ్యక్తం చేశారు.భారతదేశ పౌర అణు కార్యక్రమాన్ని అభివృద్ధి చేయడంలో డాక్టర్ శ్రీనివాసన్ కీలక పాత్ర పోషించారు.. మన ఇంధన స్వావలంబనకు పునాది వేశారు. ప్రపంచ వ్యాప్తంగా ఖగోళ భౌతిక శాస్త్రవేత్త ప్రొఫెసర్ నార్లికర్, తన అద్భుతమైన కృషి, విజ్ఞాన శాస్త్రాన్ని అభివృద్ధి చేయడంలో అంకితభావంతో తరాలకు స్ఫూర్తినిచ్చారు. వారి జీవితాలు జ్ఞానం, ఆవిష్కరణ, జాతీయ సేవ యొక్క శక్తికి నివాళులు అర్పించాయి. వారి అద్భుతమైన వారసత్వాలకు మనం నివాళులు అర్పించేటప్పుడు, వారి విచారణ స్ఫూర్తిని, దేశ నిర్మాణం పట్ల అంకితభావాన్ని ముందుకు తీసుకెళ్లే బాధ్యతను మనం గుర్తుచేసుకుంటాము.. అని చెప్పుకొచ్చారు.

## ఎస్సీ, ఎస్టీ కేసులను సమీక్షిస్తూ
# త్వరితగతిన పరిష్కరించాలి
### సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి, అదనపు కలెక్టర్ శ్రీనివాస రెడ్డి




**ఖమ్మం (జనంసాక్షి) :** ఎస్సీ, ఎస్టీ కేసులను సమీక్షిస్తూ త్వరితగతిన పరిష్కరించాలని సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి, అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డిలు కమిటీ సభ్యులకు, పోలీస్ అధికారులకు సూచించారు. మంగళవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో అదనపు కలెక్టర్ అధ్యక్షతన జిల్లా విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ సమావేశం నిర్వహించారు. సమావేశంలో పాల్గొన్న సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి మాట్లాడుతూ.. ఎస్సి, ఎస్టీ అట్రాసిటీ చట్టాన్ని పకడ్బందీగా అమలుచేయాల న్నారు. బాధితులకు పరిహార పెంపుకు చర్యలు చేపట్టాలన్నారు. ఇందిరమ్మ ఇండ్లు, రాజీవ్ యువవికాసం లబ్ధిదారుల ఎంపిక పూర్తి పారదర్శకంగా చేపట్టామన్నారు. పార్టీలకతీతంగా అర్హులకు పథకాల లబ్ది అందజేస్తున్నట్లు ఎమ్మెల్యే అన్నారు. ఎస్సి, ఎస్టీ కేసులపై వెంట వెంటనే విచారణ జరిపి, తగుచర్యలు చేపట్టాలన్నారు. సమావేశంలో చర్చించిన విషయాలపై తగుచర్యల నివేదిక ఇవ్వాలన్నారు.

సమావేశంలో అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లా కలెక్టర్ ఆదేశాలనుసారం జిల్లా విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ సమావేశము నిర్వహించడం జరిగిందని, ఈ సందర్భంగా కమిటీ సభ్యులు అడిగిన ప్రశ్నలకు జవాబు చెప్పి, పరిష్కరించ వలసిన సమస్యలను తదుపరి సమావేశంలో లిఖితపూర్వక సమాధానం ఇవ్వాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. సివిల్ రైట్స్ డే గురించి ప్రాథమికంగా సమావేశం జరిగే రెండు రోజుల ముందు అవగాహన కల్పించి ఎక్కువ సంఖ్యలో ప్రజలు సమావేశానికి వచ్చే విధంగా చూడాలన్నారు. తదుపరి సమావేశం మూడు నెలలకు నిర్వహించి సభ్యులందరూ విధిగా హాజరు అయ్యే విధంగా చూడాలని అన్నారు. సభ్యులు మాట్లాడుతూ, రాజీవ్ యువ వికాసం పథకంలో ఎస్సి యువతకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ఎస్సి సబ్ ప్లాన్ నిధులు మల్లింపు జరగకుండా చూడాలన్నారు. ఈ సమావేశంలో అదనపు డిసిపి నరేష్ కుమార్, జిల్లా సాంఘీక సంక్షేమ అధికారి కె. సత్యనారాయణ, జిల్లా గిరిజన సంక్షేమ అధికారిణి ఎన్. విజయలక్ష్మి, జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి ఏ. శ్రీనివాస్, ఆర్డీవోలు జి. నర్సింహారావు, ఎల్. రాజేందర్ గౌడ్, ఏసిపిలు ఎం. ఏ. రహమాన్, ఏ. రఘు, తిరుపతి రెడ్డి, కమిటీ సభ్యులు గుంతేటి వీరభద్రయ్య, జె. దాస్ మహరాజ్, తూరుగంటి అంజయ్య, కీసర రాంబాబు, అన్నం శ్రీనివాసరావు, మనికంటి వెంకట్, కలెక్టరేట్ సూపరిండెంట్ సిహెచ్. స్వామి, అధికారులు, తదితరులు పాల్గొన్నారు

## ఎంపీ వద్దిరాజుతో విద్యార్థినుల ముఖాముఖి



**ఖమ్మం టౌన్ (జనంసాక్షి) :** రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యుపీఎస్సీ) పోటీ పరీక్షలకు సంసిద్ధులవుతున్న విద్యార్థినులకు తన ఆశీస్సులు అందజేశారు. పాండిచ్చేరి, కర్ణాటక కేంద్రీయ విశ్వవిద్యాలయాలకు చెందిన పలువురు విద్యార్థినులు సెంటర్ ఫర్ హ్యూమన్ సెక్యూరిటీ స్టడీస్ (సీహెచ్ఎస్ఎస్) వ్యవస్థాపక సంచాలకులు డాక్టర్ కన్నెగంటి రమేష్ ఆధ్వర్యాన మర్యాద పూర్వకంగా కలిశారు.అమెరికా, ఇజ్రాయిల్ దేశాలలో ఉన్నత విద్యనభ్యసించిన రమేష్ 2013లో డాక్టర్ మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థ (ఏంసీహెచ్ఆర్డీ) ఆవరణలో సీహెచ్ఎస్ఎస్ ను నెలకొల్పి దేశ అంతర్గత భద్రత, విదేశీ వ్యవహారాలపై ఆసక్తి కనబర్చే యువతకు రీసెర్చ్ ఇంటర్న్ షిప్ నిర్వహిస్తున్నారు. ఈ సంస్థలో ఇంటర్న్ షిప్ చేస్తున్న పాండిచ్చేరి యూనివర్సిటీకి చెందిన యు.ప్రత్యూష, ఏస్.కృష్ణాగాయత్రి, ఏస్.కృష్ణానంద, పీ.ఏం.గాయత్రి, డీ.సౌమ్యలు రమేష్ ఆధ్వర్యాన మంగళవారం హైదరాబాద్ బంజారాహిల్స్ ఎమ్మెల్యే కాలనీలోని క్యాంప్ కార్యాలయంలో ఎంపీ రవిచంద్రను కలిసి మొక్కను బహుకరించారు.ఈ సందర్భంగా ఎంపీ రవిచంద్ర వారితో కొద్దిసేపు ఇష్టాగోష్టిగా జరిపారు. తాము సివిల్ సర్వీసెస్ పోటీ పరీక్షలకు సంసిద్ధమవుతున్నామని, మారుమూల గ్రామీణ ప్రాంతాలు,పేద వర్గాల ప్రజలకు సత్వర,మెరుగైన, నాణ్యమైన సేవలందించాలనేది సదాశయమని చెప్పారు. సంస్థ డైరెక్టర్ రమేష్ మాట్లాడుతూ, ఇంటర్న్ షిప్ సందర్భంగా దేశ అంతర్గత భద్రత, విదేశీ, అంతర్జాతీయ వ్యవహారాలు, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ)తదితర అంశాలపై నిపుణులు, రిటైర్డ్ ఐఏఎస్,ఐపీఎస్,ఐఎఫ్ఏస్ అధికారులతో అవగాహన తరగతులు నిర్వహిస్తున్నట్లు వివరించారు.ఈ సందర్భంగా ఎంపీ వద్దిరాజు విద్యార్థినులకు హృదయపూర్వక ఆశీస్సులు అందజేశారు, రమేష్ ను శాలువాతో సత్కరించి సంస్థ వికాసానికి తన ప్రోత్సాహం, సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని హామీనిచ్చారు.



## నిరుపేద రోగికి బిఎన్ రావు ఫౌండేషన్ చేయూత
### బి.ఎన్.రావు ఫౌండేషన్ చైర్మన్ డా.బండారి నరేందర్ రావు

**కరీంనగర్ బ్యూరో, మే 20 (జనంసాక్షి) :** జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలము, పకీర్ కొండాపూర్ గ్రామాని చెందిన శివకుమార్ (22) అనే యువకుడు గత కొంతకాలంగా లివర్ రక్తనాళంలో ప్రసరణ మందగించడంతో నిమ్స్‌లో వైద్య ఖర్చులు నిమిత్తం డాక్టర్ బి.ఎన్.రావు రూ. 20,000 ఆర్థిక సహాయం చెక్కు రూపకముగా అందించా రు. కోరుట్ల కు చెందిన డాక్టర్ అనుపురావ్ రోగి ఆర్థిక పరిస్థితిని తెలుసుకొని వారు ఇరువై వేలు సహాయము చేస్తూ బి.యన్ రావు ఫౌండేషన్‌కు తెలపడంతో డాక్టర్ బి.ఎన్. రావు 20వేల రూపాయల చెక్కును మంగళ వారం శివకుమార్‌కు అందజేశారు. ఈ సందర్భంగా శివకుమార్ డాక్టర్ బి.ఎన్.రావుకు కృతజ్ఞతలు తెలిపారు.

## జిల్లాలో రౌడీయిజాన్ని పూర్తిగా నిర్మూలిస్తాం

**కామారెడ్డి జిల్లా ప్రతినిధి మే 20 (జనం సాక్షి) :** జిల్లా పోలీసు కార్యాలయంలో మంగళవారం జిల్లా ఎస్పీ యం. రాజేష్ చంద్ర ఐపీఎస్ ఆధ్వర్యంలో రౌడీ మేళా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వివిధ పోలీస్ స్టేషన్లలో రౌడీ షీట్లు కలిగిన వ్యక్తులతో సమావేశం జరిగింది. ప్రతి ఆరు నెలలకు రౌడీ మేళా నిర్వహించి, రౌడీలపై నిశిత నిఘా ఉంచుతామని, మంచి ప్రవర్తన కనబరిచిన వారి రౌడీ షీట్లను తొలగిస్తామని ఎస్పీ తెలిపారు.ఎస్పీ రాజేష్ చంద్ర మాట్లాడుతూ, జిల్లాలో రౌడీయిజం, బెదిరింపులు, డబ్బుల వసూళ్లు, హింసాత్మక చర్యలకు ఎలాంటి తావు లేదని స్పష్టం చేశారు. పోలీసు రికార్డులు మరియు జిల్లా పోలీసు అధికారుల కమిటీ నివేదిక ఆధారంగా, 10 సంవత్సరాల పాటు సత్ప్రవర్తన కనబరిచిన 13 మంది రౌడీ షీటర్ల షీట్లను తొలగించినట్లు వెల్లడించారు. ఈ వ్యక్తులు భవిష్యత్తులో కూడా నేరాలకు పాల్పడకుండా, కుటుంబ సభ్యులతో ప్రశాంత జీవనం గడపాలని సూచించారు. అలాగే, నేరాల గురించి సమాచారం అందించే బాధ్యతాయుత పౌరులుగా ఉండాలని కోరారు.

రౌడీ షీట్లు కలిగి, మళ్లీ నేరాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని, కేసులు నమోదు చేసి న్యాయస్థానాల్లో శిక్ష పడేలా చూస్తామని హెచ్చరించారు. గంజాయి వినియోగం, హత్యలు, హత్యాయత్నాలు, కొట్లాటలు, గొడవలు వంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే పీడీ యాక్ట్ కింద కేసులు నమోదు చేస్తామన్నారు. సోషల్ మీడియాలో కత్తులతో ఫొటోలు పోస్ట్ చేయడం, రెచ్చగొట్టే విధంగా ప్రవర్తించడం, భయభ్రాంతులకు గురిచేసే చర్యలు చేస్తే సహించబోమని హెచ్చరించారు.నేరరహిత సమాజ నిర్మాణం కోసం జిల్లా పోలీసు యంత్రాంగం నిరంతరం కృషి చేస్తోందని, సత్ప్రవర్తనతో జీవనం సాగించే వారికి రౌడీ షీట్ల తొలగింపు ద్వారా మార్గం సుగమం చేస్తామని ఎస్పీ తెలిపారు. నిష్పక్షపాత విచారణతో, రౌడీ షీట్స్ రివ్యూ కమిటీ నివేదిక ఆధారంగా, మంచి ప్రవర్తన కనబరిచిన వారి షీట్లను తొలగిస్తామని, అలాగే పద్ధతి మార్చుకోని వారిపై రౌడీ షీట్లను కొనసాగిస్తామని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ కే. నరసింహారెడ్డి, కామారెడ్డి ఏఎస్పీ చైతన్య రెడ్డి, డీఎస్పీలు శ్రీనివాస్ రావు, విఠల్ రెడ్డి, స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ తిరుపతయ్య, డీసీఆర్బీ సీఐ మురళి, ఇతర సీఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

**పోచారం : హైదరాబాద్ ఔటర్ రింగ్ రోడ్డుపై అక్రమంగా గంజాయి తరలిస్తున్న ముఠాను ఎక్సైజ్ పోలీసులు పట్టుకున్నారు. ఘట్‌కేసర్ సమీపంలో ఐదుగురిని అరెస్టు చేయడంతో పాటు వారి వద్ద నుంచి రూ.23.55 లక్షల విలువైన ఎండు గంజాయిని స్వాధీనం చేసుకున్నారు.**

## ఫిన్లాండ్ విద్యా పర్యటనలో పారమిత చైర్మన్ డా. ఇ. ప్రసాద రావు



**కరీంనగర్ బ్యూరో, మే 20 (జనంసాక్షి) :** పారమిత పాఠశాలలు, ఎక్స్ ప్లోరికా పాఠశాలల అధినేత డా.ఇ. ప్రసాదరావు పన్లాండ్ లోని ఆధునిక విద్యా వ్యవస్థను పరిశీలించడానికి ఫన్లాండ్ దేశాన్ని సందర్శిస్తున్నారు. భారత దేశం నుండి వెళ్ళిన 20 మంది సభ్యులబృందంలో ప్రసాద రావు ఒకరు. ఈ 20 మంది బృందం మే నెల 14 నుండి మే 20, 2025 వరకు ఫిన్లాండ్ విద్యా వ్యవస్థను పరిశీలిస్తారు. ఫిన్లాండ్ పరిశోధనాత్మక విధానం ప్రపంచంలోనే అత్యంత నాణ్యమైన విద్యా విధానంగా పరగణించబడును. ఈ 20 మంది భారతీయ విద్యావేత్తలు భారత దేశంలోని వివిధ ప్రాంతాలనుండి ఎంపిక చేయబడ్డారు. ఈ ఎంపిక చేయబడ్డ భారతీయ విద్యావేత్తలు ఫిన్లాండ్ లోని అత్యంత ప్రమాణాలతో నాణ్యమైన విద్యా నందిస్తున్న ఇసిసిఇ ప్రాథమిక, ఉన్నత విద్య ప్రాపంచిక ప్రమాణాలతో ఏవిధంగా నడుపబడుచున్నదో పరిశీలిస్తున్నారు. ఈ విద్యా పర్యటనలో భాగంగా భారతీయ బృందం ఫిన్లాండ్ లోని అత్యున్నత ప్రమాణాలతో నడుపబరుచున్న 8 పాఠశాలలను సందర్శించును. ఈ బృందం ఇప్పటికే తౌహుల లో ఉన్నహౌకీలతీ ఉన్నత పాఠశాల, ద సీసైడ్ పూర్వ బాల్యదశ సంరక్షణ పాఠశాల , జేడా వృత్తి విద్యా ఉన్నత పాఠశాల స్కూల్, హెల్సినికి లోని ఆల్టో విశ్వవిద్యాలయాన్ని సందర్శించింది. ఈ విద్యా వేత్తల బృందం ముఖ్యంగా ఫిన్లాండ్ లోని తరగతి గదిలో బోధనా విధానాన్ని, ఆర్టిఫీషియల్ ఇంటలిజెన్స్ ను విద్యా విధానంలో ఎలా ఉపయోగిస్తున్నారనే అంశాలను పరశీలిస్తున్నారు. ఈ బారతీయ విద్యావేత్తల బృందం ఫిన్లాండ్ తో కలిసి పని చేస్తూ ప్రపంచంలోని అత్యున్నత నాణ్యమైన విద్యనందించే విధానాలను తమ పాఠశాలలో ప్రవేశపెట్టడం జరుగును. ఫిన్లాండ్ లోని విద్యా విధానం భారత కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన విద్యా విధానానికి దగ్గరలో ఉంది. ముఖ్యంగా ప్రపంచ ప్రమాణాలతో కొనసాగుతున్న ఈ విద్యా విదానాన్ని నాణ్యమైన విద్యను అందించే నిమిత్తం పారమిత, ఎక్స ప్లోరికా పాఠశాలలో 2025 - 26 విద్యా సంవత్సరంలో ప్రవేశ పెట్ట బోతున్నట్లు డా. ఇ. ప్రసాదరావు తెలిపారు. ఫిన్లాండ్ దేశంలో భారత దేశ రాయబారిగా పని చేస్తున్న హేమంత్ హెచ్. కోటక్వార్ నుండి డా. ఇ. ప్రసాద రావు సర్టిఫికెట్ ఆఫ్ అప్రిసియేషన్ అందుకున్నారు.

ఫిన్లాండ్ వెళ్ళిన భారతీయ విద్యావేత్తల బృందంలో పారమిత చైర్మన్ డా. ఇ. ప్రసాద రావుకి చోటు దక్కడం గర్వకారణంగా ఉందని పారమిత పాఠశాలల డైరెక్టర్లు, ప్రధానోపాధ్యాయులు, కో-ఆర్డినేటర్లు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు అన్నారు.



## నాలుగు లేబర్ కోడ్స్‌ను వెంటనే రద్దు చేయాలి

- ఆశా కార్యకర్తలను కార్మికులుగా గుర్తించి కనీస వేతనం రు.26వేలు ఇవ్వాలి
- తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ మేడ్చల్ జిల్లా కార్యదర్శి ఎం.రేవతి కళ్యాణి

**కాప్రా, మే 21 (జనం సాక్షి) :** కేంద్ర ప్రభుత్వం అమలు చేయాలని చూస్తున్న నాలుగు లేబర్ కోడ్స్ అమలవుతే కార్మికులు సంఘం పెట్టుకునే హక్కు కోల్పోయి, బిక్షాటనకు దిగాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) మేడ్చల్ జిల్లా కార్యదర్శి ఎం.రేవతి కళ్యాణి అన్నారు. మంగళవారం కుషాయిగూడ మార్కెట్ ఆవరణంలో దేశవ్యాప్త నిరసన కార్యక్రమంలో భాగంగా చేపట్టిన నిరసన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ.. నాలుగు లేబర్ కోడ్స్‌ను తక్షణమే రద్దు చేయాలని, ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను నిలిపివేయాలని డిమాండ్ చేశారు. ఆశా వర్కర్లకు కనీస స్థిర వేతనం రూ.26వేలు ఇవ్వాలని, వారిని 3వ తరగతి ఉద్యోగులుగా గుర్తించి, ఉద్యోగ భద్రత, పిఎఫ్, ఈఎస్ఐ వంటి హక్కులను కల్పించాలని కోరారు.

లేబర్ కోడ్స్ అమలు అవుతే రోజుకు 12 గంటల పనివేళలు విధించే ప్రమాదం ఉందని, కార్మిక హక్కులు హరించకపోతావని ఆమె హెచ్చరించారు. అలాగే, ఎన్ఆర్‌హెచ్ఎం స్కీమ్‌కు కేటాయించే బడ్జెట్ పెంచాలని కోరుతూ, డిమాండ్లు నెరవేరకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని ఆమె కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో శ్వేతా, అన్నపూర్ణ, స్వర్ణ, అనురాధ, భవాని తదితరులు పాల్గొన్నారు.

# దేశానికి ఆపద వస్తే అంతు చూసేందుకు సైన్యం సిద్ధంగా ఉంది

- ఆపరేషన్ సింధూర్‌తో మన సైనిక సత్తా యావత్ ప్రపంచానికి తెలిసింది
- సైనికులకు అండగా మేము సైతం తిరంగా యాత్ర
- ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి, జిల్లా అధ్యక్షులు రాజ్ భూపాల్ గౌడ్






**శంషాబాద్, మే 20 (జనంసాక్షి) :** ఆపరేషన్ సింధుర్ విజయవంతం కావడంతో కేంద్ర ప్రభుత్వం దీనికి గుర్తుగా భారతీయ జనతా పార్టీ దేశవ్యాప్తంగా తిరంగా యాత్ర నిర్వహిస్తుంది. రంగారెడ్డి రూరల్ అధ్యక్షులు పతంగి రాజ్ భూపాల్ గౌడ్ ఆధ్వర్యంలో మంగళవారం శంషాబాద్ మున్సిపాలిటీ పరిధిలో తిరంగా యాత్ర నిర్వహించారు. కార్యక్రమానికి చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కె ఎస్ రత్నం, కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి తిరంగా యాత్రలో పాల్గొన్నారు. కోండా విశ్వేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ దేశ భద్రత సైనిక విజయాలు ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వ నిబద్ధత ప్రజలకు వివరించడం ఈ యాత్ర ప్రధాన ఉద్దేశం అన్నారు. యుద్ధానికి విరామం తప్ప ముగియలేదని చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి అన్నారు. దేశానికి ఆపద వస్తే తీవ్రవాదుల అంతు చూసేందుకు సిద్ధంగా దేశ పౌరులు ఉన్నారు. ఆపరేషన్ సింధూర్‌తో భారతదేశ సైనిక సత్తా ప్రపంచ దేశాలకు తెలిసిందన్నారు. పాకిస్థాన్ ప్రజల ప్రాణాలకు నష్టం వాటిల్లకుండా కరుడుగట్టిన 100కు పైగా తీవ్రవాదులను మట్టి కరిపించిన ఘనత మన సైనికుల దన్నారు. జిల్లా అధ్యక్షులు రాజ్ భూపాల్ గౌడ్ మాట్లాడుతూ పాకిస్తాన్లో దాక్కున్న తీవ్రవాదులను పాకిస్తాన్ లోకి దూరి చంపేస్తామని హెచ్చరించారు.బెల్గాం దాడిలో అమాయకులైన ప్రజలను పొట్టన పెట్టుకున్న తీవ్రవాదులను ఎక్కడ దాక్కున్న ఇంట్లోకి వెళ్లి చరమగీతం పాడాల్సిందన్నారు. భారత్ తో పెట్టుకుంటే పాకిస్తాన్ ప్రపంచ పటంలో లేకుండా చేస్తామని హెచ్చరించారు. సైనిక శక్తిని మరోసారి పాకిస్తాన్ రుచి చూచిందన్నారు. భారతదేశానికి గర్వించదగ్గ మోడీ నాయకత్వంలో దేశం సుభిక్షంగా ఉందన్నారు. ఎవరు కన్నెత్తి చూసిన పరిణామాలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు. వైమానిక దాడుల్లో పాకిస్థాన్లోని 11 ఎర్ బేసెస్ లను నేలమట్టం చేశామన్నారు. టర్కీతో అడుక్కున్న డ్రోన్లను నీలమట్టం చేశాము. ఇప్పటికైనా పాకిస్తాన్ తన రీతిని మార్చుకోవాలన్నారు. ఆపరేషన్ సింధూర్ విజయవంతం కావడంతో దేశంలో పౌరులు బిజెపి వైపు మొగ్గు చూపుతున్నారు.

సమర్ధవంత మైన నాయకత్వంలో భారతదేశం ప్రపంచ పటంలో ఆర్థికంగా వైమానిక రంగాల్లో ముందుంటుందన్నారు. కార్యక్రమంలో బీజేవై ఎం రాష్ట్ర అధ్యక్షులు మహేందర్, పలువురు బిజెపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# చరిత్ర సృష్టించిన యూఏఈ

## తొలి టీ20లో బంగ్లాదేశ్‌పై విజయం

మూడు మ్యాచ్‌ల టీ20 సిరీస్ కోసం బంగ్లాదేశ్ యూఏఈలో పర్యటిస్తోంది. తొలి టీ20లో బంగ్లాదేశ్ 27 పరుగుల తేడాతో గెలిచింది. కానీ రెండో టీ20లో ఆతిథ్య జట్టు యూఏఈ అద్భుతంగా పునరాగమనం చేసి చరిత్ర సృష్టించింది. వారు బంగ్లాదేశ్‌ను 2 వికెట్ల తేడాతో ఓడించి అత్యధిక స్కోరు సాధించారు. బంగ్లాదేశ్‌పై టీ20లో యూఏఈకి ఇది తొలి విజయం అని తెలిసిందే. ఇది మాత్రమే కాకుండా యూఏఈ 206 పరుగుల భారీ లక్ష్యాన్ని ఛేదించింది. టీ20ల్లో యూఏఈకి ఇదే అతిపెద్ద పరుగుల వేట. యూఏఈ ఇంతకు ముందు ఎప్పుడూ ఇలా చేయలేదు.బంగ్లాదేశ్‌తో జరిగిన మ్యాచ్‌లో టాస్ గెలిచిన యూఏఈ కెప్టెన్ మహ్మద్ వసీం ముందుగా బౌలింగ్ చేయాలని నిర్ణయించుకున్నాడు. అటువంటి పరిస్థితిలో మొదట బ్యాటింగ్ చేసిన బంగ్లాదేశ్ నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్లకు 205 పరుగులు చేసింది. బంగ్లాదేశ్ తరఫున తంజిద్ హసన్ అత్యధికంగా 59 పరుగులు చేశాడు. యూఏఈ తరఫున మహ్మద్ జవాదుల్లా అత్యధికంగా 3 వికెట్లు పడగొట్టాడు.206 పరుగుల లక్ష్యాన్ని ఛేదించే ఈ మ్యాచ్‌లో యూఏఈ ఓపెనర్ మహ్మద్ వసీం తన జట్టు తరఫున కెప్టెన్సీ ఇన్నింగ్స్ ఆడాడు. మహ్మద్ వసీం 42 బంతులు ఎదుర్కొని 82 పరుగులు చేశాడు. 195.24 స్ట్రైక్ రేట్‌తో బ్యాటింగ్ చేశాడు. వసీం తన ఇన్నింగ్స్‌లో 9 ఫోర్లు, 5 సిక్సర్లు కొట్టాడు. జోహెబ్ ఖాన్ కూడా 38 పరుగులు చేసి తన కెప్టెన్‌కు మద్దతు ఇచ్చాడు.చివరి ఓవర్లో యూఏఈ విజయానికి 12 పరుగులు అవసరం కాగా.. ఈ లక్ష్యాన్ని యూఏఈ కేవలం 19.5 ఓవర్లలోనే చేరుకుంది. యూఏఈ ఒక బంతి మిగిలి ఉండగానే మ్యాచ్ గెలిచింది. మ్యాచ్ గెలిచిన తర్వాత యూఏఈ ఆటగాళ్లు సంబరాలు చేసుకుంటున్నారు. బంగ్లాదేశ్ తరఫున షోరిఫుల్ ఇస్లాం, నహిద్ రాణా, రిషాద్ హుస్సేన్ తలో రెండు వికెట్లు పడగొట్టారు. మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో చివరి,నిర్ణయాత్మక మ్యాచ్ మే 21న షార్జాలో జరగనుంది.

# తప్పుడు వార్తలను ఎలా ప్రచారం చేస్తున్నారు

## వైరల్ ఫొటోపై ప్రీతి జింటా ఆగ్రహం



వైభవ్ సూర్య వంశీ.. ప్రస్తుతం భారత క్రికెట్‌లో ఈ 14 ఏళ్ల యంగ్ క్రికెటర్ పేరు బాగా వినిపిస్తోంది. ఈ ప్లేయర్ దూకుడు చూస్తుంటే త్వరలోనే భారత జట్టులోకి రావచ్చునని అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. అయితే ఇంతలోనే వైభవ్ గురించి ఒక తప్పుడు వార్త సోషల్ మీడియాలో వైరలవుతోంది. ఇదే విషయంలో బాలీవుడ్ నటి, పంజాబ్ కింగ్స్ కో ఓనర్ ప్రీతి జింటా పేరు కూడా ప్రముఖంగా వినిపిస్తోంది. రాజస్థాన్ రాయల్స్, పంజాబ్ కింగ్స్ జట్ల మధ్య జరిగిన మ్యాచ్ తర్వాత, వైభవ్ సూర్యవంశీ ఫోటో ఒకటి సోషల్ మీడియాలో బాగా వైరల్ అయింది. ఈ ఫొటోల్లో వైభవ్‌ను ప్రీతి జింటా హగ్ చేసుకున్నట్లు చూపించారు. దీంతో కొందరు నెటిజన్లు ప్రీతి జింటాపై విమర్శల వర్షం కురిపించారు. సోషల్ మీడియా వేదికగా ట్రోల్స్ చేశారు. అంతేకాకుండా 14 ఏళ్ల ఆటగాడికి అలా హగ్ ఇవ్వడం ఏంటని కొన్ని వెబ్ సైట్లు కూడా నెగెటివ్ కథనాలు ప్రచరించాయి. తాజాగా ఇదే విషయంపై ప్రీతి జింటా స్పందించారు. ఈ ఫోటోలు పూర్తిగా ఫేక్ అని, వార్తా ఛానెళ్లు కూడా ఇలాంటి తప్పుడు చిత్రాలను ప్రసారం చేయడమేంటని ఆమె ఆగ్రహం వ్యక్తం చేసింది.'ఇది మార్ఫింగ్ చేసిన ఫోటో. తప్పుడు వార్తలను ఎలా ప్రచారం చేస్తున్నారు. ఆఖరి న్యూస్ ఛానెల్స్ కూడా మార్ఫింగ్ చేసిన చిత్రాలను ఉపయోగించి వాటిని వార్తలుగా చూపిస్తున్నాయి. వీటిని చూసి నేను ఆశ్చర్యపోయాను' అని ఎక్స్ (ట్విట్టర్) లో రాసుకొచ్చింది ప్రీతి జింటా. దీంతో ఈ వైరల్ ఫొటోపై ప్రీతి జింటా స్వయంగా స్పందించింది.

నిజం చెప్పాలంటే మే 17న రాజస్థాన్ రాయల్స్‌తో జరిగిన మ్యాచ్ తర్వాత పంజాబ్ కింగ్స్ యజమాని ప్రీతి జింటా వైభవ్ సూర్యవంశీని కలిసింది. అక్కడ వారిద్దరూ జస్ట్ కరచాలనం చేసుకుని మాట్లాడుకున్నారంతే. అంతే కానీ ప్రీతి జింటా వైభవ్‌ను హగ్ చేసుకోలేదు. కానీ కొందరు నెటిజన్లు వారిపై మార్ఫింగ ఫొటోలు క్రియేట్ చేసి నెట్టింట వైరల్ చేశారు.

# అహ్మదాబాద్‌లో ఫైనల్

## ఐపీఎల్ 2025 ఫైనల్ వేదిక ఖరారు



ఐపీఎల్ 2025 లీగ్ స్టేజ్ దాదాపు ముగియవచ్చింది. మూడు జట్లు ప్లే ఆఫ్స్ చేరగా, మరో స్థానం కోసం ఢిల్లీ క్యాపిటల్స్, ముంబై ఇండియన్స్‌పోటీ పడుతున్నాయి. ఈ సమయంలో ఐపీఎల్ ఫైనల్‌కు సంబంధించి కీలక అప్‌డేట్ వచ్చింది. అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోడీ స్టేడియం ఐపీఎల్ ఫైనల్ మ్యాచ్‌కు వేదికగా మారింది. జూన్ 3న జరగనున్న ఐపీఎల్ 2025 ఫైనల్ మ్యాచ్‌ను అహ్మదాబాద్ మోదీ మోదీ స్టేడియంలో నిర్వహించనున్నారు. బీసీసీఐ మంగళవారం సుదీర్ఘంగా సమావేశం అయిన తర్వాత ఈ నిర్ణయం తీసుకుంది. చండీగఢ్ ముల్లాన్‌పూర్ స్టేడియంలో ఈ ఐపీఎల్ మొదటి క్వాలిఫైయర్ మ్యాచ్, ఎలిమినేటర్ మ్యాచ్ జరుగుతాయి. ఐపీఎల్ 2025 మొదటి క్వాలిఫైయర్ మ్యాచ్ మే 29న జరగనుంది. అయితే బెంగళూరులో భారీ వర్షాల కారణంగా వేదికను మార్చారు. మే 29న క్వాలిఫయర్ 1, మే 30న ఎలిమినేటర్ మ్యాచ్‌లకు ముల్లాన్‌పూర్ స్టేడియం వేదికగా మారింది. జూన్ 1న క్వాలిఫయర్ 2, జూన్ 3న జరగనున్న ఫైనల్ మ్యాచ్‌లకు అహ్మదాబాద్ లోని మోదీ స్టేడియం వేదికగా మారింది.. ఇటీవల ఐపీఎల్ తిరిగి ప్రారంభించిన తర్వాత మొత్తం 17 మ్యాచ్‌లు జరుగుతాయి. వర్షం కారణంగా మే 23న సన్‌రైజర్స్, ఆర్సీబీల మధ్య బెంగళూరులో జరగాల్సిన మ్యాచ్‌ను లక్నోకు మార్చారు. మే 27న ఆర్సీబీ, లక్నో సూపర్ జెయింట్లు జట్లు లక్నో వేదికగా తలపడనున్నాయి. దాంతో సన్‌రైజర్స్ మ్యాచ్‌ను లక్నో వేదికకు తరలించారు.మే 8వ తేదీన భారత్, పాక్ మధ్య ఉద్రిక్తతల కారణంగా ధర్మశాలలో మధ్యలోనే నిలిపివేసిన మ్యాచ్‌ను మే 24న నిర్వహించనున్నారు. జైపూర్ వేదికగా పంజాబ్ కింగ్స్, ఢిల్లీ క్యాపిటల్స్ తలపడనున్నాయని బీసీసీఐ ఇటీవల ప్రకటించింది.దేశంలో వర్షాకాలం ప్రారంభం అవుతున్నందున, మ్యాచ్ నిర్వహణకు అనుకూల వాతావరణాన్ని దృష్టిలో ఉంచుకుని బీసీసీఐ ఐపీఎల్ వేదికలను ఎంపిక చేస్తోంది. అందువల్ల ఫైనల్ మ్యాచ్ నిర్వహణకు అహ్మదాబాద్‌లోని మోదీ స్టేడియాన్ని వేదికగా ఎంపిక చేసినట్లు సమాచారం. దక్షిణాదిన హైదరాబాద్, బెంగళూరు, చెన్నైలలో ఐపీఎల్ ఫైనల్ నిర్వహించే అవకాశం లేదు. నైరుతి రుతుపవనాలు ఒకట్రెండు రోజుల్లో కేరళను తాకనున్నాయి. అనంతరం నాలుగైదు రోజులలో ఆంధ్రప్రదేశ్‌ను తాకనున్నాయి. ఆపై తెలంగాణలో సైతం రుతుపవనాలు వ్యాపించనున్నాయి.

# దిగ్వేష్ రాఠీకి జరిమానా.. నిషేధం!



ఇకానా క్రికెట్ స్టేడియంలో జరిగిన ఐపీఎల్ 2025 61వ మ్యాచ్‌లో అభిషేక్ శర్మ, దిగ్వేశ్ సింగ్ రాఠీ మధ్య వివాదం నెలకొంది. ఇద్దరు ఆటగాళ్లు నోటికి పని చెప్పారు. అంపైర్లు, జట్ల తోటి ఆటగాళ్ళు వారిని ఆపకపోతే పరిస్థితి ఇంకా దిగజారేది. లక్నో సూపర్ జెయింట్స్ బౌలర్ దిగ్వేశ్ సింగ్ 8వ ఓవర్ మూడవ బంతికి సన్‌రైజర్స్ ఓపెనర్ అభిషేక్ శర్మను ఔట్ చేశాడు. తర్వాత తన నోట్‌బుక్ సెలబ్రేషన్ చేయడంతో గొడవ మొదలైంది. పేపర్లో రాసిపెట్టాను, ఇక నువ్వు వెళ్లిపో అన్నట్లు బౌలర్ దిగ్వేష్ చేసిన చర్యతో అభిషేక్ శర్మకు కోపం వచ్చింది. దాంతో ఇరువురి మధ్య హీటింగ్ వాగ్వాదం జరిగింది. అయితే ఇద్దరు ఆటగాళ్లు ఐపీఎల్ కోడ్ ఆఫ్ కండక్ట్ ఉల్లంఘించడంతో బీసీసీఐ చర్యలు చేపట్టింది. దిగ్వేశ్‌కు ఇంతకు ముందు ఎవరికీ ఇవ్వని విధంగా శిక్ష విధించి షాకిచ్చింది. లక్నోలోని అటల్ బిహారీ వాజ్‌పేయి ఇకానా క్రికెట్ స్టేడియంలో సోమవారం సన్‌రైజర్స్ హైదరాబాద్ తో జరిగిన మ్యాచ్‌లో లక్నో సూపర్ జెయింట్స్ బౌలర్ దిగ్వేశ్ సింగ్ నియమావళిని ఉల్లంఘించాడు. అందుకుగానూ అతడి మ్యాచ్ ఫీజులో 50 శాతం జరిమానా విధించాం" అని తెలిపింది. ఓ మ్యాచ్ సైతం నిషేధం విధించింది. 2025లో 2.5వ చాప్టర్ కింద బౌలర్ దిగ్వేశ్ రాఠీ చేసిన మూడవ లెవెల్ 1 నేరం. అతను 2 డెమెరిట్ పాయింట్లు కోల్పోయాడు. ఇంతకు ముందు 3 డెమెరిట్ పాయింట్లు కోల్పోయాడు. 01 ఏప్రిల్, 2025న పంజాబ్ కింగ్స్‌తో జరిగిన మ్యాచ్‌లో ఒక డిమెరిట్ పాయింట్, 04 ఏప్రిల్, 2025న ముంబై ఇండియన్స్‌తో జరిగిన మ్యాచ్‌లో 2 డిమెరిట్ పాయింట్లు అతడి ఖాతాలో ఉన్నాయి. ఒకే సీజన్‌లో స్పిన్నర్ దిగ్వేశ్ రాఠీ ఖాతాలో 5 డిమెరిట్ పాయింట్లు ఉన్నాయి. దాంతో లక్నో స్పిన్నర్ దిగ్వేశ్‌పై ఒక మ్యాచ్ నిషేధం విధించారు. దిగ్వేశ్ రాఠీ లక్నో సూపర్ జెయింట్స్ అడనున్న నెక్ట్స్ మ్యాచ్‌లో అందుబాటులో ఉండడు. ఐపీఎల్ తరువాతి మ్యాచ్ మే 22, 2025న అహ్మదాబాద్‌లో గుజరాత్ టైటాన్స్‌తో ఆడనుంది.

## వేలంలో కొనుగోలు చేయాల్సిన ఆటగాళ్లపై ఫోకస్ పెట్టాం

### తాము బ్యాటింగ్‌లో మెరుగైన ప్రదర్శన చేయాలనుకుంటున్నాం : ధోనీ

ఐపీఎల్ 2025 సీజన్‌లో భాగంగా చెన్నై సూపర్ కింగ్స్‌తో ఢిల్లీ వేదికగా జరుగుతున్న మ్యాచ్ లో రాజస్థాన్ రాయల్స్ టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకుంది. ఇక్కడే జరిగిన ఢిల్లీ, గుజరాత్ మ్యాచ్‌లో ఛేజింగ్ టీమ్‌కు కలిసొచ్చిందని, దాంతోనే తాను బౌలింగ్ ఎంచుకున్నానని రాజస్థాన్ రాయల్స్ కెప్టెన్ సంజూ శాంసన్ అన్నాడు.'మేం ముందుగా బౌలింగ్ చేస్తాం. ఢిల్లీతో ఇక్కడ జరిగిన గత మ్యాచ్‌లో ఛేజింగ్ టీమ్‌కు కలిసొచ్చింది. ఈ గేమ్‌లో దాచేది ఏం లేదు. మేం కూడా ఈ రోజు గుజరాత్‌లానే విజయం సాధించాలనుకుంటున్నాం.ప్రతీ ఒక్కరు మ్యాచ్ విన్నరే. వారు అలానే ఆలోచిస్తున్నారు. అయితే మేం పరిస్థితులకు తగ్గట్లు కాస్త తెలివిగా బ్యాటింగ్ చేయాలి. తుది జట్టులో కొన్ని మార్పులు చేశాం. యుధ్‌వీర్ తుది జట్టులోకి వచ్చాడు.'అని సంజూ శాంసన్ తెలిపాడు. తాము బ్యాటింగ్‌లో మెరుగైన ప్రదర్శన చేయాలనుకుంటున్నామని చెన్నై సూపర్ కింగ్స్ కెప్టెన్ మహేంద్ర సింగ్ ధోనీ తెలిపాడు. 'మేం స్వేచ్ఛగా బ్యాటింగ్ చేయాలనుకుంటున్నాం. ముఖ్యంగా వచ్చే సీజన్ కోసం ఏ స్లాట్‌లో ఏ ఆటగాడు రాణిస్తున్నాడో తెలుసుకోవాలి. మా బౌలింగ్‌పై కూడా ఫోకస్ పెట్టాలి. ఈ టోర్నీ ప్లే ఆఫ్స్ రేసు నుంచి తప్పుకోగానే వచ్చే సీజన్‌పై ఫోకస్ పెట్టాం.

# మహనీయుల విధానాలు ఆచరణీయం



సమావేశంలో మాట్లాడుతున్న ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్ కాశీం



మహాత్మ జ్యోతిరావు పూలే విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ప్రొఫెసర్ కాశీం, జర్నలిస్ట్ రఘు

- పెద్ద ధన్వాడలో మహనీయుల విగ్రహాల ఆవిష్కరణ
- పాల్గొన్న ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్ కాశీం
- స్థూలం గుర్రంపై కూర్చున్న.. కళ్లెం ఇతరుల చేతిలో ఉంది అలంపూర్ రాజకీయం : కాశీం

**రాజోలి, మే 20 (జనంసాక్షి) :** రాజోలి మండలంలోని పెద్ద ధన్వాడ గ్రామంలో మంగళవారం మహాత్మా జ్యోతిరావు పూలే, డాక్టర్ బీ.ఆర్.అంబేద్కర్ మహనీయుల విగ్రహాలను ఆవిష్కరించేందుకు ముఖ్య అతిథులుగా ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్ సి.కాశీం, మన తొలివెలుగు సిఈఓ జర్నలిస్ట్ రఘు ఆవిష్కరించారు. అనంతరం ప్రొఫెసర్ కాశీం మాట్లాడుతూ..అలంపూర్ నియోజకవర్గం రాజకీయ పరిణామంలో భాగంగా స్థూలంగా గుర్రంపైన కూర్చున్నా, కళ్లెం మాత్రం ఇతరుల చేతిలో ఉందన్నట్లు వ్యాఖ్యానించారు. అంబేద్కర్ కృషి వల్లే అణగారిన వర్గాలు అధికార పదవుల్లో ఉన్నా, స్వతంత్రంగా వ్యవహరించలేకపోతున్నారన్నారు. స్థానిక సంస్థల్లో రిజర్వేషన్ల అధారంగా అధికారంలో ఉన్న పెత్తందార్ల ఆజ్ఞలను శిరసావహించడం అనివార్యంగా ఉందని విన్నామన్నారు. మరికొన్ని చోట్ల పదవుల్లో ఉన్న వారి లెటర్ ప్యాడ్లను సైతం వారి వద్దే ఉంచుకొని పాలనను నడిపిస్తున్నట్లు సమాచారముందన్నారు. ఒక వ్యక్తికి ఇన్ని విగ్రహాలు ఎందుకు ఉన్నాయని, విగ్రహం వెనుక ఉన్న అంబేద్కర్ చరిత్రను తల్లిదండ్రులు పిల్లలకు చెప్పాలని కోరారు. అంత చదువుకున్న అంబేద్కర్‌కు సైతం కులం పేరు చెబితే ముంబైలో ఇల్లు అద్దెకు దొరకలేదని, నాడు అంబేద్కర్ ఎదుర్కొన్న సమస్యల ను ఇప్పటికీ దేశంలో చాలా మంది ఎదుర్కొంటున్నారని, అది పోవాలంటే సామాజిక మార్పు రావాలన్నారు. అంబేద్కర్ ఆశయాలు నెరవేర్చే బాధ్యత అందరిపై ఉందన్నారు. ఈ సందర్భంగా మన తొలివెలుగు సిఈఓ జర్నలిస్ట్ రఘు మాట్లాడుతూ..మహనీయుల విగ్రహాలు భవిష్యత్ తరాలకు స్ఫూర్తిని స్తాయని అన్నారు. అంబేద్కర్ రాసిన రాజ్యాంగం ఫలితంగా అందరికీ సమాన హక్కులు ఉన్నాయని, మహాత్మా జ్యోతిరావు పూలే సామాజిక న్యాయం కోసం, అందరికీ విద్య అందించడం కోసం అహర్నిశలు కృషి చేశారని మహనీయులను కొనియాడారు. ఈ కార్యక్రమానికి సింగర్ రేలారే ప్రసాద్ ముఖ్యఅతిథిగా పాల్గొని మహనీయుల పాటలతో తమ అద్భుతమైన గాత్రంతో స్వరాలతో ప్రజలను అలరించారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల ప్రజలు, దళిత సంఘాల నాయకులు, ప్రజాసంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## గుల్జార్ హౌజ్ ప్రమాద మృతుల

# సమగ్ర విచారణ జరిపించాలి

### మృతుల సంతాప సభలో శ్రద్ధాంజలి ఘటించిన ఎంపీలు, ఎమ్మెల్యే



**రాజేంద్రనగర్,మే 20 (జనం సాక్షి) :** చార్మినార్ గుల్జార్ హౌస్‌లో షార్ట్ సర్క్యూట్ ప్రమాదంలో మృతి చెందిన వారి కుటుంబ సభ్యుల సంతాప సభలో పాల్గొని బాధిత కుటుంబ సభ్యులను భాజపా ఎంపీలు, గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్‌లు పరామర్శించారు. మంగళవారం శివరాం పల్లిలోని ఓ ఫంక్షన్ హాల్లో జరిగిన మృతుల సంతాప సభలో రంగారెడ్డి జిల్లా భాజపా అధ్యక్షుడు పతంజలి రాజగోపాల్ గౌడ్, స్థానిక రాజేంద్రనగర్ నియోజకవర్గం భాజపా ఇన్చార్జ్ తోకల శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో ఎంపీలు, ఎమ్మెల్యే బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు.

ఈ సందర్భంగా ఎంపీలు మాట్లాడుతూ ఎప్పుడు లేని విధంగా ఓకే కుటుంబంలోని 17 మంది మరణించడం అత్యంత దురదృష్టకరమని అన్నారు. ప్రమాదం జరిగి కొన్ని గంటలకే అంబులెన్స్ లోటుపాట్లు, అసమర్థత తో ప్రాణాలు కోల్పోవడం పట్ల ప్రభుత్వ వైఫల్యాలు కొట్టొచ్చినట్టు కనిపిస్తున్నాయని, ఈ ప్రమాదంపై సమగ్ర విచారణ జరిపి నిజ నిజాలు ప్రజల ముందు ఉంచాలని కోరారు. ఈ విషాదకరమైన ఘటనలో మరోసారి ఇలాంటి ప్రమాదాలు పునరావృతం కాకుండా ప్రభుత్వం పగడ్బందీగా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.




# పోలీసు నిఘా నీడలో కాళేశ్వరం

- సాంకేతికత సహాయంతో నిరంతర నిఘా
- కమాండ్ కంట్రోల్ నుంచి పర్యవేక్షణ

**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** సరస్వతి పుష్కరాల నేపథ్యంలో కాళేశ్వరంలో పటిష్ఠ నిఘా ఏర్పాటు చేయడం జరిగిందని ఎస్పీ కిరణ్ ఖరే అన్నారు. ఈ మేరకు మంగళవారం ఆయన మాట్లాడుతూ పుష్కరాలు జరిగే ప్రధాన ప్రాంతాలతో పాటు కాళేశ్వరం వచ్చే వివిధ రహదారుల్లో, దేవాలయం, పుష్కర ఘాట్లు, పార్కింగ్ ఏరియాల్లో 220 సీసీ కెమెరాలు పోలీసు శాఖ ఆధ్వర్యంలో బిగించడం జరిగిందని తెలియజేశారు. భద్రత కోసం ఐదు డ్రోన్ కెమెరాలను వాడుతున్నామన్నారు. వీటన్నింటిని కాలేశ్వరం పోలీస్ స్టేషన్ లో ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోల్ కు, అక్కడి నుంచి రాష్ట్ర పోలీసు కమాండ్, కంట్రోల్ సెంటర్ కు అనుసంధానించినట్లు తెలిపారు. కాళేశ్వరం పీఎస్ లోని కమాండ్ కంట్రోల్ సెంటర్ లో మూడు షిఫ్టులో పోలీసులు పనిచేస్తున్నారని, దీంతో పుష్కరాల్లో ఎక్కడ ఏ చిన్న సంఘటన జరిగిన పోలీసులకు క్షణాల్లో తెలిసిపోతుందని, సరస్వతి పుష్కరాలకు పెద్ద ఎత్తున తరలివస్తున్న భక్తుల భద్రతకు సాంకేతిక పరిజ్ఞానం వాడుకుంటూ పటిష్ఠ భద్రతా చర్యలు చేపట్టామని ఎస్పీ కిరణ్ ఖరే పేర్కొన్నారు. మంగళవారం కాళేశ్వరం పోలీస్ స్టేషన్ లోని కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్ ను ఎస్పీ పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. భక్తులకు ఇబ్బంది లేకుండా చర్యలు చేపడుతున్నట్టు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మహాదేవపూర్ సిఐ రాంచందర్ రావు, కాళేశ్వరం ఎస్సై తమాషా రెడ్డి పాల్గొన్నారు.

## రెండు రోజుల పంచాయతీ

# కార్యదర్శుల శిక్షణ విజయవంతం



**ములుగు ప్రతినిధి,మే 20(జనంసాక్షి) :** భారత ప్రభుత్వం పరిపాలనా సంస్కరణలు ప్రజా ఫిర్యాదుల విభాగం (డిఏఆర్పిజి), సిబ్బంది, ప్రజా ఫిర్యాదులు, పెన్షన్ల మంత్రిత్వ శాఖ సహకారంతో, డా మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థ, తెలంగాణ ఏర్పాటు చేసిన 'సమాచార హక్కు మరియు గ్రామసభ కోసం సామర్థ్య నిర్మాణంపై కేంద్రం (సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్)' పంచాయతీ రాజ్, గ్రామీణ అభివృద్ధి శాఖ, తెలంగాణ భాగస్వామ్యంతో హనుమకొండ ప్రాంతీయ శిక్షణ కేంద్రం ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శుల కోసం నిర్వహించిన రెండు రోజుల శిక్షణ కార్యక్రమం విజయవంతంగా పూర్తయ్యింది.జిల్లా పంచాయతీ అధికారి దేవరాజ్ ముఖ్య అతిథిగా హాజరైన ఈ శిక్షణలో తెలంగాణ పంచాయతీ రాజ్ చట్టం, గ్రామ సభ పాత్ర, ప్రజల భాగస్వామ్యం, సమాచార హక్కు చట్టం, పారదర్శకత, వివిధ శాఖల సమన్వయం, మహిళా మరియు శిశు - స్నేహ పూర్వక గ్రామ పంచాయతీలు, మహిళా సాధికారత, బాలల హక్కులు వంటి అంశాలపై అవగాహన కల్పించారు. మొదటి రోజు గ్రామ పంచాయతీ స్థాయిలో పారదర్శకత, సమాచార హక్కు చట్టం, గ్రామ సభ ప్రాముఖ్యత, మహిళా గ్రామ సభలు, పంచాయతీ కార్యదర్శి పాత్రపై నిపుణులు చర్చించారు. రెండవ రోజు పంచాయతీ కార్యదర్శి ఎన్నికైన ప్రజాప్రతినిధులకు సమాచార భాగస్వామిగా ఎలా ఉండగలరు, ఉత్తమ విధానాలు, బాలల హక్కులు, సవాళ్లు మరియు వాటి పరిష్కారాలపై చర్చించారు.ఈ కార్యక్రమంలో ములుగు జిల్లాకు చెందిన 40 మంది పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి ఓ దేవరాజ్ మరియు ములుగు ఎంపీడీవో రామకృష్ణ, ఎంపీవో ప్రకాశ్, రిటైర్డ్ ఎంపీడీఓ మోహన కృష్ణ, ప్రాంతీయ శిక్షణ కేంద్రం హన్మకొండ ప్రతినిధి రవి పాల్గొని సర్టిఫికెట్లు అందజేశారు. ఈ శిక్షణను విజయవంతంగా నిర్వహించినందుకు డాక్టర్ ఎంసిఆర్ మానవ వనరుల అభివృద్ధి సంస్థను జిల్లా యంత్రాంగం అభినందించింది.

*సన్ రైజర్స్ హైదరాబాద్.. లక్నో సూపర్ జెయింట్స్ కొంపముంచింది. తప్పక గెలవాల్సిన మ్యాచ్ లో బరిలోకి దిగిన లక్నోను అదును చూసి దెబ్బ కొటింది.*



# విద్యుత్ షాక్‌తో ఇద్దరు రైతులు మృతి

**పిట్లం, మే 20, (జనం సాక్షి) :** విద్యుత్ షాక్ తగిలి ఇద్దరు రైతులు మృతి చెందిన ఘటన పిట్లం మండల పరిధిలో చోటు చేసుకుంది.మండల పరిధిలోని కంబాపూర్ గ్రామానికి చెందిన ఆగమప్ప రైతు మంగళవారం తన విద్యుత్ మోటార్ చెడిపోవడంతో మరమత్తుల కోసం అదే గ్రామానికి చెందిన రైతులను తీసుకెళ్లగా, పైపులను బయటకు తీస్తుండగా పైన కరెంట్ వైర్లు తగిలి ఎర్ర హన్మయ్య, సంఘం రాములు విద్యుత్ షాక్ తగిలి అక్కడిక్కడే మృతి చెందినట్లు గ్రామస్థులు తెలిపారు. స్థానిక ఎస్సై అందుబాటులో లేకపోవడంతో, ఘటన స్థలాన్ని నిజాంసాగర్ ఎస్సై శివకుమార్,విద్యుత్ అధికారులు పరిశీలించారు.

# పులి మృతి కేసులో కొనసాగుతున్న విచారణ

- చర్మం, గోర్లు స్వాధీనం
- నిందితులను విచారిస్తున్నాం : సిసిఎఫ్ శాంతారామ్



**కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా బ్యూరో మే 20 (జనం సాక్షి) :** పులి మృతి కేసులో విచారణ కొనసాగుతుందని రాష్ట్ర అటవీ శాఖ చీఫ్ కన్సర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ ఉన్నతాధికారి శాంతారాం, కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా అటవీశాఖ అధికారి నీరజ్ కుమార్‌లు తెలిపారు. మంగళవారం కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్ డివిజన్ అటవీశాఖ కార్యాలయంలో వారు మీడియా సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఈనెల 16వ తేదీన జిల్లాలోని పెంచికల్పేట మండలం ఆగర్ గూడ అటవీ ప్రాంతంలో చనిపోయిన పులి మృతదేహాన్ని తునికాకు కూలీలు కనిపెట్టి అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు. దీంతో రంగంలోకి దిగిన అధికారులు భూములో పాతి పెట్టిన కుళ్ళిపోయిన పులి శరీర అవశేషాలను బయట తీసి కననం చేశారు. అనంతరం అదే రోజు నుంచి నిందితులను కనిపెట్టే వేటలో అటవీశాఖ అధికారులు నిమగ్నమ య్యారు. సుమారు 5 రోజులు అటవీశాఖ అనిమల్ ట్రాకింగ్, ఇతర సిబ్బంది నిందితుల కోసం గాలింపు కొనసాగించారు. ఎట్టకేలకు దహగం మండలంలోని చిన్న రాసి పెల్లి గ్రామంలో పులి చర్మం, గోర్లు లభించినట్లు అధికారులు తెలిపారు. మృతి చెందిన పులికే అవునో... కాదో అనే విషయంపై శాస్త్రీయంగా నమూనాలను (షాంపుల్స్) ల్యాబ్‌కు పంపించినట్లు, నివేదిక అందిన వెంటనే పులి వివరాలు వెల్లడిస్తామని తెలిపారు. పులిని విద్యుత్ వైర్లు అమర్చి హతమార్చినట్లు ప్రాథమికంగా నిర్ధారణకు వచ్చినట్లు తెలిపారు. పులిని ఎంత మంది?.. ఎవరు అనే విషయంలో పలువురుని అదుపులోకి తీసుకొని విచారణ కొనసాగిస్తున్నట్లు వారు పేర్కొన్నారు.



# వడదెబ్బతో ఒకరి మృతి

**గణపురం, మే 20 ( జనం సాక్షి):** గణపురం మండల కేంద్రానికి చెందిన భామండ్లపల్లి కుమారస్వామి (40) మంగళవారం వడదెబ్బతో మృతి చెందాడు. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం కూలి పనులు చేసుకుంటూ జీవిస్తున్న కుమారస్వామి సోమవారం మధ్యాహ్నం సమయంలో బయట పనికి వెళ్లి వచ్చి అలసటకు గురయ్యాడు. ఇంట్లో ఎవరికీ చెప్పకుండా నిద్రకు ఉపక్రమించాడు. మంగళవారం ఉదయం అతడిని లేపే ప్రయత్నం చేయగా కుమారస్వామి మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతుడికి భార్య ఇద్దరు కుమారులు ఉన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
బుధవారం
21 మే 2025

# భూ భారతి చట్టం దేశానికే ఆదర్శం


- 18 రాష్ట్రాల్లో భూ చట్టాలపై అధ్యయనం చేసి భూ భారతి ఏర్పాటు
- రాష్ట్రమంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి



మంచిర్యాల ప్రతినిధి, మే 20 (జనంసాక్షి) : తెలంగాణ రాష్ట్ర ప్రజలు ధరణి తో భూ సమస్యల వలయంలో చిక్కి ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ప్రజల కోరిక మేరకు భూ భారతి అనే చట్టాన్ని ప్రజల వద్దకు తీసుకువచ్చిందని రాష్ట్ర రెవెన్యూ గృహ నిర్మాణ సమాచార శాఖ మాత్యులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం నాడు మంచిర్యాల జిల్లా భీమారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో భూభారతి చట్టం అమలులో భాగంగా భీమారన్ని పైలట్ మండలంగా ఎంపిక చేసిన నేపథ్యంలో భూభారతి చట్టం అవగాహన సదస్సును చెన్నూరు ఎమ్మెల్యే గడ్డం వివేక్ అధ్యక్షత వహించగా ప్రభుత్వ సలహాదారు హర్కర వేణుగోపాల్, జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, డి.సి.పి. ఎ.భాస్కర్, జిల్లా అదనపు కలెక్టర్ సబావత్ మోతిలాల్, జిల్లా అటవీ అధికారి శివ్ ఆశిష్ సింగ్, బెల్లంపల్లి గడ్డం వినోద్, లతో కలిసి మంత్రి హాజరయ్యారు. గత ప్రభుత్వంలో ధరణి చట్టం భూ సమస్యలకు కేంద్రంగా మారిందని, చిన్న తప్పు దొర్లిన దానిని సవరించే అవకాశం లేక రైతులు రెవెన్యూ ఆఫీసును మొదలుకొని సీసీఎల్ దాకా తిరిగిన సమస్యకు పరిష్కారం కాలేదని రైతుల సమస్యల పరిష్కారం కోసం ఇందిరమ్మ ప్రభుత్వం చట్టాన్ని తీసుకువచ్చి భూ సమస్యలకు పరిష్కారం ఆలోచించిందని పేర్కొన్నారు. 18 రాష్ట్రాల్లో భూ చట్టాలపై ఆరు నెలల పాటు భూ సమస్యలపై సుదీర్ఘ అనుభవం ఉన్న అధికారులతో అధ్యయనం చేయించి భూ భారతి చట్టాన్ని ఏర్పాటు చేశామని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అంటేనే పేదల ప్రభుత్వమని పేదల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని ఆయన పేర్కొన్నారు .భూభారతి చట్టాన్ని బాబాసాహెబ్ అంబేద్కర్ జయంతి రోజున అసెంబ్లీలో ప్రవేశపెట్టి బిల్లు పాస్ చేయించి రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించామని తెలిపారు. భూ భారతి చట్టాన్ని తెలంగాణ ప్రజలకు అంకితం చేయడం జరిగిందని ఆయన తెలిపారు. మొదటిసారిగా నాలుగు జిల్లాల్లోని నాలుగు మండలాల్లో పైలెట్ ప్రాజెక్టుగా అనంతరం 28 జిల్లాల్లో 32 మండలాల్లో తీసుకున్నామని తెలిపారు. రైతుల భూ సమస్యలు పరిష్కారవాహిని భూభారతి చట్టమని పేర్కొన్నారు. జూన్ 2 తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం రోజున రాష్ట్రవ్యాప్తంగా భూభారతి చట్టం అమల్లోకి వస్తుందని పేర్కొన్నారు . మంచిర్యాల జిల్లా భీమారంలో భూ భారత్ కి రైతుల నుండి వచ్చిన దరఖాస్తులలో ఎక్కువ భాగం సాదా బైనమా సమస్యలు ఎక్కువ ఉన్నాయని పేర్కొన్నారు. 2200 మంది రైతులు తమ సమస్యలపై అర్జీలు పెట్టుకోగా అందులో 11 వందల మంది సమస్యలు సాదా బయనా సమస్యలేనని తెలిపారు. ధరణిలో ఇలాంటి సమస్యలకు పరిష్కారం ఉందని చెప్పడమే తప్ప భూమికి సంబంధించి ధరణిలో తప్పుగా ఎంటర్ అయితే దానిని సవరించడానికి ఎమ్మార్వో స్థాయి నుండి సీసీఎల్ వరకు అధికారం లేకపోవడంతో ప్రజలు అనేక ఇబ్బందులకు గురయ్యారని పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో రిజిస్ట్రేషన్ సమయంలో సరిహద్దులతో పాటు, సర్వే మ్యాప్ లతో రిజిస్ట్రేషన్ చేయడం జరుగుతుందని, పట్టాదారు పాసుపుస్తకాలలో సైతం ఈ మ్యాప్ ను ఉంచడం జరుగుతుందని తెలిపారు. ప్రజల సమస్యలను పరిష్కరించి, పేద ప్రజలకు ఉపయోగపడే విధంగా, ప్రజలు కోరుకునే చట్టంగా రూపొందించబడిందని తెలిపారు. జూన్ 2వ తేదీ నుండి తహసిల్దార్ స్థాయి అధికారులు మండల పరిధిలో పర్యటించి గ్రామాలలో నెలకొన్న భూ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటారని, ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరిగే అవసరం లేదని తెలిపారు. ప్రతి ఒక్కరికి ఆధార్ కార్డు ఉన్నట్లుగానే ప్రతి రైతుకు భూధార్ కార్డు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని, ప్రతి రైతుకు భూధార్ ఖాతా నెంబర్ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. లావుని పట్టా, ఇనాం భూముల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. అన్యాక్రాంతానికి గురైన పేదల భూములను వెనక్కి తీసుకొని పేదలకు అందించడం జరుగుతుందని తెలిపారు. భూభారతి చట్టంలో ఎవరైనా రైతులకు అధికారులు అన్యాయం చేస్తే వారిపై కూడా చర్యలు తీసుకోవడానికి ప్రజా ప్రభుత్వం వెనకాడదని హెచ్చరించారు. ఇందిరమ్మ ప్రభుత్వం అంటేనే పేదల ప్రభుత్వమని పేదల సంక్షేమమే లక్ష్యంగా గతంలో 25 లక్షల ఎకరాల భూమిని ఇందిరా గాంధీ పేద ప్రజలకు పంపిణీ చేసిందని గుర్తు చేశారు. ఇక్కడ కూడా ప్రభుత్వ భూములలో నిరుపేదలు కబ్జాలు ఉన్నట్లు చెన్నూరు ఎమ్మెల్యే వివేక్ తెలిపారని వారికి కూడా న్యాయం చేయడానికి పేదల ప్రభుత్వం సహకరిస్తుందని తెలిపారు.

# సీఎం ప్రజావాణి చొరవతో రెవెన్యూ శాఖలో కారుణ్య నియామకం

- సీఎం రేవంత్ రెడ్డికి ధన్యవాదాలు తెలిపిన లబ్ధిదారు వేములపతి దేవి
- చిన్నారెడ్డి, దివ్యలతో దేవి భేటీ



హైదరాబాద్, మే 20 (జనంసాక్షి) : సీఎం ప్రజావాణి ఇన్చార్జి డాక్టర్ జి చిన్నారెడ్డి, స్టేట్ నోడల్ అధికారి దివ్య చొరవతో ముఖ్యమంత్రి ఏ రేవంత్ రెడ్డి ఆదేశాలతో వేములపతి దేవికి రెవెన్యూ శాఖలో కారుణ్య నియామకం ఉత్తర్వులు అందాయి. మంగళవారం మహాత్మా జ్యోతిబా పూలే ప్రజా భవన్ లో జరిగిన సీఎం ప్రజావాణికి వచ్చిన దేవి తన ఉద్యోగ నియామక ఉత్తర్వులను చిన్నారెడ్డి, దివ్య లకు చూపించి ధన్యవాదాలు తెలిపారు. హైదరాబాద్ లోని మహంకాళి పోలీస్ స్టేషన్ లో కానిస్టేబుల్ గా విధులు నిర్వహిస్తున్న బి. రవికుమార్ విధి నిర్వహణలో 2018 నవంబర్ 17న మృతి చెందారు. అయితే మృతుడు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ప్రకాశం జిల్లా గిద్దలూరు వాసి కావడంతో ఆరేళ్లుగా ఆంధ్ర - తెలంగాణ ప్రభుత్వాల మధ్య కారుణ్య నియామక అంశం తేలకుండా పోయింది. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడం, ప్రజల సమస్యల పరిష్కారం కోసం సీఎం ప్రజావాణి కార్యక్రమాన్ని ప్రారభించడంతో సమస్యను వివరిస్తూ కొన్ని నెలల క్రితం మృతుడు భార్య దేవి పిటిషన్ ను ఇచ్చారు. ఈ విషయం అధికారుల ద్వారా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి వెళ్ళింది. హైదరాబాద్ పోలీస్ శాఖలో ఉద్యోగి కావడంతో తెలంగాణ రాష్ట్రంలోనే మృతుడి భార్య దేవికి కారుణ్య నియామకం కింద ఉద్యోగం ఇవ్వాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. దీంతో హైదరాబాద్ కలెక్టర్ ఏ2/165, తేదీ 5-5-2025 ద్వారా నాంపల్లి మండల రెవెన్యూ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్ గా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. విధుల్లో చేరిన తర్వాత మంగళవారం ప్రజావాణికి వచ్చి చిన్నారెడ్డి, దివ్యలకు లబ్ధిదారు దేవి తన నియామక ఉత్తర్వులు చూపించారు. కారుణ్య నియామకం ద్వారా రెవెన్యూ శాఖలో జూనియర్ అసిస్టెంట్ గా ఉద్యోగం ఇచ్చిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, సహకరించిన ప్రజావాణి బృందానికి వేములపతి దేవి కృతజ్ఞతలు తెలిపారు.

# మునీర్ కుటుంబానికి అండగా ఉంటాం

- ఐజేయు, టీయుడబ్ల్యూజే





హైదరాబాద్, మే 20 (జనంసాక్షి) : సీనియర్ పాత్రికేయుడు, ప్రజాస్వామికవాది, తెలంగాణ ఉద్యమకారుడు మునీర్ హఠాత్తుగా అనారోగ్యానికి గురికావడం బాధాకరమని, ఆయన కుటుంబానికి తాము అండగా ఉంటామని ఇండియన్ జర్నలిస్ట్ యూనియన్ (ఐజేయు) జాతీయ అధ్యక్షులు, తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కే. శ్రీనివాస్ రెడ్డి, తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం (టీయూడబ్ల్యూజే) రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కే.విరాహత్ అలీ, కే.రాంనారాయణలు మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. మునీర్ చికిత్స ఖర్చులను ప్రభుత్వం భరిస్తుందని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహా ప్రకటించడాన్ని తాము స్వాగతిస్తున్నట్లు వారు తెలిపారు. మునీర్ కుటుంబం ఆందోళన చెందవద్దని, అన్ని విధాలా వారికి తమ సంఘం చేయూతనిస్తుందని వారు భరోసా ఇచ్చారు.

# కాళేశ్వరంలో అవినీతి వెలికి తీసే పనిలో కమిషన్

- కమిషన్ విచారణకు కెసిఆర్ హాజరుకావాలి
- ఈటెల బిజెపిలో బిఆర్ఎస్ కోవర్ట్
- ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ ఘాటు వ్యాఖ్యలు



హైదరాబాద్, మే 20 (జనంసాక్షి) : రాజకీయ కక్షతో కాదు, కేవలం అవినీతి చెందిన బాధ్యులను వెలికితీసే ఉద్దేశంతోనే కాళేశ్వరంపై విచారణ జరుగుతోందని ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ స్పష్టం చేశారు. సామాజిక న్యాయానికి పెద్దపీట వేసే పార్టీ కాంగ్రెస్‌లో వివక్షకు అవకాశం లేదు. వివేక్, వంశీలపై ఎలాంటి వివక్ష లేదని పేర్కొన్నారు.తెలంగాణలో కాళేశ్వరం ప్రాజెక్ట్‌పై జరుగుతున్న వివాదాల నేపథ్యంలో తాజాగా ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. కాళేశ్వరంలో తప్పులు జరిగాయనే కారణంతోనే కమిషన్ కొంత సమయం తీసుకుని నివేదిక రూపొందించిందని ఆయన అన్నారు. కాళేశ్వరం విచారణలో కేసీఆర్, ఈటెల, హరీష్ రావులపై ఘోష్ కమిషన్ నోటీసులు జారీ చేయడం ముఖ్యమైన పరిణామంగా అభివర్ణించారు. వారు తప్పు చేయలేదంటే వివరణ ఇవ్వాల్సిన అవసరం ఏంటని ప్రశ్నించారు. కాళేశ్వరంలో తప్పు జరిగిన విషయాన్ని కమిషన్ తేల్చిందని తెలిపారు. ఈ సందర్భంగా కేసీఆర్‌పై తీవ్ర విమర్శలు చేశారు. విచారణ కమిషన్ శీలాన్ని శంకించాల్సిన అవసరం లేదు.. సాంకేతిక సమాచారం కోసం ఆలస్యం జరిగిందని అన్నారు. తప్పు చేసిన వారు ఎంతటి వారైనా సరే, శిక్ష తప్పదని.. కేసీఆర్ అమెరికా పారిపోవాలని చూస్తున్నట్టున్నారని వ్యాఖ్యానించారు. అలాంటి పని చేయొద్దని, ప్రభాకర్ రావు వెళ్లినట్టు- మీరు పోకండని హెచ్చరించారు. అలాగే కాళేశ్వరం నీటిని లిఫ్ట్ చేయడానికి కాదు, క్యాష్ లిఫ్టింగ్ చేయడానికే వాడుకున్నారు. తెలంగాణను దొంగల దొడ్డిగా మార్చారు అంటూ మండిపడ్డారు. నాగార్జునసాగర్, శ్రీశైలం ప్రాజెక్టుల్లో ఒక్క పిల్లర్ అయినా కూలిందా? కానీ కన్నెపల్లె పంపు హౌస్ ఎందుకు మునిగిందని నిలదీశారు.మరోవైపు ఈటెలపై కూడా సంచలన వ్యాఖ్యలు చేస్తూ.. ఈటెలను బీజేపీలోకి కావాలనే పంపించారా కేసీఆర్? బీఆర్ఎస్ లో అక్రమాలు చేసిన తర్వాతే ఆయన పార్టీ మారారన్న అనుమానాలు ఉన్నాయి. ఇప్పుడు సీల్డ్ కవర్ కోసం వెయిటింగ్‌లో ఉన్నారని వ్యాఖ్యానించారు. అలాగే కిషన్ రెడ్డి లాంటి బానిసలతోనే దేశానికి నష్టం అంటూ ఘాటు వ్యాఖ్యలు చేసారు. దేశానికి ద్రోహం చేస్తున్న వాళ్ల పట్ల బీజేపీకి విధానం లేదని, రాహుల్ గాంధీ మీద మాట్లాడే అర్హత బీజేపీ నేతలకు లేదని ఆయన అన్నారు. బీజేపీ నేతలు ఎవరైనా దేశ స్వాతంత్రంలో పాల్గొన్నారా..? అంటూ ప్రశ్నించారు. పాకిస్తాన్ కు సమాచారం ఇచ్చిన కేంద్ర మంత్రి దేశ ద్రోహి కాదా.. కిషన్ రెడ్డి నల్లి కుట్ల లెక్క ఉంటాడని ఘాటు వ్యాఖ్యలు చేసారు. బీజేపీ కాదు.. బూతు జనతా పార్టీ, నీఛాతి నీచమైన బాషా.. సోషల్ మీడియాలో ట్రోల్ చేస్తున్నారని.బిజెపి పార్టీపై కాంగ్రెస్ ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ తీవ్ర విమర్శలు చేశారు. బిజెపి అంటే. భారతీయ జనతా పార్టీ కాదని.. అది బూతు జనతా పార్టీ అని మండిపడ్డారు. బిజెపి సోషల్ మీడియా వాళ్లకు సిగ్గు, లజ్జ లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం గాంధీ భవన్ లో అద్దంకి మీడియాతో మాట్లాడుతూ.. 'బిజెపి పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి నల్లికుట్లోడి లాగ కనిపిస్తాడు.. కానీ ఇంత నీచపు సోషల్ మీడియా నడిపిస్తున్నాడు. వాళ్ల మీద కేసు పెడదామంటే ఒక్కరికి కూడా మొహం ఉండదు. నా పాత వీడియోలు తీసుకొచ్చి బుద్ధి లేకుండా ట్రోల్ చేస్తుందని దుయ్యబట్టారు. ప్రపంచంలో మూడు జెండర్స్ ఉన్నాయని.. బిజెపి వాళ్ళు ఏ జెండరో తేల్చుకోవాలని చురకలంటించారు. మీలాంటి బూతు భాష వాడే జాతి.. ఈ భూమి మీద ఎక్కడ లేదని ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ ధ్వజమెత్తారు.

# కాళేశ్వరం విచారణను నీరుగార్చే కుట్ర

- బిఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీల కుట్రరాజకీయయం
- బిజెపి నేత, మాజీ ఎమ్మెల్యే ఎన్వీఎస్-ఎస్ ప్రభాకర్



హైదరాబాద్, మే20 (జనంసాక్షి) : కాళేశ్వరం కూలడానికి కారణమేవరో తేల్చడానికి ఇంత ఆలస్యమెందుకని బిజెపి నేత, మాజీ ఎమ్మెల్యే ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ ప్రశ్నించారు. కాళేశ్వరం విచారణను నీరు గార్చేందుకు ప్రయత్నం జరుగుతోందని అన్నారు. విద్యుత్తు కొనుగోళ్ల విషయంలోనూ విచారణను నీరుగార్చారని మండిపడ్డారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీల మధ్య డీల్ కుదరడం వల్లే ఈ విచారణలను పక్కదోవ పట్టిస్తున్నారని ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ ఆరోపించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడినప్పుడు కొన్ని వేల కోట్లు- ఖర్చు చేసి కాళేశ్వరం ప్రాజెక్ట్ పూర్తి చేశారని ప్రభాకర్ అన్నారు. సాగునీరు ఇచ్చే సమయానికి ఆ ప్రాజెక్టు కుంగిపోయిందని చెప్పారు. రేవంత్ ప్రభుత్వం ధాన్యాన్ని కొనకుండా రైతులను ఇబ్బంది పెడుతోందని ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ ఆరోపించారు. దళారులకు ధాన్యం వదిలిపెట్టడంతో ఇష్టారాజ్యంగా మారిందని విమర్శించారు. ధాన్యం కొనేవారు లేక రైతులు నష్టపోతున్నారని అన్నారు. ధాన్యం కేంద్రాలను మండల స్థాయిలో ఎందుకు ప్రారంభించడం లేదని ప్రశ్నించారు. ఈ అంశంపై కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రికి ఫిర్యాదు చేస్తానని చెప్పారు. బీర్లు, భూములు అమ్ముతున్న ప్రభుత్వం తాజాగా రాష్ట్రమంతా అందాల భామలను తిప్పుతోందని ఎద్దేవా చేశారు. కేంద్ర ప్రభుత్వ పథకాలకు రాష్ట్ర ప్రభుత్వ వాటా విడుదల చేయడంలో సీఎం రేవంత్ రెడ్డి ఆలస్యం చేస్తున్నారని ఫైర్ అయ్యారు. ఈ అంశంపై కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు ఫిర్యాదు చేస్తామని తెలిపారు. తెలంగాణ బీజేపీ అధ్యక్ష ఎంపిక రొటీన్ ప్రాసెస్‌లో జరుగుతుందని తెలిపారు. త్వరలో అధ్యక్షుడి ఎంపిక ఉంటుందని ఎన్వీఎస్-ఎస్ ప్రభాకర్ పేర్కొన్నారు.

# భారత మామిడి ఎగుమతులపై ఆంక్షలు

- డాక్యుమెంటేషన్ లోపాలతో తిరస్కరణ
- భారీగా నష్టపోనున్న ఎగుమతిదారులు



న్యూఢిల్లీ, మే20 (జనంసాక్షి) : భారత మామిడి ఎగుమతులపై అమెరికా వ్యవహరిస్తున్న తీరు కారణంగా భారీగా నష్టాలు కలుగబోతున్నాయి. అమెరికాలోని లాస్ ఏంజిల్స్, శాన్ ఫ్రాన్సిస్కో, అట్లాంటాతో సహా వివిధ విమానాశ్రయాలకు భారత్ నుంచి 15 కంటైనర్లలో మామిడి షిప్‌మెంట్లు వెళ్లాయి. డాక్యుమెంటేషన్ లోపాల పేరుతో అమెరికా అధికారులు ఎగుమతైన ఆ మామిడి పండ్లను తిరస్కరించారు. అమెరికా నిర్ణయం మామిడిపండ్ల ఎగుమతిదారులను తీవ్ర షాక్‌కు గురి చేసింది. ఆ మామిడిపండ్లను తిరిగి భారత్‌కు తీసుకొచ్చినా అది తీవ్ర ఖర్చుతో కూడుకున్న వ్యవహారం. పాడైపోయే అవకాశం ఎక్కువే. దీంతో ఎటూ పాలుపోని పరిస్థితిలో ఉన్న చాలా మంది ఎగుమతిదారులు మామిడి సరకును అమెరికాలోనే పడేయ్యాలని నిర్ణయించుకున్నారు. ప్రపంచంలోనే మామిడి ఉత్పత్తిలో భారత్ అగ్రస్థానంలో ఉన్నది. అమెరికా.. భారత్‌కు ప్రధాన దిగుమతిదారుగా ఉన్నది. ఇంత పెద్ద మొత్తంలో భారత్ నుంచి ఎగుమతి అయిన మామిడిపండ్లను సరైన డాక్యుమెంటేషన్ లేదనే కారణంతో అమెరికా తిరస్కరించటం చర్చనీయాంశంగా మారింది. అమెరికా చర్యతో ఐదు లక్షల డాలర్ల అంటే రూ.4.27 కోట్ల నష్టాన్ని ఎగుమతి దారులు అంచనా వేస్తున్నారు. వాస్తవానికి ఈనెల 8, 9 తేదీలలో.. అమెరికాకు ఎగుమతి అయ్యే ఈ మామిడి పండ్లు ముంబయిలో ఇర్రేడియేషన్ ప్రక్రియకు వెళ్లాయి. అమెరికాకు ఎగుమతి కావాలంటే ఈ ప్రక్రియ తప్పనిసరి. మామిడిలో తెగుళ్ల తొలగించటానికి, అవి ఎక్కువ కాలం ఉండటానికి పండ్లను నియంత్రిత ఇర్రేడియేషన్‌కు పంపుతారు. ఈ ప్రక్రియ జరిగినప్పటికీ.. అక్కడి అమెరికా అధికారులు మాత్రం డాక్యుమెంటేషన్‌లో పొరపాట్లను కారణంగా చూపెడుతూ ఎగుమతిని తిరస్కరించారు. ముఖ్యంగా, పీపీక్యూ 203 ఫారంలో తప్పులు దొర్లాయని చెప్పారు. పీపీక్యూ 203 ఫారం సరిగ్గా జారీ చేయని కారణంగా సరకును తిరస్కరించినట్టు అమెరికా కస్టమ్స్ అండ్ బోర్డర్ ప్రొటెక్షన్ తెలిపింది. సరకును వెనక్కి పంపటమో, ధ్వంసం చేయటమో చేయాలని చెప్పింది. వెనక్కి పంపేందుకు అయ్యే ఖర్చును అమెరికా ప్రభుత్వం భరించదని అమెరికా వ్యవసాయ విభాగం స్పష్టం చేసినట్టు వ్యాపారులు తెలిపారు. ముంబయిలోని ఇర్రేడియేషన్ కేంద్రంలో యుఎస్‌డిఎ ప్రతినిధి పర్యవేక్షణలో ఈ ప్రక్రియ జరుగుతుందని వారు అన్నారు. అమెరికాకు మామిడి పండ్ల ఎగుమతికి అవసరమైన పిపిక్యూ203 ఫారమ్‌ను ఆ ప్రతినిధే ధ్రువీకరించాలి. ఇర్రేడియేషన్ కేంద్రంలో జరిగిన పొరపాట్లకు మేము నష్టపోవాల్సిన పరిస్థితి వచ్చిందని ఎగుమతిదారులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇర్రేడియేషన్‌కు సంబంధించిన నిబంధనలు పాటించలేదని అమెరికా అధికారులు చెప్తున్నదానిలో వాస్తవం లేదని ఒక వ్యాపారి తెలిపాడు. ప్రక్రియ పూర్తయ్యాకే పిపిక్యూ203 ఫారమ్ ఇచ్చారనీ, యూఎస్‌డీఏ అధికారి జారీ చేసిన ఆ ఫారమ్ లేకుండా ముంబయి ఎయిర్‌పోర్టులో మామిడి పండ్లను విమానంలోకి ఎక్కించటానికి కూడా అనుమతించరని వివరించాడు.

# దిద్దుబాటు చర్యల్లో బీజింగ్

- ఖర్చులు తగ్గించుకోవాలని నేతలకు సూచన

బీజింగ్, మే20 (జనంసాక్షి) : అమెరికాతో టారిఫ్ యుద్ధం తరవాత పరిస్థితుల్లో కొంత ప్రతికూల వాతావరణం ఏర్పడడంతో చైనా దిద్దుబాటు చర్యలకు దిగింది. దేశీయంగా ఖర్చులను తగ్గించుకునే పనిల పడింది. ఈ క్రమంలో మందగమనంలో ఉన్న ఆర్థిక వ్యవస్థను పునరుద్ధరించేందుకు చైనా తన ప్రయత్నాలను ముమ్మరం చేసింది. అందులోభాగంగా ప్రభుత్వంలోని అధికారులు ఖర్చులు తగ్గించుకోవాలని చైనా ప్రభుత్వం ఆదేశించింది. ప్రయాణాలు, మద్యం, సిగరెట్ ఖర్చులు తగ్గించుకునేలా ప్రణాళికలు వేసుకోవాలని పేర్కొంది. ఈమేరకు అక్కడి అధికారిక మీడియాలో కథనాలు వెలువడ్డాయి. ఆర్థిక వ్యవస్థపై ఒత్తిడి పెరుగుతున్న నేపథ్యంలో అధ్యక్షుడు జిన్‌పింగ్ నేతృత్వంలోని ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నట్లు- తెలుస్తోంది. అందులోభాగంగా అక్కడి ప్రభుత్వ అధికారులతో పాటు, అధికార పార్టీ నేతలకు కీలక ఆదేశాలు జారీ చేసింది. వాటి ప్రకారం ప్రయాణాలు, మద్యం, సిగరెట్, ఆహారం, కార్యాలయాల అద్దెలు వంటివి తగ్గించుకునేలా ప్రణాళికలు చేసుకోవాలని ఆదేశించింది. ప్రభుత్వ వనరులను ఖర్చు చేసేటప్పుడు జాగ్రత్త వహించాలని కోరింది. దుబారాను తగ్గించాలని పేర్కొంది. ఈ దుబారా ఖర్చులు చేయడాన్ని సిగ్గుచేటు చర్యగా ప్రభుత్వం అభివర్ణించింది. ఇటీవల కాలంలో స్థిరాస్తి విక్రయాలకు సంబంధించిన ఆదాయం విషయంలో చైనా నష్టాలను చూస్తోంది. అంతేకాక స్థానిక ప్రభుత్వాలపై అప్పుల భారం కూడా పెరిగిపోయింది. ఈ క్రమంలో అధికారులు చేసే ఖర్చులతో ఒత్తిడి పెరగకుండా ఉండేలా చర్యలు తీసుకుంటోంది. స్థానిక ప్రభుత్వాల ఆర్థికవృద్ధిని మెరుగుపరచాలని నిర్ణయించుకుంది. అందులోభాగంగా అక్కడి అధికారులను ఖర్చులు తగ్గించుకోవాలని ఆదేశించింది.

# గోల్డ్ స్మగ్లింగ్ కేసులో కన్నడ నటి రన్యారావుకు ఊరట

- షరతులతో కూడిన బెయిల్ మంజూరు

బెంగళూరు, మే20 (జనంసాక్షి) : గోల్డ్ స్మగ్లింగ్ కేసులో కన్నడ నటి రన్యారావుతోపాటు- తరుణ్ రాజ్ కొండూరుకు బెంగళూరు కోర్టు మంగళవారం బెయిల్ మంజూరు చేసింది. ఆర్థిక నేరాల ప్రత్యేక కోర్టు ఇద్దరికీ షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది. రూ. 2 లక్షల చొప్పున వ్యక్తిగత బాండ్, ఇద్దరి పూచీకత్తుతో బెయిల్ ఇచ్చింది. అధికారులు పిలిచిన సమయంలో తప్పనిసరిగా విచారణకు హాజరు కావాలని ఆదేశించింది. సాక్షాలను తారుమారు చేసేందుకు ప్రయత్నించ వద్దని, దర్యాప్తు అధికారులకు సహకరించాలని, కోర్టు నుంచి ముందస్తు అనుమతి లేకుండా దేశం విడిచి వెళ్ల కూడదని , భవిష్యత్తులో ఇదే తరహాలో నేరాల్లో పాల్గొనవద్దని కోర్టు ఆదేశించింది. ఈ ఆదేశాలను ఉల్లంఘిస్తే బెయిల్ రద్దవుతుందని హెచ్చరించింది. డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇం-టె-లిజెన్స్ 60 రోజుల్లోగా ఛార్జిషీట్‌ను దాఖలు చేయలేకపోయారు. ఈ నేపథ్యంలో వీరు బెయిల్ కోసం కోర్టును ఆశ్రయించారు. బెయిల్ పిటిషన్‌పై విచారణ జరిపిన కోర్టు , షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది. కన్నడ నటి అయిన రన్యారావును మార్చి 3న డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇం-టె-లిజెన్స్ అధికారులు అరెస్టు చేశారు. విమానాశ్రయంలో ఆమెను అదుపు లోకి తీసుకుని రూ. 12.56 కోట్ల విలువైన 14.2 కిలోల బంగారాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఇదే కేసులో తరుణ్‌రాజ్, సాహిల్ సకారియా జైన్‌లను అరెస్టు చేశారు.

# కేసీఆర్‌కు 'కాళేశ్వరం' నోటీసులు రాజకీయ కుట్ర

- విచారణ కమిషన్ నోటీసులివ్వడాన్ని తీవ్రంగా ఖండించిన తెలంగాణ రాష్ట్ర కల్లుగీత కార్పొరేషన్ మాజీ చైర్మన్ పల్లె రవి కుమార్ గౌడ్

హైదరాబాద్, మే 20 (జనంసాక్షి) : నాలుగుకోట్ల ప్రజల ఆరు దశాబ్దాల ఆకాంక్షలను సాకారం చేసిన తెలంగాణ రాష్ట్ర సాధకుడు, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ కు కాళేశ్వరం విచారణ కమిషన్ నోటీసులివ్వడం ముమ్మాటికీ రాజకీయ కుట్ర అని తెలంగాణ రాష్ట్ర కల్లుగీత కార్పొరేషన్ మాజీ చైర్మన్ పల్లె రవి కుమార్ గౌడ్ విమర్శించారు. కేసీఆర్ ప్రతిష్ట ను దెబ్బతీయాలన్న కుట్ర, వక్రబుద్ధి తప్ప మరేం లేదని మండిపడ్డారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఆయన మంత్రి వర్గం తెలంగాణ రాష్ట్ర సాధకుడు కేసీఆర్ మీద కుట్రలు, కుతంత్రాలు పక్కనపెట్టి ప్రజలకిచ్చిన హామీలు నెరవేర్చడం మీద దృష్టి పెట్టాలి. లేకపోతే రాజకీయంగా అథ:పాతాళానికి తొక్కడం ఖాయం అన్నారు. సమైక్య ఆంధ్రప్రదేశ్ పాలకుల వివక్ష కారణంగా దశాబ్దాలుగా ఇక్కడి ప్రజలు అనుభవిస్తున్న వేదనకు ముగింపు పలకాలన్న సంకల్పంతో కేసీఆర్ యుద్ధప్రాతిపదికన గొప్పమానవీయ కోణంతో రూపకల్పన చేసిన ప్రాజెక్టు కాళేశ్వరం అని తెలిపారు. వినూత్నమైన యోచన, ఆలోచనతో రూపకల్పన చేసిన మానవ నిర్మిత అద్భుతం ముమ్మాటికి అని తెలిపారు. ఆలోచన మొదలుకుని ఆ ప్రాజెక్టు తెలంగాణ జాతికి అంకితం చేసే ప్రతి దశలోనూ తెలంగాణ ప్రజల కష్టాలు, కన్నీళ్లు, కడగండ్లకు శాశ్వతంగా ముగింపు పలకాన్న వేదనాభరిత సంకల్పం తప్ప మరేం లేదని తెలిపారు. నిర్దేశిత లక్ష్యాన్ని పూర్తిచేసే మహాయజ్ఞంలో చిన్నపాటి ఇంజనీరింగ్ అధికారుల చిన్నపాటి అజాగ్రత్త వల్ల ఉత్పన్నమైన సమస్య అని, దీన్ని యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేయాల్సిందిపోయి, ఉద్దేశపూర్వకంగా 18నెలల కాలంగా రాజకీయ కుతంత్రానికి ఒడిగట్టింది రేవంత్ రెడ్డి ప్రభుత్వం అని తెలిపారు.

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at #119&120, 1st Floor, Down Town Mall, Lakdikapul, Hyderabad, Telangana-500004. Editor : M.M.RAHMAN RNINo. APTEL/2013/50370